అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 23-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 236 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

వాదనలిలా..

- కేంద్రం
  త్రిపుల్ తలాఖ్ ముస్లిం మహిళల హక్కులకు వ్యతిరేకం
- పర్సనల్ లా బోర్డు
  మతపరమైన అంశం.. కోర్టులు దూరంగా ఉండాలి
- జమాయత్-ఎ- ఇస్లామే హింద్
  కోర్టుల జోక్యం వద్దు
- ముస్లిం స్కాలర్స్
  ఖురాన్‌లో త్రిపుల్ తలాఖ్ ప్రస్తావనే లేదు

ఐదుగురు ధర్మాసనం తీర్పు ఇలా..
ఇది రాజ్యాంగ విరుద్ధం.. ముగ్గురు జడ్జిలు
ప్రభుత్వమే చట్టం చేయాలి.. ఇద్దరు జడ్జిలు

చారిత్రాత్మకం

ప్రధాని మోడీ ట్వీట్



9లో

స్వాగతిస్తున్నాం..

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో, ఐద్వా

వివరాలు 9లో



రాజ్యాంగ విరుద్ధం

ట్రిపుల్ తలాఖ్ మహిళల ప్రాథమిక హక్కులకు భంగం

- ఖురాన్ నిబంధనలకు విరుద్ధం
- ఆరు నెలల్లోగా చట్టం తేవాలని కేంద్రానికి ఆదేశం
- నిషేధం అమలులో ఉంటుందని స్పష్టీకరణ
- 3-2 మెజారిటీతో ఐదుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం తీర్పు



న్యూఢిల్లీ: మూడుసార్లు తలాఖ్ చెప్పడం ద్వారా ముస్లిం మహిళలకు విడాకులిచ్చే పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఖురాన్ నిబంధనలకు తలాఖ్ వ్యతిరేకంగా ఉన్నదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మహిళల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందని తెలిపింది. ఆరు నెలల్లోగా ...9లో

షయారా బానో సుదీర్ఘపోరాటం



త్రిపుల్ తలాఖ్ కేసు విషయంలో సుప్రీం సంచలనతీర్పు ఇచ్చినా..దీని వెనుక షయారా బానో పడిన కష్టాలు అన్నిఇన్ని కావు. న్యాయం కోసం ఆమె సుదీర్ఘ పోరాటం చేశారు. ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్‌కు చెందిన బానోను ఆమె కుటుంబసభ్యులు రిజ్వాన్ అహ్మద్‌కు ఇచ్చి పెండ్లి చేశారు. అంతా బాగుందనుకుంటున్న దశలో.. 2015లో ఆమె పుట్టింటిలో ఉండగా స్పీడ్‌పోస్టు వచ్చింది. అందులో త్రిపుల్ తలాఖ్ చెబుతున్నట్టు రిజ్వాన్ పేర్కొన్నాడు. అప్పటికే ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చిన బానోకు ఏం చేయాలో పాలుపోలేదు. ఇదేం ఖర్మరా..అంటూ శోకసాగరంలో మునిగిపోయింది. ఎలాంటి కారణం లేకుండానే తనకు విడాకులు ...9లో

ఉపాధినివ్వని బతుకమ్మ

ఆర్డర్లలో జాప్యమే కారణం

- జనవరిలో ఇవ్వాల్సింది.. మేలో ఇచ్చిన వైనం...
- సిరిసిల్ల చీరెల్లో ఇప్పటి వరకూ యాభై శాతమే తయారీ
- ప్రాసెసింగ్, ప్రింటింగ్, డైయింగ్ కోసం సూరత్, భీవండి, తమిళనాడుకు..
- కార్మికులకు ఉపాధి అంతంతమాత్రమే...



ఇవి సిరిసిల్లలో తయారైన ప్లెయిన్ చీరలు.. వీటికి ఇతర రాష్ట్రాల్లో రంగులద్దుతున్నారు..

బి.వి.యన్.పద్మరాజు

రాష్ట్రంలోని మరమగ్గం కార్మికులకు బతుకునివ్వాల్సిన 'బతుకమ్మ' చేతులెత్తేసింది. వారికి ఉపాధి కల్పించాల్సిన చీరెలు.. ఆ పని చేయలేని నిస్సహాయ స్థితికి చేరాయి. పాలకుల ఉదాసీనత.. ఆర్డర్లలో జాప్యం.. వెరసి కార్మికుల కడుపుకొడుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటి వరకూ ఊదరగొట్టిన బతుకమ్మ చీరెల ప్రహసనం.. నామ్‌కే వాస్తేగా తయారైంది. బతుకమ్మ చీరెలను ఉత్పత్తి చేయించటం ద్వారా ఇటు మరమగ్గం కార్మికులకు చేతినిండా పని కల్పిస్తాం, అటు పేద మహిళలందరికీ వస్త్రాలను అందజేస్తామంటూ మంత్రి కేటీఆర్ చేసిన ప్రకటన.. కేవలం ప్రకటనగానే మిగిలింది. ఫలితంగా మరమగ్గం కార్మికుల ఉపాధి ఆశలు అడియాశలయ్యాయి.

బతుకమ్మ చీరెల పేరిట ప్రభుత్వం నిన్న, మొన్నటి వరకూ నానా హడావుడీ చేసింది. వీటి తయారీ కోసం కేటీఆర్ సొంత నియోజకవర్గమైన సిరిసిల్లను ప్రధాన కేంద్రంగా ఎంచుకుంది. ఆ పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని మరమగ్గాల మీద బతుకమ్మ చీరెలను ఉత్పత్తి చేయిస్తామని సర్కారు ...10లో

ఏకపక్షంగా కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణ

భారీగా టీఆర్ఎస్ కార్యకర్తల తరలింపు

- ఎంపీలు, ఎమ్మెల్యేల అనుచరుల హంగామా
- పోలీసుల నిర్బంధం నడుమ అభిప్రాయ సేకరణ
- మా శవాల మీద రిజర్వాయర్ కట్టండి : రాయగిరిలో రైతుల నిరసన
- రెండు టీఎంసీల కోసం ఏడు గ్రామాల్ని ముంచుతారా : నిజామాబాద్‌లో నిర్వాసితులు



నవతెలంగాణ-యంత్రాంగం

కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణంపై పలు జిల్లాల్లో కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణను రాష్ట్ర సర్కారు పోలీసుల నిర్బంధం నడుమ ఏకపక్షంగా కానిచ్చేస్తున్నది. ఎక్కువగా టీఆర్ఎస్ శ్రేణులను సమీకరించిన అధికార పార్టీనేతలు అనుకూలంగా మాట్లాడించారు. 'నిర్వాసి తులు తక్కువ...టీఆర్ఎస్ కార్యకర్తలు ఎక్కువ' అన్న చందంగా ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఎంపీల, ఎమ్మెల్యే అనుచరులే హంగామా సృష్టించారు. పరిహారం గురించి ...9లో



బిల్డింగ్‌కు రూ.10 కోట్లు ప్రచారానికీ రూ.10 కోట్లు

సర్కారు ప్రకటనల తీరిది...

- మొన్న వెంకయ్యకు పౌరసన్మానం ప్రకటనలకు రూ.15 కోట్లు
- ఆయా సామాజికవర్గాలకు దగ్గరయ్యేందుకేనా..?

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా బుద్వేల్‌లో నిర్మించతలపెట్టిన రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి (ఆర్‌బివిఆర్ఆర్) ఎడ్యుకేషనల్ క్యాంపస్ భవన నిర్మాణానికి మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. దీనికోసం ప్రభుత్వం పది ఎకరాల భూమిని కూడా కేటాయించింది. అదనంగా మరో ఐదెకరాలు కేటాయిస్తున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. అంతేగాకుండా ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం పదికోట్లు విడుదల చేసింది. దీనికి సంబంధించి ...9లో

తానిచ్చింది చంద్రునికో నూలుపోగు: కేసీఆర్ 9లో

పంచాయతీ గోస

గ్రామీణాభివృద్ధి విలవిల

గాడి తప్పిన పాలన

- మూడు వేల పోస్టులు ఖాళీ
- అస్తవ్యస్తంగా పథకాల అమలు తీరు
- ఉలుకు, పలుకూ లేని సర్కారు



వివరాలు 12లో

గ్రామ సీమలే దేశానికి పట్టుగొమ్మలు... జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన ఈ మాటలను మన పాలకులు ఎప్పుడో గాలికొదిలేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే విషయాన్ని నొక్కిచెప్పారు. తాము అధికారంలోకొస్తే గ్రామాల రూపు రేఖల్ని మార్చేస్తామంటూ ఆయన వాగ్దానమిచ్చారు. అయితే సీఎం చెప్పిన మాటలు.. ఆచరణలో నీటి మూటలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

- ఆసిఫాబాద్ జిల్లాలో 'సారండీ' జాతరకు వెళ్లొస్తుండగా ఘటన

నవతెలంగాణ - కెరమెరి / ఆసిఫాబాద్

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. ఆరుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన 'సారండీ' జాతరకు వెళ్లొస్తుండగా ఆసిఫా బాద్ జిల్లా వాంకిడి మండలం బీడారాలో ...9లో

తెలుగు రాష్ట్రాల్లో జడ్జీలకు పచ్చజెండా

నియామకాలకు మార్గదర్శకాలు

- సుప్రీంకు సమర్పించిన కేంద్రం
- 'ఆప్షన్' 'సీనియారిటీ'పై తెలంగాణ న్యాయాధికారుల అభ్యంతరం 9లో
- సెప్టెంబర్ 5కు తదుపరి విచారణ



సచివాలయమా.. ఎలుకల అడ్డానా

హైదరాబాద్ : సచివాలయం కల తప్పింది. తొలి రెండేండ్ల పాటు ఆంధ్రప్రదేశ్ సర్కారు ఇక్కడే ఉండడంతో అంతో ఇంతో హడావిడి ఉంది. కానీ ఈ ఏడాది ఏపీ సచివాలయం పూర్తిగా అమరావతికి వెళ్లిపోవడం, మరోవైపు వాస్తు భయంతో తెలంగాణ సీఎం సహా మంత్రులెవరూ పెద్దగా సచివాల యంలో కనబడడం లేదు. ఉన్నతాధికారులు కూడా సచివాలయానికి చుట్టపుచూపుగా వస్తున్నారు. దీంతో ఎలుకలు రాజ్యమేలుతున్నాయి. ఏ చాంబర్ లో చూసినా డజన్ల కొద్దీ ...9లో



.. ఆకలి, నీళ్లు నిప్పులు, పని అని నకరాలు చేశావనుకో.. శాంతి భద్రతల కింద లోపలేస్తారు.. సారు..!!

మూతపడ్డ బ్యాంకులు

నిలిచిన కార్యకలాపాలు.. రోడ్డుకెక్కిన ఉద్యోగులు

- సమ్మె విజయవంతమైంది : యూఎఫ్‌బీయూ

న్యూఢిల్లీ, నవతెలంగాణ-యంత్రాంగం : ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకింగ్ రంగాన్ని నిర్వీర్యం చేయోద్దంటూ.. బ్యాంక్ యూనియన్ల యునైటెడ్ ఫోరం (యూఎఫ్‌బీయూ) ఇచ్చిన సమ్మె పిలుపు మేరకు మంగళవారం బ్యాంకు కార్యకలాపాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. 21 బ్యాంకులకు సంబంధించి.. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగుల ఈ సమ్మెలో పాల్గొనటంతో.. దీని ప్రభావం ఎక్కువగా కనిపించింది. చెక్ క్లియరెన్స్‌లు, మనీ ట్రాన్స్‌ఫర్, క్యాష్ రెమిటెన్స్‌తో సహా పలు లావాదేవీలకు తీవ్ర ఆటంకం కలిగింది. గ్రామాల్లో ఉన్న బ్యాంకులతో పాటు మహానగరాల్లో ఉన్న బ్యాంకులన్నీ పూర్తిగా ...9లో

భోపాల్‌లో..



హైదరాబాద్‌లో..



గురుకుల పీడీ అభ్యర్థులకు షాక్

- మెయిన్స్ పరీక్ష రద్దు
- 7న తిరిగి నిర్వహణ : టీఎస్‌పీఎస్సీ

వివరాలు 9లో

రాజస్థాన్ సర్కారు దవాఖానాలో దారుణం

- ఆస్పత్రి నిర్లక్ష్యం.. ఆవరణలో బెంచ్‌పైనే ప్రసవం..



జైపూర్ : బీజేపీ పాలిత రాష్ట్రం రాజస్థాన్‌లో మానవత్వం మరో సారి మంటగలిసింది. ఆస్పత్రి నిర్లక్ష్యంతో మహిళ ఆస్పత్రి ప్రాంగణంలోని బహిరంగ ప్రదేశంలోని ఒక బెంచీ మీదే ప్రసవమైన ఘటన చోటు చేసుకుంది. అల్వార్ జిల్లాలో బెహ్రూలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలిని నెహ్యా (27)గా గుర్తించారు. పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరిన ఆమెను ఇంకా టైముందంటూ.. పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారు. నొప్పులొస్తున్నాయని చెప్పినా వినిపించుకోలేదు. పైగా వాకింగ్ చేయమంటూ పురమాయించారు. ఆమె ఆస్పత్రి బయటకు వచ్చి నడుస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. అక్కడి బెంచ్‌మీదే ఆమె శిశువుకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీ, బిడ్డా క్షేమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమంలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆస్పత్రి నిర్లక్ష్యంపై రాజస్థాన్ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇది సిగ్గుపడాల్సిన ఘటన. ఆస్పత్రి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని మహిళా కమిషన్ చైర్మెన్ సుమన్ శర్మ డిమాండ్ చేశారు. కాగా, ఈ ఘటన నేపథ్యంలో జిల్లా మేజిస్ట్రేట్ ఆస్పత్రిని సందర్శించారు. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదుచేసుకున్నారు.

నిన్న విలీనం.. నేడు తిరుగుబాటు

- పళనిస్వామి సర్కారుకు 19 మంది ఎంఎల్‌ఏల మద్దతు ఉపసంహరణ

చెన్నై : తమిళనాడు రాజకీయాల్లో సంక్షోభం ఇంకా కొనసాగుతోంది. అన్నా డిఎంకెలోని పళనిస్వామి, పన్నీర్ సెల్వం గ్రూపులు విలీనమైన మరుసటి రోజే ఆ పార్టీలో తిరుగుబాటు ప్రారంభమైంది. దినకరన్ వర్గానికి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ప్రకటిం చారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్ విద్యా సాగరరావును మంగళవారం కలిసి ఈ మేరకు వేర్వేరుగా లేఖలు అందించారు. ముఖ్యమంత్రి పళనిస్వామి తమ విశ్వాసాన్ని కోల్పోయినందున తాము ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించు కుంటున్నట్లు వారు తమ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని రాజ్యాంగ ప్రక్రియను సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు గవర్నర్‌ను కోరారు. ఈ పరిణామం చోటుచేసుకున్న కాసేపటికే విశ్వాసపరీక్షను డిమాండ్ చూస్తూ డిఎంకె నేత స్టాలిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో దినకరన్‌తో గవర్నర్‌ను కలిసిన 19 మంది ఎంఎల్‌ఏలు కాకుండా మరో ముగ్గురు కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని ఆయన పేర్కొనడం కలకలం రేపింది. సాయంత్రానికి మరో ముగ్గురు ఎంఎల్‌ఏలు కూడా గవర్నర్‌ను కలిసి, ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఆ ముగ్గురు ఎవ్వరన్న విషయంలో స్పష్టత రాలేదు. గవర్నర్ కార్యాలయం కూడా దీనిపై స్పందించలేదు. అంతకుముందు గవర్నర్‌ను కలిసిన దినకరన్ గ్రూపునకు చెందిన ఎంఎల్‌ఏలు మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ తమ లేఖలను అందుకున్నారని, తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వివరించారు. తరువాత గవర్నర్ ముంబయికి వెళ్లిపోయారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. దినకరన్ మద్దతుదారుడైన ఆండిపట్టి ఎమ్మెల్యే తంగతమిళసెల్వం మీడియాతో మాట్లాడుతూ తాము ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. ముఖ్యమంత్రిని ఎలా మారుస్తామో మీరే చూస్తారు' అంటూ ఆయన వ్యాఖ్యలు చేశారు.

పాండిచ్చేరిలో క్యాంపు

ప్రభుత్వం పై తిరుగుబాటు జెండా ఎగరవేసిన ఎంఎల్‌ఏలు ఆ వెంటనే పాండిచ్చేరికి తరలివెళ్లారు. సముద్రపు ఒడ్డున ఉన్న ఒక రెస్టారెంట్‌లో తిరుగుబాటు ఎంఎల్‌ఏల కోసం ప్రత్యేకంగా 22 గదులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. పాండిచ్చేరిలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న విషయం తెలిసిందే.

మెజార్టీకి మూడు స్థానాలు తక్కువ

ప్రస్తుత బలాబలాలు ఇదే విధంగా కొనసాగితే పళని స్వామి వర్గానికి సాధారణ మెజార్టీకి ముగ్గురు తక్కువ అవుతారు. మొత్తం 234 మంది శాసనసభ్యులున్న సభలో జయలలిత మరణంతో ఈ సంఖ్య 233కు తగ్గింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 134 స్థానాలను గెల్చుకున్న అన్నాడిఎంకె తరువాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో గెలుపొందటంతో ఆ పార్టీ బలం 136కు పెరిగింది. ప్రస్తుతం పళని స్వామి వర్గంలో 104 మంది ఎమ్మెల్యేలుండగా పన్నీర్ సెల్వం గ్రూపులో లో 10 మంది, దినకరన్ గ్రూపులో 20 మంది వున్నారు. అసెంబ్లీలో సాధారణ మెజార్టీకి 117 మంది సభ్యుల మద్దతు అవసరం కాగా ప్రస్తుతం పళనిస్వామి సర్కారుకు 114 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మద్దతునిస్తున్నారు. దినకరన్‌తో కలిసి గవర్నర్‌కు లేఖలు ఇచ్చిన వారు కాకుండా మరో ముగ్గురు కూడా తిరుగుబాటు ఎగరవేశారన్న వార్తలు నిజమైతే ఈ సంఖ్య ఇంకా పడిపోనుంది.

మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో... ప్రధానోపాధ్యాయుడి అరెస్ట్

పుదుచ్చేరి : చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించే గురువులను పర్యవేక్షించాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు గాడి తప్పాడు. కామాంధుడిగా మారిపోయి అభం శుభం తెలియని ఐదేండ్ల చిన్నారిపై అఘాయిత్యానికి ఒడిగట్టి కటకటాలపాలయ్యాడు. పుదుచ్చేరిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కరైకల్ (నార్త్) ఎస్పీ మారిముత్తు తెలిపిన వివరాల ప్రకారం..పాక్రిసామి (42) సేతూర్ గ్రామంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో ప్రధానోపాధ్యాడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 18న పాఠశాల వదిలిపెట్టిన సమయంలో ఓచిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన చిన్నారి హెడ్‌మాస్టర్ అఘాయిత్యం గురించి తల్లిదండ్రులకు చెప్పింది. చిన్నారి తల్లిదండ్రులు మరుసటిరోజు పాఠశాలకు వెళ్లారు. ఈఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రేటర్ నోయిడాలో రైతుల ఆందోళన

గ్రేటర్ నోయిడా : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రేటర్ నోయిడా పారిశ్రామిక అభివృద్ధి అథారిటీ కార్యాలయం (జీఎన్ఐడీఏ) ముందు రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. 'హైకోర్టు ఆదేశాల మేరకు తమకు భూమి కేటాయింపులోనూ, రావాల్సిన నగదు చెల్లింపుల్లోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని' రైతులు ఆరోపిం చారు. కాగా, రైతుల ఆందోళనలతో దిగొచ్చిన అధికారులు, వారితో చర్చలు జరిపారు. నగదు చెల్లింపులను త్వరలో చేపడతామని అధికారు లు హామీ ఇచ్చారు.

ఆర్‌జేడీ నేత షహబుద్దీన్‌పై చార్జిషీటు

న్యూఢిల్లీ : ఆర్‌జేడీ నేత, సివాన్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎన్నికైన మహమ్మద్ షహబుద్దీన్‌పై సీబీఐ మంగళవారం చార్జిషీటు నమోదుచేసింది. ప్రముఖ హిందీ డైలీ జర్నలిస్టు రాజ్దో రంజన్ హత్యకేసులో నేరపూరిత కుట్రకు పాల్పడిన అభియోగాలతో ఈ చార్జిషీటు దాఖలైంది. షహబుద్దీన్ పేరును పేర్కొంటూ ముజఫర్‌పూర్ ప్రత్యేక కోర్టులో అనుబంధ చార్జిషీటును మంగళవారం దాఖలు చేసింది.

ముంబయి పేలుళ్ల కేసు.. సెప్టెంబరు 7న తీర్పు


ముంబయి : 1993 ముంబయి బాంబు పేలుళ్ల కేసుకు సంబంధించి అబూ సలేం సహా దోషులందరికీ సెప్టెంబరు 7న శిక్షలు ఖరారు కానున్నాయి. ఉగ్ర కార్యకలాపాల నిరోధక చట్టం (టాడా) ప్రత్యేక న్యాయస్థానం దోషులకు శిక్షలు ఖరారుచేయనుంది. పేలుళ్ల కేసులో ఐదుగురిని దోషులుగా పేర్కొంటూ 2017 జూన్ 16న కోర్టు తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. అబూ సలేం, ముస్తఫా డొస్సా, కరీముల్లా ఖాన్, ఫిరోజ్ అబ్దుల్ రషీద్ ఖాన్, రియాజ్ సిద్దిఖీ, తాహిర్ మర్చంట్‌లను దోషులుగా పేర్కొంటూ న్యాయమూర్తి జీఏ సనప్ తీర్పునిచ్చారు. జూన్ 28న ప్రధాన దోషి ముస్తఫా డొస్సా గుండెపోటుతో మతి చెందాడు. ఇక మిగిలిన వారికి శిక్షలను సెప్టెంబరు 7న ఖరారు కానున్నాయి.

గోరఖ్‌పూర్ బీఆర్డీ ఆస్పత్రి ప్రిన్సిపాల్‌పై కేసు

- యూపీ సీఎం యోగి ఆదేశాలు



లక్నో : గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్‌దాస్ (బీఆర్డీ) ఆస్పత్రి ప్రిన్సిపాల్ ఆర్‌కే మిశ్రా సహా మరో ఆరుగురు సిబ్బందిపై కేసు నమోదు చేయాలని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్ పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా, బీఆర్డీ ఆస్పత్రిలోని చిన్నారుల వార్డులో ఆక్సిజన్ సరఫరా అందకపోవడంతో 85మంది చిన్నారులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత యోగీ సర్కార్‌పై దేశ వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో, ఈ ఘటనపై యుద్ధప్రాతిపదికన ఉన్నతస్థాయి విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని చీఫ్ సెక్రటరీ రాజీవ్‌కుమార్‌ను సీఎం ఆదేశించారు. ఆక్సిజన్ సరఫరా లోపంతోనే చిన్నారులు మృతి చెందినట్టు సీఎస్ తాజా నివేదిక ఇచ్చారు. బీఆర్డీ ఆస్పత్రి ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు.



కర్నాటకలో... ఆర్మీ జవాను తల్లిదండ్రులపై గూండాల దౌర్జన్యం

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు, పోలీసులు



బెంగళూర్ : దేశ రక్షణ కోసం సరిహద్దులో పహారా కాస్తున్న ఆర్మీ జవాను తల్లిదండ్రులపై స్థానిక గూండాలు దౌర్జన్యానికి పాల్పడుతున్నా రు. అంతేగాకుం డా, సైనికుడి స్థలాన్ని బలవంతంగా ఆక్రమించుకుంటా మని బెదిరిస్తున్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...బెల్గావీ జిల్లాలోని తోటగట్టి గ్రామానికి చెందిన విఠల్ కద్యోల్ దేశ సైన్యంలో పనిచేస్తున్నాడు. అతను విధుల నిమిత్తం కొంతకాలంగా శ్రీనగర్‌లోనే ఉంటున్నాడు. అతనికి ఒక ఎకరం 8 గుంటల స్థలం ఉన్నది. ఈ స్థలాన్ని ఎలాగైనా కబ్జా చేయాలని స్థానిక రాజకీయవే త్త ప్రయత్నిస్తు న్నాడు. కొందరు గూండాలను స్థలంపైకి పంపించి సైనికుడి తండ్రి మల్లికార్జున్ బషెత్తెప్పను ఇబ్బందిపెడుతున్నాడు. అంతేగాకుండా, తోట గట్టి గ్రామంలోని నల్లాల వద్ద నీళ్ల పట్టుకోకుండా అడ్డుకుంటున్నాడు. వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లనీయకుండా బెదిరిస్తున్నాడు. విషయం తెలుసుకున్న విఠల్ అత్యవసర సెలవుపై బెల్గావీ గ్రామానికి తిరిగి వచ్చా రు. గూండాల దౌర్జన్యం గురించి జిల్లా కమిషనర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. అయితే, దీనిపై పోలీసులు స్పందించడంలేదు. ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అవసరమైతే తామే రాజీ కుదుర్చు తామని తహసీల్దార్, ఇన్స్పెక్టర్ చెబుతున్నారని విఠల్ పేర్కొన్నారు. తాను 25న ఆర్మీ ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయాల్సి ఉందన్నారు. తాను వెళ్లిపోయిన తర్వాత గూండాలు తన తల్లిదండ్రులను ఇబ్బందులు పెడతారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, తమ సమస్యపై ప్రభు త్వం ఇప్పటికైనా స్పందించలేకపోయినట్టయితే ఆత్మహత్య చేసుకునేందుకైనా తమను అనుమతించాలని విఠల్ తల్లిదండ్రులు కోరుతున్నారు. దేశంకోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడే విఠల్ లాంటి సైనికునికి సాయం అందిస్తామని ఇండియన్ ఆర్మీ ఫోరమ్ ప్రెసిడెంట్ శశాంక్ తెలిపారు.

ఢిల్లీలో కదం తొక్కిన ఆశాలు

- డిమాండ్ల సాధన కోసం 50లక్షల సంతకాల సేకరణ
- ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి నెలకు రూ.18వేలు వేతనం చెల్లించాలి : సీఐటీయూ కార్యదర్శి తపన్‌సేన్ డిమాండ్



న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం దాదాపు 6వేల మంది ఆశావర్కర్లు కదంతొక్కారు. జంతర్ మంతర్ వద్ద ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తారు. అనంతరం రామ్‌లీలా మైదానంలో సమావేశమయ్యారు. 50లక్షల సంతకాల సేకరణ చేపట్టిన పిటిషన్‌ను కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి అందజేశారు. జంతర్‌మంతర్ వద్ద జరిగిన సమావేశాన్ని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభించారు. ఆవిష్కృతంగా ఉన్న ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను ప్రయివేటీకరించొద్దని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రమాణాలను మెరుగుపర్చడంతో పాటు మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. దేశజీడీపీలో 6శాతం ప్రజారోగ్యం కోసం కేటాయించాలని కోరారు. ఆశావర్కర్లను హెల్త్‌వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

అంతేగాకుండా, ఆశావర్కర్ల సేవలను రెగ్యులరైజేషన్ చేయడంతో పాటు కనీస వేతన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. నెలకు రూ.18వేలు వేతనం చెల్లించడంతో పాటు డీఏ, పెన్షన్, గ్రాట్యుటీ, మెటర్నటీ బెనిఫిట్‌లను అందించి సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నవంబర్9, 10, 11 తేదీల్లో మరోసారి సమావేశం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రంజనా నిరూల (ఏఐసీసీఏడబ్ల్యు) ఆశా శర్మ (ఐద్వా), సునీల్ చోప్రా (అఖిల భారత వ్యకాస), విజూ క్రిష్ణన్ (అఖిల భారత కిసాన్ సభ), వీపీ సానూ (ఎస్ఎఫ్ఐ) తదితరులు పాల్గొన్నారు.

విదేశీ యాత్రలో ఉండగా పాస్‌పోర్టుల రద్దు విధానం

పునరాలోచనకు కేంద్రానికి సూచన

న్యూఢిల్లీ : భారత పౌరులు విదేశాలలో ఉన్న సమయాలలో వారి పాస్‌పోర్టులను రద్దు చేయడం వల్ల కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోవాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రానికి సూచించింది. ఇలాంటి చర్యలు తీసుకునే ముందే పర్యవసానాల గురించి ఆలోచించాలని సలహా ఇచ్చింది. పాస్‌పోర్టు లేని కారణంగా వారు స్వదేశానికి తిరిగి రాలేరని, దేశం కాని దేశంలో పడరాని పాట్లు పడతారని కోర్టు గుర్తుచేసింది. ఇద్దరు దంపతుల కేసు విచారణ సందర్భంలో ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్, జస్టిస్ సి హరి శంకర్‌లతో కూడిన ధర్మాసనం ఈ సూచన చేసింది. 1995లో ప్రభుత్వం వారి పాస్‌పోర్టులను రద్దు చేయడంతో ఐక్యరాజ్యసమితి అనుబంధ శరణార్థుల కమిషనర్ ఆశ్రయం తీసుకుని కెనడా పాస్‌పోర్టు కోసం ప్రయత్నించి కష్టపడి పొందగలిగారు. ఇలాంటి కేసులు చాలా ఉన్నాయని కోర్టు గుర్తుచేసింది. నాగాలాండ్ హక్కుల కార్యకర్త, ఆయన భార్యకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా పాస్‌పోర్టు రద్దు చేయడంతో ఈ పరిస్థితి ఎదురైందని కోర్టు తెలిపింది. అందువల్ల పాస్‌పోర్టుల రద్దుకు స్పష్టమైన విధివిధానాలు ఉండాలని అడిషనల్ సొలిసిటర్ జనరల్ సంజయ్ జైన్‌కు వివరించారు. ఆయన సమాధానం ఇస్తూ వీరి విషయంలో బాధితులు ఇండియా పౌరులుగానే కోర్టు ప్రకటించినట్లయితే వారు స్వేచ్ఛగా దేశంలోకి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని, తగిన వ్యవధిలోగా వారికి పాస్‌పోర్టు వస్తుందని, అయితే ఈ లోపున వారు తమ కెనడా పౌరసత్వాన్ని రద్దుచేసుకోవాలని సూచించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు బాధితుల తరఫు న్యాయవాదికి ఈ విషయాలను పిటిషనర్లకు తెలియచేయాల్సిందిగా ఆదేశించింది.

యువ పారిశ్రామికవేత్తలే అభివృద్ధికి సైనికులు

ఢిల్లీ: దేశాభివృద్ధికి యువ పారిశ్రామిక వేత్తలే సైనికులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. నిటిఆయోగ్ ఏర్పాటు చేసిన ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్ కార్యక్రమానికి హాజరైన దాదాపు 200 మంది యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశాభివృద్ధికి యువత తమ వంతు కృషి చేయాలని ప్రధాని మోదీ కోరారు. అందుకు మహాత్మాగాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

రబ్రీదేవికి ప్రతిపక్ష నేత హోదాను తిరస్కరించిన బీహార్ ప్రభుత్వం

- నిబంధనల పేరుతో అడ్డుకుంటున్నారని రబ్రీ ఆగ్రహం



పాట్నా : బీహార్‌లో కొత్తగా ఏర్పడిన జేడీ(యూ)-బీజేపీ ప్రభుత్వంపై ఆర్‌జేడీ నాయకురాలు రబ్రీదేవి తీవ్రంగా విమర్శించారు. శాసన మండలిలో తనకు ప్రతిపక్షనేత హోదాను ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించడంపై మంగళ వారం ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ముసుగులో తనకు ఆ హోదాను నిరాకరిస్తున్నారని ఆమె విమర్శించారు. రబ్రీదేవికి ప్రతిపక్ష నేత హోదా కల్పించేందుకు తగినంత మంది ఎమ్మెల్సీలు ఆర్జేడికి లేరని ప్రభుత్వం పేర్కొంది. అంతకుముందు శాసన మండలిలో ఆర్జేడికి నలుగురైదుగురు సభ్యులు మాత్రమే వున్నప్పుడు గులామ్ గౌస్‌కు ప్రతిపక్ష నేత కల్పించారని, ఇప్పుడు నిబంధనల పేరుతో కాదంటున్నారని ఆమె విమర్శించారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా ఉండాలంటే ఆ పార్టీకి కనీసం 9 మంది ఎమ్మెల్సీలు ఉండాలి. కానీ ఆర్జేడికి ప్రస్తుతం 7గురు సభ్యులు మాత్రమే ఉన్నారు. అందువల్ల ఆర్జేడి అభ్యర్థనను పరిశీలించలేక పోయినట్లు బీహార్ శాసన మండలి డిప్యూటి ఛైర్మన్ హరున్ రషీద్ తెలిపారు.

నీట్ నుంచి మినహాయింపు లేదు

కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించండి • తమిళనాడుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : జాతీయ అర్హతా ప్రవేశ పరీక్ష (నీట్) నుంచి మినహాయింపు లేదని తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తెలిపింది. కౌన్సిలింగ్ ప్రక్రియను వెంటనే ప్రారంభించి సెప్టెంబరు 4లోగా ముగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేంద్రం కూడా నీట్ నుంచి తమిళనాడుకు మినహాయింపు లేదని తెలిపింది. తమిళనాడు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశామని, నీట్ నుంచి మినహాయింపు కోరడం చట్ట సమ్మతం కాదని తెలిపింది. వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్‌ను తమిళనాడు వ్యతిరేకిస్తోంది. సిబిఎస్ఈ విద్యార్థులకు నీట్ అనుకూలంగా వుందని, గ్రామీణ విద్యార్థులు నష్టపోతారని అంటోంది.

ఎన్‌కౌంటర్‌లో తీవ్రవాది హతం

శ్రీనగర్ : ఉత్తర కాశ్మీర్‌లో కుప్వారా జిల్లాలోని హంద్వార వద్ద భద్రతాదళాలకు, తీవ్రవాదులకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక తీవ్రవాది హతమయ్యాడు. హంగ్నికోట్ అటవీప్రాంతంలో భద్రతాదళాలు గాలింపు చర్యలు జరుపుతున్న సమయంలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని సైనిక అధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో సమాచార వ్యవస్థ బలహీనంగా వుండటంతో పూర్తి వివరాలు తెలియడం లేదు. ఈనెల 16న దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కర్‌తోయిబాజిల్లా కమాండర్ మృతిచెందగా, ఈనెల 13న ఎన్‌కౌంటర్‌లోకమాండర్ యాసిన్‌తో సహా ముగ్గురు హిజ్బుల్ ముజహిదీన్ తీవ్రవాదులు హతమయ్యారు. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సైనికులు కూడా మృతిచెందారు. జులై 30 నుంచివివిధ ఎన్‌కౌంటర్‌ల్లో 23మంది తీవ్రవాదులను భద్రతా దళాలు మట్టు బెట్టాయి.

మహాత్మా.. మా నియంతకు మంచి బుద్ధి ప్రసాదించు..

- రాజ్‌ఘాట్ వద్ద టీవీయూవీ మౌనదీక్ష



నవతెలంగాణ - ఢిల్లీ

తెలంగాణాలో అత్యంత నిరంకుశంగా, నియంతలాగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయూవీ) జాతిపిత మహాత్మాగాంధీని వేడుకుంది. మంగళవారం ఢిల్లీలోని మహాత్ముని సమాధి (రాజ్‌ఘాట్) వద్ద టీవీయూవీ నేతలు మౌనదీక్షకు కూర్చున్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేసీఆర్.. ప్రజాస్వామ్యానికి గొంతుకైన ధర్నాచౌక్‌ను ఎత్తేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీవీయూవీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, సలీంపాషా తదితరులు పాల్గొన్నారు.

నిజాం పాలన తలిపిస్తున్న కేసీఆర్

ప్రశ్నించే గొంతులు నొక్కుతున్న వైనం

- పోరాడి సాధించిన తెలంగాణలో కుటుంబ పాలన
- ప్రాజెక్టుల పేర వేల కోట్ల దోపిడీ
- రాష్ట్ర సర్కారుపై పోరాటం కొనసాగించాలి : రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న అగ్నివేశ్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ విధానాలతో నిజాం పాలన తలపిస్తున్నారని పలువురు వక్తలు ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో కుటుంబ పాలన నడుస్తోందని దుయ్యబట్టారు. ప్రాజెక్టుల పేర వేల కోట్లను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను 'బంగారు తెలంగాణ'గా మార్చుకునేందుకు కేసీఆర్ సర్కారుపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో మూడేండ్ల పాలనపై ఢిల్లీలో తెలంగాణ జేఏసీ, విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్, సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్, జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం, బీజేపీ నేత కృష్ణసాగర్‌రావు, జలవనరుల శాఖ సలహాదారు వెదిరే శ్రీరామ్, ఇఫ్టు అధ్యక్షులు అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో.. టీఆర్ఎస్ సర్కారు అణిచివేత ధోరణితో వ్యవహరిస్తోందని సురవరం సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఊహించని విధంగా ప్రజా హక్కులపై దాడి చేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మళ్లీ నిజాం నిరంకుశ పాలన కనిపిస్తోందని అన్నారు. కేసీఆర్ రాజ్యంలో ఇసుకకు, ఇసుక లారీలకు ఉన్న విలువ ప్రజలపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు కేటాయిస్తూ దోచుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన సందర్భంగా సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశించామని, కానీ టీఆర్ఎస్ ఇచ్చిన హామీల్లో కొన్ని కూడా అమలు చేయలేదని అన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఇప్పుడు వేస్తున్న వేగంతో వెళ్తే 300 సంవత్సరాలు పడుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కుతూ కేసీఆర్ జాగీర్‌దారి వ్యవస్థను తలిపిస్తున్నారని జేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. మిగులు నిధులతో ఏర్పడిన తెలంగాణను మూడేళ్ల కాలంలో 1.40లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారని దుయ్యబట్టారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కుటుంబ పాలనగా మార్చేశారని విమర్శించారు. గత మూడేళ్ల కాలంలో తెలంగాణలో 3,080 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. తెలంగాణ సాధించుకున్న తరువాత కూడా ఈ దుస్థితి ఏంటని నిలదీశారు.

ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా తెలంగాణలో పాలన సాగుతోందని సామాజిక కార్యకర్త స్వామిఅగ్నివేశ్ విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తరువాత కూడా ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేనప్పుడు మళ్లీ ఉద్యమపంథా పట్టాలన్నారు. తెలంగాణలో ప్రజలు తొందరగా మేల్కొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. మొదట ఇందిరాపార్క్ సాధించుకోవడం లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సాధించుకున్న తెలంగాణలో ఒక నాయకుడికి అధికారమిచ్చి, వాళ్ల కుటుంబానికి పాలన అంటగట్టాల్సిన అవసరం లేదని ప్రముఖ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి పెనంలో నుండి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందని అన్నారు. దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వాల్లో తెలంగాణ సర్కారు అందరితో పోటీ పడుతోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో రూ.80 వేల కోట్లతో అన్ని గ్రామాలకు నీటి సరఫరా చేయొచ్చని కానీ, కేసీఆర్ మాత్రం రూ.2.40 లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారని వెదిరే శ్రీరాం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, రాష్ట్రప్రభుత్వం సరైన విధివిధానాలను పాటించడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో ఢిల్లీ జేఏసీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో సీఐటీయూ జెండా ఎగరాలి

ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఎస్ బేగ్

- కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు
- ముగిసిన ఎస్సీఈయూ రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

కార్మికుల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేస్తున్న సీఐటీయూ వచ్చే మహాసభల నాటికి సింగరేణిలో జెండా ఎగురవేయాలని ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఎస్ బేగ్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీలో పర్సా సత్యనారాయణ నగర్ (సింగరేణి కమ్యూనిటీ హాల్)లో రెండు రోజులుగా జరుగుతున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎస్సీఈయూ- సీఐటీయూ) రాష్ట్ర 14వ మహాసభలు మంగళవారం ముగిశాయి. మహాసభల ముగింపు సందర్భంగా బేగ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, చట్టాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. జేబీసీసీఐ నుంచి సింగరేణిని తొలగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేశాయని, సీఐటీయూ పోరాడి దాన్ని ఆపేయించిందని గుర్తు చేశారు. పదో వేతన ఒప్పందం కోసం సీఐటీయూ పోరాడుతోందన్నారు. పెన్షన్ స్కీమ్ తొలగించే కుట్రలకు వ్యతిరేకంగా పోరాటం చేసి ఆపేసిన చరిత్ర సీఐటీయూదేనన్నారు. సింగరేణిలో కార్మికులకు మెడికల్ అన్‌ఫిట్ స్కీమ్, వారసత్వ ఉద్యోగాల విషయంలో పోరాటం చేసిందన్నారు. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం నుండి అందాల్సిన అనేక పథకాలను అమలు చేయాలని పోరాడుతోందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి, దాని అనుబంధంగా ఉన్న టీబీజీకేఎస్‌కు సింగరేణి కార్మికుల గురించి ఏమీ తెలియదన్నారు. సింగరేణిలో వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికలల్లో సీఐటీయూని గెలిపించాలని, వచ్చే 15వ మహాసభల నాటికి సింగరేణి వ్యాప్తంగా సీఐటీయూ జెండానే కనిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్‌ను నిర్వీర్యం చేసేందుకు పూనుకుందన్నారు. ఇందుకు పరిశ్రమలను ప్రయివేటుపరం చేస్తూ పెట్టుబడిదారులకు తాకట్టుపెడుతుందని విమర్శించారు. కార్మికుల సమస్యలపై భవిష్యత్‌లో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ ఎస్సీఈయూ పర్మనెంట్ కార్మికులతోపాటు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపైనా ఐక్య పోరాటం చేయాలని కోరారు. ఈ సభలో ఎస్సీఈయూ రాష్ట్ర అధ్యక్షులు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, గౌరవాధ్యక్షులు రాజారావు పాల్గొన్నారు.

ఎస్సీఈయూ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మందా నర్సింహారావు

ఎస్సీఈయూ రాష్ట్ర అధ్యక్షులుగా టి. రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మందా నర్సింహారావులు తిరిగి ఎన్నికయ్యారు. మొత్తం 75 మంది సభ్యులతో ఎస్సీఈయూ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అందులో 32 మంది ఆఫీస్ బేరర్లుగా, 43 మంది రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉంటారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్. నాగరాజ్‌గోపాల్, కోశాధికారిగా జి.రాజారావు, ప్రచార కార్యదర్శిగా మెండె శ్రీనివాస్, కల్చరల్ కార్యదర్శి కె. సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా బి.మధు, విజయగిరి శ్రీనివాస్, ఎం. సారయ్య, వెంకటేశ్వర్లు, వి.వెంకటరత్నం, కాంపేటి రాజయ్య, ఉల్లి మొగిళి, డి.కొమురయ్య, ఎస్.వెంకటస్వామి, కార్యదర్శులుగా ఈ. రఘు, కర్ల వీరస్వామి, ఎన్.ఈశ్వరరాజు, కె.శంకర్, ఎం.రాజయ్య, టి. నరహరి రావు, రామగిరి. రామస్వామి, ఈ.కుమార్, బుర్రతిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.రమేష్ బాబు, కె. ఖాదర్‌బాబు, డి.వి.రావు, వంగల రామస్వామి, ఎస్.వెంకన్న, యు. కనకయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, సంకె రవిలను ఎన్నుకున్నారు.

వీఐటీ ఛాన్స్‌లర్‌కు 'జీవిత సాఫల్య అవార్డు'

హైదరాబాద్ : వీఐటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్, వ్యవస్థాపకులు డాక్టర్ జి.విశ్వనాథన్‌కు ప్రతిష్టాత్మక జీవిత సాఫల్య అవార్డు లభించింది. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ కిరణ్‌బేడీ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. విశ్వనాథన్ విద్యారంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వరించింది. ఈసందర్భంగా కిరణ్‌బేడీ మాట్లాడుతూ...విద్యార్థుల అభివృద్ధి కోసం పాటుపడుతున్న విశ్వనాథన్ సేవలను కొనియాడారు. సామాజాన్ని పట్టిపీడిస్తున్న



అవినీతిని పారద్రో లేందుకు యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి కోసం యు వత పాటుపడాలని కోరారు. అనంతరం వీఐటీ విశ్వవిద్యాలయ ప్రాంగ ణంలో నిర్వహించిన చెన్నై ఇంటర్నేషనల్ యూత్ ఫెస్టివల్ (సీఐవైఎఫ్)లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు, మెరిట్ సర్టిఫికేట్స్ ప్రదానం చేశారు. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ టీవీ వల్లినయగమ్, అడిషనల్ చీఫ్ సెక్రటరీ జీఏ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీ. వెలన్, నేషనల్ సైబర్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ స్టాండర్డ్స్ ప్రోగ్రామ్ చైర్మెన్ అమర్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు రైతుల ఆత్మహత్య

నవతెలంగాణ- యంత్రాంగం

ఓ వైపు అప్పులు.. మరోవైపు వరుసగా చేతికందని పంటలు... బోర్లు అడుగంటి పైర్లు ఎండిపోతుండటంతో మానసికంగా కుంగిపోయిన నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో మంగళవారం జరిగాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గిద్దవారిగూడేనికి చెందిన డేగల బాబయ్య(68)కు నాలుగు ఎకరాల భూమి ఉంది. భార్య వెంకటనర్సమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికీ వివాహాలు చేశాడు. నాలుగేండ్లుగా పంటలు సరిగ్గా పండడం లేదు. ప్రతి యేటా సాగుకోసం తెచ్చిన అప్పులూ తీరట్లేదు. ఇప్పటికే సుమారు రూ.3లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లోనూ పత్తి వేసినా మొలకెత్తలేదు. మరోమారు రెండు ఎకరాల్లో వేసినా అదే పరిస్థితి. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన బాబయ్య మంగళవారం చేను వద్ద బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా చండూరు మండలంలోని దోనిపాములకు చెందిన వలిజాల రాములు(62) తన రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. గతంలో పంటసాగు, ఇతర ఖర్చులకు రూ.3 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఈ క్రమంలో మంగళవారం పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు అతన్ని ఆస్పత్రికి తీసుకుపోతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రాములుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని జూపాకకు చెందిన రూప్‌రెడ్డి ప్రదీప్‌రెడ్డి తన అత్తగారి గ్రామమైన బొత్తలపల్లిలో నివాసముంటున్నాడు. తన ఆరెకరాల వ్యవసాయ భూమిలో పత్తి, వరి సాగు చేస్తున్నాడు. మూడేండ్లుగా పంటలు దిగుబడి సరిగా రాక, పెట్టుబడికి తెచ్చిన అప్పులు పేరుకుపోయాయి. అప్పుల వాళ్ల పోరూ తప్పలేదు. బాకీలు ఎలా తీర్చాలని తరుచూ మదనపడే ప్రదీప్‌రెడ్డి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమణమూర్తి తెలిపారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూస్‌గాం గ్రామానికి చెందిన నడ్పి గంగారాం(62) వ్యవసాయ భూమిలో నడుస్తున్న మూడు బోర్లు ఎండిపోయాయి. దీంతో రెండేండ్ల నుంచి వ్యవసాయం కలిసిరాలేదు. కొన్ని రోజుల కిందట మరో బోరు వేసినా చుక్క నీరు పడలేదు. దీంతో ఆర్థికంగానూ, మానసికంగానూ కుంగిపోయిన రైతు గంగారాం పొలం వద్దే స్తంభానికి ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కట్ట నరేందర్‌రెడ్డి తెలిపారు. రైతుకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కోర్టు ధిక్కరణ కేసులో కమిషనర్‌కు కస్టడీ

నవతెలంగాణ-మిర్యాలగూడ టౌన్

కోర్టు ధిక్కరణ కేసులో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ సత్యబాబుకు 10 రోజుల కస్టడీ విధిస్తూ మంగళవారం హైకోర్టు తీర్పునిచ్చింది. పట్టణంలోని సాగర్ రోడ్డులోనున్న ఓ కమర్షి యల్ కాంప్లెక్స్ ఆస్తి పన్ను విషయం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. కానీ ఆస్తి పన్ను చెల్లించడం లేదని కాంప్లెక్స్ ఆస్తిని జప్తు చేశారు. దీంతో కాంప్లెక్స్ యజమాని హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ధిక్కరణకు పాల్పడి నందుకుగాను కమిషనర్‌కు పదిరోజుల కస్టడీ, రూ.2 వేల జరిమానా విధి స్తూ తీర్పు నిచ్చారు.

ఒకరి కాలికింద నీచంగా బతికే బదులు
లేచి నిలబడి ప్రాణం వదిలేయడం మేలు. - చేగువేరా

సంపాదకీయం

స్వేచ్ఛకు సంకెళ్ళు...?

"కొంచెం స్వేచ్ఛ కావాలి
మనిషిని మనిషని చెప్పటానికి
పశువుని పశువని చెప్పటానికి...
కొంచెం స్వేచ్ఛ కావాలి
రాత్రిని రాత్రని చెప్పటానికి
పగటిని పగలని చెప్పటానికి
కొంచెం స్వేచ్ఛ కావాలి
రెక్కలల్లార్చి గాల్లో ఎగరడానికి.." అంటాడు శివారెడ్డి. నిజాన్ని నిజమని చెప్పటానికి, అబద్ధాన్ని అబద్ధమని చెప్పడానికి కూడా స్వేచ్ఛలేని నేటి స్థితికి అద్దం పడుతోందీ కవివాక్కు... నిజమే నేడు స్వేచ్ఛ బందీగా మారుతోంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుండి ఏ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనైతే పోరాడి సాధించుకున్నామో ఆ స్వతంత్ర భారతావనికి 70ఏండ్లు నిండిన వేళ తిరిగి "స్వేచ్ఛ"కు సంకెళు వేయజూస్తున్న జాడలు దేశాన్ని కలవరపెడుతున్నాయి. ప్రజలు ఆకలితో అలమటిస్తున్నంత కాలం.., అన్యాయాలూ అక్రమాలకు గురవుతున్నంత కాలం, అవమానాల పాలవుతున్నంత కాలం..., ఈ అమానవీయతను ప్రశ్నించే స్వేచ్ఛా చైతన్యం కొరవడినంత కాలం ఈ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం అంతా ఓ బూటకం అంటాడో ప్రజాకవి. ఇది అక్షరాల నిజమని పదే పదే రుజువు చేస్తున్నాయి మన ప్రభుత్వాలు. ఇన్నేండ్ల స్వాతంత్ర్యంలో భావ వ్యక్తీకరణ కోసం, నిరసన హక్కు కోసం ఓ పోరాటమే చేయవల్సి వస్తోందంటే ఇక్కడ ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నట్టా? లేక నియంతృత్వం జడలు విప్పుతున్నట్టా..? తెలంగాణలో ధర్నాచౌక్ కోసం దేశ రాజధాని ఢిల్లీలో ధర్నాకు దిగిన యావత్ ప్రతిపక్షాలను చూసినవారెవరికైనా ఈ సందేహం రాకమానదు.

ప్రశ్నించే గొంతులను తొక్కుకుంటూ, పోలీసుల పహారాలో పాలన సాగించాలనుకోవడం అవివేకమే అవుతుంది. ఎందుకంటే ప్రజలు ఉత్పత్తికి చెమట ధారపోయడంలోనే కాదు, పీడన ఎదుర్కోవడంలో కూడా సంఘటితమవుతారు. అప్పుడు ఏ పీడకుడూ, ఏ పాలకుడూ ప్రజలముందు నిలువలేడు.



నిరసన తెలియజేయటం ఓ ప్రజాస్వామిక హక్కు. దీన్ని కాలరాయబూనడం నియంతృత్వం కాక మరేమవుతుంది..! ప్రజలకు ఓటేసి అధికారమివ్వడమే కాదు ఆ అధికారం తోవదప్పినప్పుడు నిలదీసే హక్కు కూడా ఉంటుంది. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తెచ్చేందుకు ఓ వేదిక కావాలి. ఆ వేదికే ధర్నాచౌక్. ఆ చౌక్‌ను ఎత్తేయాలనుకోవడం ప్రజల గొంతును నులిమేయడమే కదా..! దీనిని ప్రజలెప్పుడూ సహించరు. ఇటువంటి ప్రయత్నమే గతంలో కేంద్రంలో కూడా జరిగితే ప్రజలు పోరాడి జంతర్ మంతర్‌ను స్వాధీనం చేసుకున్న చరిత్రను ఏలికలు గుర్తించాలి. బాబ్రీమసీదు కూల్చివేత అనంతరం శాంతిభద్రతల సాకుతో ఆనాటి కేంద్ర ప్రభుత్వం జంతర్ మంతర్‌లో ఆందోళనలపై ఆంక్షలు విధిస్తే ఏం జరిగింది..? ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే ఏ చర్యా సహించబోమని ప్రజలు నిరూపించారు. ప్రశ్నించే స్వేచ్ఛను హరించజూస్తే సహించబోమనీ చాటిచెప్పారు. ఇది గుర్తించకపోతే చరిత్ర పునరావృతమవుతుందని ఏలికలు గ్రహించాలి. లేదంటే ప్రజా విశ్వాసాన్ని కోల్పోక తప్పదు. ఉద్యమాల ద్వారా అధికారంలోకొచ్చిన ప్రభుత్వమిది. తాను అధికారంలోకొచ్చేంత వరకూ ప్రజల హక్కుల గురించీ, ఉద్యమాల ఆవశ్యకత గురించీ, ఆ ఉద్యమాల్లో ప్రజల పాత్ర గురించీ నీతులు వల్లించినవారు అధికారంలోకి రాగానే మాటమార్చడం పాలక పార్టీ నైజానికి నిలువుటద్దం. తెలంగాణ హక్కుల కోసం అవసరమైతే ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తానన్న పెద్దమనిషి తెలంగాణలో మాత్రం ధర్నాచౌక్‌నే ఎత్తేయడం ఎవరి ప్రయోజనాల కోసం. తెలంగాణ వస్తే ప్రజల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పి ప్రజలను ఉద్యమాల్లోకి సమీకరించిన నేత తీరా తెలంగాణ వచ్చాక పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు, బడా వ్యాపారవేత్తల ప్రయోజనాలకే పెద్దపీట వేయడం, ప్రజల గురించి, ప్రజాస్వామ్య హక్కుల గురించీ మాట్లాడితే ఆగ్రహావేశాలకు గురికావడం దేనికి సంకేతం? ప్రశ్నించినా, సమస్యలపై నిలదీసినా కన్నెర్ర జేస్తున్న తీరు పౌర సమాజం గమనిస్తూనే ఉన్నది. నిరసన స్వేచ్ఛను కాలరాసే ఏ ప్రభుత్వమూ ప్రజల పక్షం కాదనీ, ప్రజల మన్నన పొందలేదనీ చరిత్ర ఏనాడో స్పష్టం చేసింది.

మనిషి తన అవసరాన్ని తెలుసుకోవడమే 'స్వేచ్ఛ' అంటాడు హెగెల్. కేవలం తెలుసుకోవడం మాత్రమే సరిపోదనీ, తెలుసుకున్న అవసరాన్ని సాధించడానికి ఆచరణకు పూనుకోవడమే 'స్వేచ్ఛ' అంటాడు మార్క్స్. ఆ స్వేచ్ఛే మనిషికి ప్రకృతి మీద అదుపు సంపాదించి పెట్టింది. ఆ స్వేచ్ఛే మానవ జీవన వికాసానికి దోహదకారి అయ్యింది. ఆ స్వేచ్ఛకు పాలకవర్గాలు ఆటంకాలు కలిగించజూసిన ప్రతి దశలోనూ "స్వేచ్ఛ"ను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతే ఉద్యమాలను సృష్టించిందీ, పోరాటాలను నిర్మించిందీ, స్వేచ్ఛను కాపాడుకుందీ... పరస్పర విరుద్ధమైన వర్గ ప్రయోజనాలున్న నేటి సమాజంలో అధిక సంఖ్యాక ప్రజల అభిప్రాయాలు, అవసరాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ప్రజలు, ప్రజాసంక్షేమం శాంతిభద్రతల పేరుతో అణిచివేయబడుతున్నాయి. పాలకవర్గాల నియంతృత్వంతో కూడిన అధికారం రాజ్యానికున్న ఓ విశిష్ట లక్షణం. కానీ బలప్రయోగం మీద ఆధారపడిన నియంతృత్వం ప్రజల ముందు ఎంతోకాలం సాగదు. ప్రశ్నించే గొంతులను తొక్కుకుంటూ, పోలీసుల పహారాలో పాలన సాగించాలనుకోవడం అవివేకమే అవుతుంది. ఎందుకంటే ప్రజలు ఉత్పత్తికి చెమట ధారపోయడంలోనే కాదు, పీడన ఎదుర్కోవడంలో కూడా సంఘటితమవుతారు. అప్పుడు ఏ పీడకుడూ, ఏ పాలకుడూ ప్రజలముందు నిలువలేడు. ఎందుకంటే శివారెడ్డే చెప్పినట్టు..

**"మనిషి స్వేచ్ఛా వాంఛ చాలా గొప్పది
మనిషి సృజనాత్మక శక్తంతా, భావనా బలమంతా
పోరాట పటిమంతా అక్కడ్నుంచే పుట్టింది.
చరిత్రలో చాలామంది నియంతలు పుట్టారు.
జీవన స్వేచ్ఛా శీలాన్ని కాపాడటానికి చరిత్ర చాలామంది వీరులను కన్నది."**

లాటిన్ అమెరికాలో మరో కొత్త వామపక్ష పార్టీ!



ఎం. కోటేశ్వరరావు

ఫ్చ్! కమ్యూనిస్టుల పని అయిపోయింది, కమ్యూనిజానికి కాలం చెల్లింది. ఈ మధ్య కాలంలో ఇలాంటి మాటలు విన్న పాతతరంలో కొందరికి నిజమేనేమో అని పిస్తోంది. అసలు కమ్యూనిజం గురించి తెలియని కొత్త తరంలో కాస్త ఆలోచించే బుర్రవున్న వారికి అసలు కమ్యూనిజం అంటే ఏమిటి, అదేమి చెప్పింది అనే కొత్త ఆలోచన కలుగుతోంది. సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపాలోని సోషలిస్టు దేశాలను కూల్చివేసిన తరువాతే కదా లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాలలో, దక్షిణాఫ్రికా, నేపాల్‌లో

శాంతి ఒప్పందంలో పేర్కొన్న సదుద్దేశ్యాలను ఆచరణలోకి తీసుకురావటం అతి పెద్ద సవాలని, దానిని ఎదుర్కోవటంలో విఫలమై సమర్ధవంతంగా అమలు జరపకపోతే ఒక దేశంగా కొలంబియా మనుగడే ప్రమాదంలో పడుతుందని ఎఫ్ఏఆర్‌సీ సభ్యుడు లూకాస్ కార్వజెల్ చేసిన వ్యాఖ్యకు ఎంతో ప్రాధాన్యత వుంది.

వామపక్షాలు, కమ్యూనిస్టులు అధికారానికి వచ్చారు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ 2008 నుంచి తీవ్ర సంక్షోభంలో మునిగి ఎప్పుడు ఒడ్డుకు చేరుతుందో ఇంకా తెలియని స్థితిలో చైనా సోషలిస్టు వ్యవస్థకు అలాంటి దెబ్బ తగలలేదేం? నూరు పూవులు పూయనివ్వండి వేయి ఆలోచనలను వికసించనివ్వండి!

కమ్యూనిస్టులను అణగదొక్కాం, సోషలిజంపై విజయం సాధించాం అని చెప్పుకున్నది అమెరికా. కొలంబియా దాని ఉపగ్రహ దేశంగా వుంది. తాము గతంలో అనుసరించింది, భవిష్యత్ మార్గదర్శి మార్క్సిజం అని బహిరంగంగా చెప్పుకొనే గెరిల్లా సంస్థ కొలంబియాలోని ఎఫ్ఏఆర్‌సీ. అలాంటి దానితో ప్రభుత్వం రాజీకి ఎందుకు వచ్చిందో ఎవరైనా చెప్పగలరా? ఐదు కోట్ల జనాభా వున్న ఆ దేశంలో గత ఐదున్నర దశాబ్దాలుగా సాయుధ పోరాట పంథాలో సాగిన కొలంబియా విప్లవ సాయుధ శక్తులు(ఎఫ్ఏఆర్‌సీ) సెప్టెంబరు ఒకటవ తేదీన 'కొలంబియా విప్లవ ప్రత్యామ్నాయ శక్తి' పేరుతో నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నాయి. ఇంతకాలం వారికి అనేక విధాలుగా మద్దతు ఇచ్చిన క్యూబా, వెనెజులా తదితర దేశాల మధ్యవర్తిత్వంలో కుదిరిన హవానా ఒప్పందం ప్రకారం కొలంబియా పార్లమెంట్ ఎఫ్ఏఆర్‌సీని ఒక రాజకీయ పార్టీగా గుర్తించటం, అదే సమయంలో ఆ సంస్థ ఆయుధాలను విసర్జించి రాజకీయ రంగంలోకి రావటం ఒకేసారి జరిగాయి. గెరిల్లాలు తమ వద్ద వున్న ఆయుధాలను అప్పగించి గతవారంలో సాధారణ జీవితంలో ప్రవేశించారు. లాటిన్ అమెరికాలోని అనేక దేశాలలో ఇలాంటి గెరిల్లా సంస్థలు సాయుధబాటను వీడి పార్లమెంటరీ రాజకీయాలలో ప్రవేశించి అధికారానికి వచ్చిన పూర్వరంగంలో కొలంబియా పరిణామాలను చూడాల్సి వుంది.

ఇప్పటికీ లాటిన్ అమెరికాలో విప్లవశక్తులకు స్ఫూర్తినిస్తున్న సైమన్ బలివర్ అవిభక్త స్వతంత్ర కొలంబియా తొలి అధ్యక్షుడు. స్పెయిన్ వలస పాలకుల నుంచి స్వాతంత్ర్యం పొందేందుకు ఆయన నాయకత్వంలో సాగిన కృషి ఈనగాచి నక్కల పాలైనట్టు తరువాత కాలంలో మితవాద, మిలిటరీశక్తుల పరమైంది. అవి భక్త కొలంబియా నుంచి కొలంబియా, వెనెజులా, ఈక్వెడార్, పెరు, పనామా ఏర్పడ్డాయి. కొలంబస్ కనుగొన్న ప్రాంతం కనుక కొలంబియా అని పిలిచారు. పోరు వారసత్వం కలిగిన కొలంబియాలో 1950 దశకంలో గ్రామీణ ప్రాంతాలలో రైతాంగాన్ని భూములనుంచి బలవంతంగా వెళ్లగొట్టి అమెరికన్ కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు పూనుకున్న ప్రభుత్వ, కార్పొరేట్ గూండాల దాడులను అడ్డుకున్నారు. అందుకోసం కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసిన ఆత్మరక్షణ దళ వ్యవస్థ 1960 దశకంలో ఒక సంఘటిత సాయుధ గెరిల్లా దళ సంస్థ ఎఫ్ఏఆర్‌సి ఆవిర్భావానికి దారితీసింది. అప్పటి నుంచి మిలిటరీ, మాదక ద్రవ్యాల మాఫియాలు, అన్ని రకాల సంఘవ్యతిరేకశక్తుల దాడుల నుంచి తట్టుకొని నిలవటమేగాక పటిష్టం కావటం, లాటిన్ అమెరికాలో ప్రజావ్యతిరేక మితవాద పాలకపార్టీలన్నీ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పూర్వరంగంలో అక్కడి పాలకవర్గం విప్లవ సంస్థతో రాజీకి అంగీకరించాల్సి వచ్చింది. అనివార్యమై ఆయుధాలు పట్టిన ఎఫ్ఏఆర్‌సీ సాయుధ కార్యకలాపాలతో పాటు బహిరంగ రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనేందుకు గతంలో కూడా ప్రభుత్వంతో చర్చలు జరిపింది. మూడు దశాబ్దాల క్రితం ఆయుధాలను విసర్జించకుండానే కాల్పుల విరమణ ఒప్పందం చేసుకొని దేశ భక్త ఫ్రంట్ పేరుతో ఒక పార్టీ ఏర్పాటు చేసి చట్టబద్ధంగా పని చేస్తున్న కమ్యూనిస్టుపార్టీతో 1984-87 మధ్య ఎన్నికలలో పాల్గొని అనేక విజయాలు కూడా సాధించింది. అయితే బహిరంగ కార్యకలాపాలలో వున్న అనేక మంది కార్యకర్తలను ప్రభుత్వం, దాని కనుసన్నలలో మెలిగే మాఫియా శక్తులు హతమార్చటంతో ఆ విధానానికి స్వస్తి చెప్పి తిరిగి సాయుధ చర్యలను ప్రారంభించింది. క్యూబా, వెనెజులా వంటి దేశాలు, కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల మద్దతు వున్నప్పటికీ కొలంబియాలో వున్న పరిస్థితుల నేపథ్యంలో సాయుధ పోరాట మార్గానికి స్వస్తి చెప్పాలని ఎఫ్ఏఆర్‌సీ నాయకత్వంలో వచ్చిన ఆలోచన, పాలకవర్గాలు దిగివచ్చిన కారణంగానే గత నాలుగేండ్లుగా సాగిన శాంతి చర్చలు ఒక కొలిక్కి వచ్చాయని చెప్పవచ్చు.



ఎఫ్ఏఆర్‌సీ ఒక రాజకీయ పార్టీగా ఏర్పడి ఎన్నికలలో పాల్గొనేంతవరకు పార్లమెంట్ ఉభయ సభలలో ఐదుగురి చొప్పున 2023వరకు ఎన్నికతో పని లేకుండా ఆ పార్టీ ప్రతినిధులు వుంటారు. ఆ లోగా జరిగే ఎన్నికలలో అంటే 2018లో అది సాధించుకొనే సీట్లు అదనం. త్వరలో రాజకీయ పార్టీ ఏర్పాటు మహాసభను జరిపి లాంఛనంగా 'కొలంబియన్ రివల్యూషనరీ ఆల్టర్‌నేటివ్ ఫోర్సెస్' (కొలంబియా ప్రత్యామ్నాయ విప్లవశక్తి) అని పార్టీకి నామకరణం చేయనున్నట్టు శాంతి చర్చలలో ప్రధాన పాత్ర పోషించిన ఇవాన్ మార్క్వెజ్ ప్రకటించారు. గతంతో తాము తెగతెంపులు చేసుకోబోవటం లేదని, ఎల్లప్పుడూ విప్లవ శక్తులుగానే వుంటామని చెప్పారు.

కొద్ది రోజుల కితం జరిగిన కొలంబియా కమ్యూనిస్టుపార్టీ 22వ మహాసభలో అనేకమంది ఎఫ్ఏఆర్‌సీ నేతలు పాల్గొన్నారని, వచ్చే ఏడాది జరిగే ఎన్నికలలో రెండు పార్టీలు ఒక కూటమిగా ఏర్పడి పోటీ చేయాలని ప్రతిపాదించినట్టు టెలిసుర్ టీవీ వెల్లడించింది. దేశంలో శాంతిని పరిరక్షించే క్రమంలో వామపక్షాల తరపున ఒక నియోజకవర్గంలో ఒకే అభ్యర్ధిని నిలుపుతామని కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు జైమే కేసెడో టురియాగో చెప్పినట్టు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. 'వామపక్షం విస్తరిస్తోంది, నూతన శక్తులు ఉనికిలోకి వస్తున్నందున మరింతగా విస్తరిస్తూనే ఉంటుంది. దానిని మరింత విస్తరింప చేసి ఐక్యతా స్ఫూహను పెంచటమే మేము ఇప్పుడు చేయాల్సింది' అని కెసెడో వ్యాఖ్యానించారు. మహాసభకు గెరిల్లా సంస్థ ప్రతినిధులతో పాటు అనేక సామాజిక ఉద్యమాలకు చెందిన ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

కొలంబియా కమ్యూనిస్టులు, గెరిల్లా సంస్థలపై గత యాభై ఏండ్లలో స్థానిక పాలకులు, అమెరికా కనుసన్నలలో పని చేసే మీడియా, అనేక సంస్థలు పెద్ద ఎత్తున తప్పుడు ప్రచారం చేశాయి. వారిని టెర్రరిస్టులుగా చిత్రించారు, పోలీసు, మిలిటరీ బలగాలతో పాటు మాదక ద్రవ్యాల మాఫియా, ఇతర సంఘ వ్యతిరేక శక్తులు, కమ్యూనిస్టు వ్యతిరేకులను ఉపయోగించుకొని దాడులు చేశారు. వేలాదిమంది కార్యకర్తలు, నేతలను బలి తీసుకున్నారు. మాఫియా సంస్థలు చేసిన దాడులు, హత్యాకాండను కూడా గెరిల్లాలు, కమ్యూనిస్టులకు అంటగట్టారు. వేలాది కుటుంబాలు అనేక అగచాట్లకు గురయ్యాయి. ఈ పూర్వరంగంలో ఎఫ్ఏఆర్‌సీతో శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలా వద్దా అనే అంశంపై దేశంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఓటింగ్‌లో పాల్గొన్న సగం మంది శాంతి ఒప్పందాన్ని వ్యతిరేకించారంటే అక్కడి ప్రజల్లో వున్న కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఎంత పెద్ద ఎత్తున జరిగిందో అర్ధం చేసుకోవచ్చు. శాంతి ఒప్పందాన్ని వ్యతిరేకించే శక్తులు ఎఫ్ఏఆర్‌సీని రెచ్చగొట్టేందుకు శాంతి ఒప్పందం కుదిరిన నాటి నుంచి ఆయుధాలు అప్పగించే ముందు రోజు వరకు ఎనిమిది మంది గెరిల్లా దళ సభ్యులను హత్య చేశాయి. గెరిల్లాలకు పట్టున్న ప్రాంతాల నుంచి వారు నిరాయుధులుగా బయటకు వస్తుండటంతో ఆ ప్రాంతాలకు మితవాద సాయుధ శక్తులు చేరుతున్నాయి. స్థానిక కార్యకర్తలు, జనాలను భయభ్రాంతులకు గురిచేసి దాడులకు పాల్పడుతున్నట్టు వార్తలు వచ్చాయి. ఈ శక్తులకు గతంలో ప్రభుత్వమే గెరిల్లాలపై దాడులకు శిక్షణ ఇచ్చి పెంచి పోషించింది. అధికారిక గణాంకాల ప్రకారమే 2016 జనవరి నుంచి 2017 మార్చి ఒకటవ తేదీ వరకు 156 మంది సామాజిక, మానవ హక్కుల నేతలు హత్యకు గురయ్యారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాదిలో మే నెల వరకు 41 మంది హత్యకు గురికావటం ఎక్కువ ఆందోళనకరం అని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంస్థ పేర్కొన్నది. శాంతి ఒప్పందంలో పేర్కొన్న సదుద్దేశ్యాలను ఆచరణలోకి తీసుకురావటం అతి పెద్ద సవాలని, దానిని ఎదుర్కోవటంలో విఫలమై సమర్ధవంతంగా అమలు జరపకపోతే ఒక దేశంగా కొలంబియా మనుగడే ప్రమాదంలో పడుతుందని ఎఫ్ఏఆర్‌సీ సభ్యుడు లూకాస్ కార్వజెల్ చేసిన వ్యాఖ్యకు ఎంతో ప్రాధాన్యత వుంది. కొన్ని మీడియా సంస్థల అధిపతులు, ప్రజాభిప్రాయాన్ని మలిచేవారిగా పాత్ర పోషిస్తున్న కొందరు తమకు వ్యతిరేకంగా వ్యవహరించటాన్ని స్పష్టంగా గమనించవచ్చని లూకాస్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. వ్యవసాయ అభివృద్ధి గురించి మేము చర్చ ప్రారంభిస్తే వెంటనే దేశంలో మీరే పెద్ద భూ ఆక్రమణదారులని చెబుతారు. మాదకద్రవ్యాల గురించి మాట్లాడితే మీరే ప్రధాన ఉత్పత్తిదారులంటారన్నారు. ఈ పూర్వరంగంలో కొలంబియా శాంతి పరిణామాలు, పరిమితులను చూడాల్సి వుంది. ■

మెయిల్ @ నవతెలంగాణ

ప్రభుతా..! మా గోస పట్టదా?

నూట అరవై ఏండ్ల చరిత్ర కలిగిన పోస్టాఫీస్‌లో జీడీఎస్‌ల బాధల గురించి ఎంతమందికి తెలుసు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టాఫీస్‌లపాత్ర కీలకం. చూసేవారికి మేము కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులం.. కానీ మా జీతాలు మాత్రం అక్షరాల రూ.6వేలే. ఇందులోనే మేము పోస్టాఫీస్ రూం రెంట్, స్టేషనరీ ఐటమ్స్‌కి ఖర్చు చేయాలి. మా పిల్లల చదువులకని ఇన్‌కమ్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేస్తే మీరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులని, తహసీల్దార్ ఆఫీస్ వాళ్ళు తిరస్కరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రేషన్‌కార్డు కూడా తీసేశారు. రూ.6వేలలోనే కుటుంబాన్ని ఎలా పోషించాలి? పిల్లలను ఎలా చదివించుకోవాలి. మాది 3గంటల పని అని చెప్పి 10 గంటల పనిచేయిస్తున్నారు. టార్గెట్ల పేరుతో వేధిస్తున్నారు. మొన్నటివరకు మేం పనిచేసే ఊళ్లో సార్..! అని పిలిచేవాళ్లు... ఇప్పుడు మా జీతాల గురించి తెలియగానే డ్రయినేజీలు తీసుకునే వాళ్లే మీకన్నా నయమని హేళనగా మాట్లాడుతున్నారు.

ఈ వ్యవస్థలో మా బాధలు వర్ణనాతీతం. ప్రతిఒక్కరికి భయపడే పరిస్థితి. ఏమైనా మాట్లాడితే జీతం కట్. మరీ ఎక్కువగా మాట్లాడితే ఉద్యోగం ఫట్. తెలియక ఈ జాబ్‌లోకి వచ్చాము. మరి ఇప్పుడు వెళ్లిపోదామంటే మా వయసు చూసి ఏ పనీ దొరకని పరిస్థితి మాది. ఒకపూట తింటూ 2 పూటలు పస్తులు ఉన్న రోజులు. నిద్రలేని రాత్రులు ఎన్నో గడుపుతున్నాం. మేము గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. నెలకు కనీసం 18వేల జీతం ఇవ్వమంటున్నాం అంతే. మా జీవితంలో ప్రతిదినం పోరాటమే. మా గురించి కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన పీఆర్‌సీ అమలు చేయమంటే ఈ ప్రభుత్వానికి అది చదివే టైం లేదు. ఏమైనా అంటే ఇంకా పరిశీలనలో ఉంది అంటారు.. పెంచన్ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. అదీ అమలు చేయలేని పరిస్థితి ఈ ప్రభుత్వానిది. మోడీకి 63 దేశాలు తిరిగే టైం ఉంటుంది కానీ మా బతుకు బాధలు తెలుసుకునే సమయం ఉండదు. మూడు రోజుల్లోనే 5 దేశాలు తిరిగి ప్రపంచ రికార్డు సాధించారని గొప్పలు చెప్పుకునే ఈ ప్రభుత్వ పెద్దలు మా గురించి ఒక రోజు కేటాయించడానికి మాత్రం మనసు రాదు. ఏమైనా అంటే పోస్టాఫీస్‌ల వల్ల లాభం లేదు. దీనిని ప్రయివేటీకరించుదాం అంటారు. అసలు మీవల్ల ప్రజలకు ఎంతలాభం ఉంది అని సామాన్యుడు ఆలోచించడం మొదలుపెడితే ఆ సేతుహిమాచలం నుంచి కన్యాకుమారి వరకు బీజేపీ ఉంటుందా? డిపాజిట్‌లు కూడా దక్కవు. ఎంపీల జీతం పెంచుకోవాలంటే పార్లమెంట్ ప్రారంభమైన వెంటనే ఒక ఎంపీ ప్రతిపాదిస్తాడు. సాయంత్రం లోపు బిల్లు ఆమోదం పొందుతుంది. కానీ మా జీతాలు పెంచాలంటే కమిటీల పేరుతో కాలయాపన చేస్తారు. మాకు వచ్చే 6వేల జీతంతోనే ఈ కేంద్ర ప్రభుత్వాధినేతలు, మోడీ ఒక నెలరోజులు బతికిచూడండీ..! ఈ జీతాలతో ఇంట్లో ఆడపిల్లలకు పెండ్లిండ్లు ఎలా చేయగలం? పనిచేసే చోట కూడా స్థానికులతో ఎన్నో అవమానాలకు గురవుతున్నాం. మానసిక వేదనకు గురై, 'మనదీ ఒక బతుకేనా కుక్కల వలె.. నక్కల వలె.. సందులలో పందుల వలె..' అని మహాకవి శ్రీశ్రీ చెప్పిన కవితా వాక్యాలు... అచ్చం మా బతుకులను, బాధలను ప్రతిబింబించేవిగా ఉన్నాయి. ఇక ఈ బాధల్లో మునిగి తేలేకంటే, మా జీతాలు ఎందుకు పెంపుదల చేయరో నిలేయ దలిచాం.

-కార్తీక్


ప్రజావాణి

డిటెన్షన్ విధానం అవసరమేమో..!

ఆగస్టు15వ తేదీన నవతెలంగాణలో ప్రచురితమైన డిటెన్షన్ విధానం విద్యా హక్కుకు విఘాతం.. నాగటి నారాయణ వ్యాసం బాగుంది. కానీ ఇప్పుడున్న సినిమా, టీవీ, మొబైల్ ప్రభావం పిల్లల మీద చాలా ఎక్కువగా ఉంది. అందువలన డిటైన్ చేస్తారనే ఒత్తిడితో పిల్లల తల్లిదండ్రులు, టీచర్లు, పిల్లలు కూడా జాగ్రత్త పడతారని అనిపిస్తోంది. ఇప్పుడు వస్తున్న సినిమాలు, టీవీ సీరియల్స్ పెద్దల మీద ప్రభావం పడుతుంటే పిల్లల మీద ఇంకెంత ఉంటుంది. వాటికి దూరంగా ఉండటానికి డిటైన్ పద్ధతి సరైనది... అనిపిస్తోంది. అప్పుడు పిల్లలు కొంతవరకు సినిమాలకు, టి.వి.సీరియల్స్‌కు, మొబైల్‌కు దూరంగా ఉండి చదువుకుంటారని ఆశించవచ్చు. కామన్ స్కూల్ విద్యావిధానం. మంత్రుల, ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు అందరూ ప్రభుత్వ స్కూల్స్‌లోనే చదువుకొనేటట్టు ఒక చట్టం తీసుకురావాలి. రెండేండ్ల క్రితం అలహాబాద్ హైకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఆ తీర్పు ప్రకారం మంత్రుల, ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, జ్యుడీషియరి పిల్లలు అందరూ ప్రభుత్వ స్కూల్స్‌లోనే చదువుకోవాలి. ఇదొక విప్లవాత్మకమైన తీర్పు. దీనిపై మోడీ ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు తీసుకు వచ్చి చట్టం చేసి అమలు చేస్తే దేశ ప్రజలు మోడీని గుర్తుపెట్టుకుంటారు. నోట్ల రద్దు చేయగలిగిన శక్తిని ఈ చట్టం కోసం చేయడానికి కూడా వినియోగిస్తే దేశానికి ఎంతో మేలు చేసినట్టే. ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా ప్రతినిధులు ఈ విషయం మీద శ్రద్ధపెట్టాలి. చట్టం తీసుకు రావడానికి ప్రయత్నించాలి. కష్టమైన పనేమీ కాదు. అలహాబాద్ హైకోర్టు తీర్పును కూడా ఇచ్చింది. ఆ తీర్పును తీసుకొని సుప్రీమ్ కోర్టులో ఒక పిల్ వేయ వచ్చేమో కూడా ఆలోచించ వచ్చు. కామన్ స్కూల్ విద్యా విధానం వస్తే దేశంలో ఒక విప్లవాత్మకమైన మార్పు వస్తుంది.

- కామేశ్వర రావు, హైదరాబాద్.

ఆనాటి విలువలు అరిగిపోయాయా..?



డాక్టర్ చుక్కా రామయ్య

రామయ్య మాట

దేశంలో ఏటా మనం రెండు ప్రజా పండుగలు చేసుకుంటున్నాం. ఒకటి పంద్రాగస్టు కాగా, రెండోది రిపబ్లిక్‌డే. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షలు ఎంతవరకు నెరవేరాయో నెమరు వేసుకుంటే.. రిపబ్లిక్‌డే రోజున రాజ్యాంగ లక్ష్యాలు ఎంతవరకు పరిపుష్టమయ్యాయో ఆత్మావలోకనం చేసుకొని కొత్త లక్ష్యాలను ఎంచుకుంటూ ముందుకెళ్తున్నాం. మన దేశంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం ఎన్నో ఒడిదుడుకులకు గురైంది. భావితరాల స్వేచ్ఛ కోసం, స్వతంత్రంగా బతకడం కోసం ఎంతోమంది మహనీయులు ప్రాణత్యాగాలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మనం సాధించుకున్నది సెక్యులరిజం. మహత్తర పోరాటం ద్వారా మనకు సంక్రమించిన గొప్ప వారసత్వం కూడా అదే. అందుకే మన రాజ్యాంగంలో సెక్యులరిజానికి ఎక్కువ ప్రాధాన్యం కల్పించారు. అదే నాటి పోరాటం గొప్ప విలువ. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో సెక్యులరిజానికి విలువ తరుగుతున్నదా? ఎక్కువవుతున్నదా? అనేది నేడు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆనాటి మహా పోరాటంలో కొంత భాగం చూసే అవకాశం నాకు దొరికినందున దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా దాన్ని నేను ప్రస్తావించక తప్పడంలేదు. నాటి మన స్వాతంత్ర్యం సాధన కల ఒకేరకమైన నాయకత్వం కింద సాకారం కాలేదు. వందపూలు వికసించాలనే భావన ఆ రోజుల్లో ఉండేది. అందువల్లే ఓ వైపు అంబేద్కర్ వస్తే.. మరోవైపు నుంచి గాంధీజీ వచ్చారు. అలాగే సుభాష్‌చంద్రబోస్, జవహర్‌లాల్‌నెహ్రూ, ఈఎంఎస్, డాంగే ఇలా.. రకరకాల భావజాలం, ఆలోచనలతో కలగలిసిన గొప్ప నాయకత్వం పుట్టుకొచ్చింది. ఆనాడు నాయకత్వం ఎక్కడా కేంద్రీకృతం కాలేదు. అందువల్లే గొప్ప రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోగలిగాం. వారువేసిన ఆ పునాదులే ఈ దేశాన్ని ఇప్పటికీ సమైక్య భావనతో ఉంచగలుగుతున్నాయనడంలో ఎలాంటి సందేహంలేదు. దేశంలో ఆనాటి మహనీయులు ఏ ఆశయాల కోసం ప్రాణత్యాగం చేశారో ఆ స్ఫూర్తి నేడు కరువైపోతోంది. కేంద్రీకృతమైన రాజకీయాలవైపు పోతున్నాం. తద్వారా ప్రజా సమస్యల్ని పరిష్కరించడంలో విఫలమవుతున్నామనే చెప్పాలి.

స్వాతంత్ర్య సంగ్రామంలో స్వాతంత్ర్యం, జాతీయ వాదమే నినాదం. యూనివర్సిటీల్లోనైనా, గ్రామాల్లోనైనా కానీ జనాలను సమీకరించడం, వారిని పోరాటంలో భాగస్వాముల్ని చేయడం ఆనాడు ప్రధానంగా భావించేవారు. ఈ నేపథ్యంలో ఎక్కువగా రైతులు, కార్మికులపైనే కేంద్రీకరించారు. కాబట్టి ఆ తరం వారికి అవే విలువలు వారసత్వంగా వచ్చాయి. అయితే, కొందరు మతం ప్రాతిపదికన జనాన్ని సమీకరించి తద్వారా వారిని ఏకం చేసేందుకు ఆ దిశగా ప్రయత్నాలు చేశారు. అందుకే బ్రిటిష్ వాళ్లు మత ప్రాతిపదికన దేశాన్ని చీల్చారు. సిమ్లా కాన్ఫరెన్స్ వరకు కాంగ్రెస్ దాన్ని వ్యతిరేకించినా చివరకు బ్రిటిష్ వారి పెత్తనం నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు రాజీపడక తప్పలేదు. ఆనాడు ప్రగతి శీల ఉద్యమమంతా మత ప్రాతిపదికన కాకుండా సెక్యులర్ భావాలపైనే కొనసాగింది. వికేంద్రీకరణ ఆధారంగా పోరాటాలు జరిగాయి. ఆనాటి ఉద్యమంతో నేటి పరిస్థితుల్ని బేరీజు వేసుకొని చూస్తే.. మత శక్తులు మళ్లీ ప్రతి అంశాన్ని రాజకీయాలతో ముడిపెడుతున్నట్టు కనబడుతోంది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో మనం సాధించుకున్న విలువలు అరిగిపోయాయా? అనిపిస్తోంది.

నేడు దేశంలో విపరీతంగా పెరుగుతోన్న జనాభాతో పాటు అనేక కొత్త సమస్యలు కూడా పుట్టుకొస్తున్నాయి. అవినీతి ప్రధానంగా ప్రతిస్థాయిలోనూ పట్టిపీడిస్తోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నల్లధనం విపరీతంగా పేరుకుపోతోంది. నల్లధనం ఉత్పత్తి జరుగుతున్న దేశాల్లో భారత్‌ది నాలుగో స్థానం అంటేనే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు మహిళలకు భద్రత కరువవుతోంది. ఎన్నిచట్టాలు



తీసుకొచ్చినా ఏమాత్రం వ్యవస్థలో మార్పు రావడంలేదు. దేశంలో ప్రతి రెండు గంటలకు సుమారు ఏడుగురు మహిళలు లైంగికదాడులకు గురవుతున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ఇక కిడ్నాపింగ్‌లు, వేధింపులకు గురవుతున్న మహిళల సంఖ్య వేల సంఖ్యలోనే ఉంది. ఇక శిశు మరణాలు, ఆకలిచావులు ఇలా చెప్పుకుంటూ పోతే సమస్యల చిట్టా చాంతాడంత ఉంది. ఎన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసినా వాటి మధ్య సమన్వయ లోపం, పర్యవేక్షణ కరువవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. ఏ పార్టీలు అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఎన్నికలను డబ్బుమయం చేసి రాజకీయాలను భ్రష్టు పట్టించారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు ఆగడంలేదు. కార్మికుల హక్కులకు రక్షణ కరువవుతోంది. స్వాతంత్ర్యం తొలి రోజుల్లో వచ్చిన ప్రభుత్వాలు కార్మికులకు అనుకూల విధానాలను తీసుకుంటూ అభివృద్ధిలో నడిస్తే.. నేడు కొద్దిమంది పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే విధానాలతో మన ప్రభుత్వాలు నడుస్తున్నాయి. అదే ఆనాటికి నేటికీ ఉన్న ప్రధాన తేడా. ఉద్యమ స్వరూపాన్ని నాటి పార్లమెంట్ ప్రతిబింబిస్తే.. ఈనాడు పార్లమెంట్‌కు వెళ్తున్న అధికశాతం మందికి అనుకూలంగా విధానాలను ప్రభుత్వాలు తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నాయి.

నాటి ఉద్యమంలో ఫ్యూడల్ శక్తుల్ని బలహీనపరిచే దిశగా విధానాలు కొనసాగిస్తే.. ఈనాడు మళ్లీ అవే శక్తులను బలపరిచే విధానాలు వస్తున్నాయి. తద్వారా అణగారిన వర్గాల సంక్షేమాన్ని పెడచెవిన పెడుతూ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి నుంచి తప్పుతున్నామా అనే అనుమానం కలుగుతోంది. ఆనాడు స్వేచ్ఛ ఎక్కువగా ఉండేది. స్వాతంత్ర్య ఉద్యమంలో భిన్నాభిప్రాయాలు, వైరుధ్యాలు కనబడేవి. అందరి అంతిమ లక్ష్యం ఒక్కటే అయినప్పటికీ దాన్ని సాధించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై వేరువేరు అభిప్రాయాలను వ్యక్తం చేసేవారు. కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీలు వచ్చాయి. అయితే, ఈనాడు అలాంటి వైరుధ్యాలను భరించే పరిస్థితి కనబడకపోవడం ఆందోళనకరం. ఈనాడు సెన్సార్‌షిప్ వస్తోంది. నాటి డెమోక్రసీలో అందరి అభిప్రాయాలను గౌరవించేవారు. డెమోక్రసీకి వివిధ అభిప్రాయాలు గౌరవించేవారు. ఈనాడు అలాంటి వాటిని భరించే పరిస్థితి కూడా లేకుండా పోతోంది. ప్రతిపక్షాలు చేసే విమర్శల్ని సైతం తట్టుకోలేని పరిస్థితులు దాపురించాయి. ప్రజాస్వామ్య మనుగడకు ఇదెంతో ప్రమాదం. ఒక ప్రజాప్రతినిధి మాట్లాడిన దాన్ని సెన్సార్ చేయడం వాక్ స్వాతంత్ర్యంపై జరిగిన దాడి చేయడమే అవుతోంది. ఈనాడు దేశంలో ఇలాంటి పరిస్థితులే తలెత్తుతుండటం బాధాకరం. గతంలో అమెరికాలోని బర్కెలీ విశ్వవిద్యాలయంలో వాక్ స్వాతంత్ర్యంపై దాడిని నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమం వచ్చింది. విద్యార్థి సంఘాల నేతల స్పీచ్‌లను వీసీ సెన్సార్ చేసేవారు. దీన్ని వ్యతిరేకిస్తూ అక్కడి విద్యార్థులు కదంతొక్కి చివరకు అపూర్వమైన విజయం సాధించారు. ఏ దేశంలోనైనా వాక్ స్వాతంత్ర్యంపై దాడి జరిగితేదానిపై రాజీలేని పోరాటం చేయాల్సిందే.

స్వాతంత్ర్య ఉద్యమం మనకు రెండు సందేశాలను ఇచ్చింది. ఒకటి సోషలిజం కాగా, రెండోది సామాజిక న్యాయం. ఈ రెండింటినీ సాధించేందుకు అద్భుతమైన రాజ్యాంగాన్ని కూడా రూపొందించారు. అది రాజ్యాంగం అనేదానికంటే గత తరం వీలునామా అనడం బాగుంటుందేమో. మనం ఆ త్యాగధనుల వారసులం. వాటిని ఎంతవరకు నిలబెట్టుకుంటామో చరిత్ర ఎదురుచూస్తోంది. ఆ ఉద్యమంలో ఎంతోమంది మహానుభావులు రక్తతర్పణం చేశారు. కష్టాలు అనుభవించారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు ఉద్యుక్తులు కావడమే నేటి తరం ముందున్న సవాల్.

-ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు

కవిత్వం భాషపై ఉన్న పట్టును చాటితే... కథలు, నవలలు సమకాలీన సమాజ వాతావరణాన్ని కన్నుల ముందు సాక్షాత్కరింపజేస్తాయి. సరళమైన భాషలో సంఘటనలు వర్ణిస్తూ.. కథలో లీనం చేసి పాఠకులను ముందుకు నడిపిస్తాయి. ఎందరో రచయితలు తమ నవలల ద్వారా ఆనాటి పరిస్థితులను, జీవనవిధానాన్ని మనకు పరిచయం చేస్తున్నారు. వారిలో అందరూ పేరుప్రఖ్యాతులు సాధించలేకపోవచ్చు. కానీ, వారి కథలు, నవలలు చదివినప్పుడు మాత్రం బాగా రాశారు అన్న పాఠకుల హృదయస్పందన వారి ఉనికిని చాటుతుంది. అలా ఎందరో పాఠకుల మెప్పు పొందిన రచయిత వావిలికొలను రాజ్యలక్ష్మి.. 70కి పైగా కథలు, 16కు పైగా నవలలు రాసిన రచయిత, ఆర్టిస్ట్. రాయడం కన్నా పాఠకులకు చేరడమే కష్టంగా మారింది అంటూ ఆమె పంచుకున్న విశేషాలు.



పాఠకులకు చేరడమే కష్టం..

"నేను పుట్టిపెరిగింది నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఏదుట్ల గ్రామం. అమ్మ పోల్కంపల్లి రంగనాయకమ్మ, నాన్న శేషగిరిరావు. మేం పన్నెండుమంది పిల్లలం. నేను పదకొండవదాన్ని. నా తర్వాత చెల్లె. చిన్నతనం నుంచి ఇంట్లో కాస్త గారాబం ఎక్కువే. ఏదుట్లలో ఐదో తరగతి వరకు చదివి ఆ తర్వాత వనపర్తిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదివాను. తొమ్మిదో తరగతి పూర్తి కాగానే పెండ్లి చేశారు. మా ఆయన వి. సీతారామారావు. ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసేవారు. నా చదువుకు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. పెండ్లైన తర్వాత పదోతరగతి పరీక్షలు రాశాను. ఆంధ్ర సారస్వత పరిషత్తు నుంచి విశారద పరీక్ష పాసు అయ్యాను.

పొట్లంగా వచ్చే పేపర్ దాచుకుని..

మా ఇంటికి పేపర్ వచ్చేది. మా చిన్నప్పుడు ఇన్ని పత్రికలు, పుస్తకాలు అందుబాటులో లేవు. కిరాణకొట్టు నుంచి సామాన్లు కూడా పేపర్‌లోనే కట్టి ఇచ్చేవారు. ఆ పేపర్‌ను జాగ్రత్తగా దాచుకుని చదువుకునేవాళ్లం. చిన్న పేపర్ ముక్క కూడా పడేసేవాళ్లం కాదు. అట్లా ఆసక్తితో ఇంట్లో ఉన్న పౌరాణిక గ్రంథాలు చదివాను.

వదిన ప్రభావంతోనే..

ఆరో తరగతి చదవడానికి వనపర్తికి వచ్చానని చెప్పా కదా. ప్రముఖ రచయిత పోల్కంపల్లి శాంతాదేవి నాకు వదిన అవుతారు. నేను ఆరోతరగతిలో ఉన్నప్పుడు ఆమె 'రక్తతిలకం', 'పాణిగ్రహణం' నవలలు రాస్తున్నారు. నేను రోజూ స్కూల్ నుంచి రాగానే ఆ రోజు ఏం రాశారో చదివేదాన్ని. అలా నవలపై ఆ వయసులోనే ఆసక్తి ఏర్పడింది. స్కూలు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. కొడూరి కౌసల్య, యద్దనపూడి సులోచన, మల్లాది వెంకటకృష్ణ, యర్రంశెట్టి సాయి నవలలు ఎక్కువగా చదివాను.

మొదటి కథ బాలమిత్రలో..

చిన్నచిన్న కథలు రాసే ప్రయత్నం ఎనిమిదో తరగతిలోనే చేశాను. నేను రాసిన మొదటికథ బాలమిత్ర పిల్లల మాసపత్రికలో అచ్చయ్యింది. చిన్నపిల్లల కోసం రాసిన సరదా కథ ఇది. 'మీసాలపై రోషాలు' కథ పేరు. ఆ తర్వాత చాలా కథలు బాలమిత్రలో వచ్చాయి. ఎక్కువగా పిల్లల కథలు రాశాను. ఇప్పటి వరకు దాదాపు 70కథలు రాసాను. కొన్ని కథలను సంపుటిగా ప్రచురించాం.

సైనిక కుటుంబాల జీవితాలను..

మా ఆయన ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేయడంతో ఆయనకు ట్రాన్స్‌ఫర్ అయిన ప్రతి ఊరికి నేను, మా ఇద్దరు పిల్లలు వెళ్లేవాళ్లం. ఢిల్లీ, గుజరాత్, అస్సాం, కర్ణాటకలలో చాలా సంవత్సరాలు ఉన్నాం. నాకు హిందీతో పాటు ఇతర ప్రాంతీయ భాషలను కొద్దికొద్దిగా నేర్చుకునే వీలు కలిగింది. విభిన్న నేపథ్యం ఉన్న జీవితాలను చూసే అవకాశం లభించింది. ఇది నా రచనా వ్యాసంగానికి ఎంతో ఉపకరించింది.



మక్కువతో చిత్రకళ..

ఆయన ఎయిర్‌ఫోర్స్‌లో చేస్తున్నప్పుడు బేగంపేటలోని క్వార్టర్స్‌లో ఉండేవాళ్లం. మా పోర్షన్ పక్కనే ఎయిర్‌ఫోర్స్ ఆర్టిస్ట్ ఉండేవారు. ఆయన వద్ద నేను పెయింటింగ్ నేర్చుకున్నాను. అస్సాంలో మా అమ్మాయి చదివే స్కూలు వాళ్లకు వెంకటేశ్వర స్వామి నిలువెత్తు పెయింటింగ్ వేసి ఇచ్చాను. ఇప్పటికీ ఆ స్కూలులో ఉంటుంది. కూచిపూడి నాట్య భంగిమలు మరో స్కూల్‌కు వేసి ఇచ్చాను.

తెలుగు టీచర్‌గా రెండు దశాబ్దాలు..

ఎయిర్‌ఫోర్స్ నుంచి మా ఆయన 1987లో బయటకు వచ్చారు. సికింద్రాబాద్‌లో ఉన్నాం. ఇక్కడే ఒక ప్రైవేటు స్కూల్‌లో ఇరవై సంవత్సరాలు తెలుగు టీచర్‌గా పనిచేశాను. ఎక్కువగా మిలిటరీ, కేంద్ర సర్వీసుల్లో పనిచేసేవాళ్ల పిల్లలు ఆ స్కూల్‌కు వచ్చేవారు. వారికి సులభంగా తెలుగుభాష నేర్పించడానికి కొన్ని టెక్నిక్స్ నేనే తయారుచేసేదాన్ని. అంతకుముందు చాలా రాష్ట్రాలలో ఉన్నందున ఆయా భాషలపై ఉన్న కొంత పట్టు ఇక్కడ పనికొచ్చింది. సులభంగా వారికి తెలుగు నేర్పించగలిగాను. టీచర్‌గా పనిచేస్తున్నప్పుడు ఏ మాత్రం సమయం ఉన్నా పిల్లల కథలు రాసేదాన్ని. ఆకాశవాణి హైదరాబాద్, విశాఖపట్నం కేంద్రాల్లో స్త్రీల కార్యక్రమాల్లో కొన్ని కథలు ప్రసారమైనవి.

లండన్‌లో చిగురించిన 'ప్రేమపుష్పం'..

పిల్లల చదువులు అయిపోయాయి. అమ్మాయి లండన్‌లో బ్రిటన్ గవర్నమెంట్ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. అల్లుడు కూడా అక్కడే ఇంజనీరు. మా అబ్బాయి ఒక కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. బాధ్యతలు తీరాయి, ఇక విశ్రాంతి తీసుకుందాం అనుకున్నాను. ఆ సమయంలో మా అమ్మాయి దగ్గరకు లండన్ వెళ్లాను. అక్కడ మా అమ్మాయితో పాటు బంధువులు కూడా నా రచనల ప్రస్తావన తీసుకువచ్చారు. 'అమ్మా... ఇప్పుడు ఎందుకు రాయడం లేదు, మళ్లీ రాయవచ్చు కదా!' అని మా అమ్మాయి అడిగింది. నిజమే కదా! ఎన్ని అనుభవాలు.. ఎన్ని జ్ఞాపకాలు. వాటికి అక్షర రూపం ఇవ్వకపోతే ఎలా? అనిపించింది. చిన్నతనం నుంచి నాకు మా వదిన శాంతనే ప్రేరణ. పెండ్లి కన్న ముందు నవలలు రాశాను. ఇప్పుడు ఖాళీ సమయం చాలానే ఉంది. దాన్ని వృథా చేయడం ఎందుకు అనిపించింది. అలా లండన్‌లో ఉన్నప్పుడు తిరిగి నవలలు రాయడం ప్రారంభించాను. ఆ నవల 'ప్రేమపుష్పం' గా మారి పాఠకులకు చేరింది. ఆ తర్వాత వరుసగా నవలలు రాస్తున్నాను. ఇప్పటివరకు మొత్తం 16 నవలలు ముద్రితమైనవి. మరో మూడు నవలలు ముద్రణలో ఉన్నాయి.

సైనిక కుటుంబాల జీవితాలపై..


గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో మేం కొన్ని నెలలు ఉన్నాం. అప్పుడు భారత్ - పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నది. మా ఆయన వైర్‌లెస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవారు కాబట్టి కమ్యూనికేషన్ ఎప్పటికప్పుడు అందించేందుకు వీలుగా ఆయన ఆఫీస్‌లోనే ఉండిపోయారు. దాదాపు నెలరోజుల పాటు ఆయన ఇంటికే రాలేదు. చాలా మంది ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ వాళ్లు ఇంటిముఖం చూడలేదు. చుట్టూ.. అడవిప్రాంతం. సాయంత్రం ఐదు అయితే చాలు ఇంటి నుంచి బయటకు రావద్దు. రాత్రివేళ లైట్‌కూడా వేయకూడదు. మేం ఉన్న ప్రాంతం ఉనికి కూడా తెలియకుండా కిటికీలకు, తలుపులకు నల్లటి కార్బన్ పేపర్లు అతికించేవారు. ఒక రకంగా చెప్పాలంటే చీకటిలోనే ఉండేవాళ్లం. పిల్లలతో కలిసి బిక్కుబిక్కు మంటూ గడిపేవాళ్లం. ఈ అనుభవాలను, సైనిక కుటుంబాలను ఇతివృత్తంగా తీసుకుని ఒక నవల రాయాలని ఉంది.

రాయడం కన్నా.. ముద్రణనే చాలా కష్టం..

చిన్నతనం నుంచి సాహిత్యంతో ఉన్న అనుబంధం, నవలలు చదివిన అనుభవంతో చుట్టూ ఉన్న జీవితాలను పరిశీలనగా చూడటం అలవాటు అయ్యింది. వాస్తవిక సంఘటనలకు కొంత కల్పితం చేర్చి నవలగా మలుస్తుంటాను. రాత్రిపగలు తేడా లేకుండా కథను అక్షరాలలోకి పేర్చుతూ పోతాను. నవల పూర్తి అయిన తర్వాత ముద్రణ చాలా కష్టం అవుతుంది. ఎంతో కష్టపడి రాసిన నవల పదిమంది చదివి బాగుంది అన్నప్పుడే రచయితకు సంతృప్తి. చాలా నవలలు సొంత డబ్బులతో వేసుకున్నవే. ప్రభుత్వం మంచి కథలను, నవలను ముద్రించడానికి ఆర్థిక సహాయం చేస్తే బాగుంటుంది.

వి. యశోద









తెల్లసొనతో మెరిసే చర్మం...

ముఖంగా ప్రకాశవంతంగా కనిపించాలని తహతహలాడేవారు రసాయనిక క్రీములను ఎక్కువగా ఉపయోగిస్తారు. వీటితో తాత్కాలికంగా మెరుపు అనిపించినా.. దీర్ఘకాలంలో చర్మంపై చెడు ప్రభావం చూపిస్తాయి. ఇంట్లో అందుబాటులో ఉండే ఎగ్ వైట్‌ను వేస్ ప్యాక్ చేసుకోవడం వల్ల ప్రకాశవంతమైన చర్మాన్ని పొందవచ్చు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. మరి ఈ కింది చిట్కాలను పాటించి చూడండి.మీ ముఖంలో వచ్చే మార్పును మీరే గమనిస్తారు.



- **గుడ్డు తెల్లసొన, తేనె:** రెండు కోడిగుడ్లను తీసుకోవాలి. అందులోని తెల్లసొనను ఒక బౌల్‌లో వేరు చేసి అందులో రెండు టీస్పూన్ల నిమ్మరసం, సగం టీస్పూన్ తేనె కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి అప్లైచేసుకుని పదినిమిషాల అలానే ఉంచుకోవాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.
- **గుడ్డు తెల్లసొన, పసుపు:** ఎగ్ వైట్‌లో ఒక టీస్పూన్ ఆరెంజ్ రసం, ఒక టీస్పూన్ పసుపును కలపాలి. ఈ మిశ్రమంలో ముఖంపై రెండు, మూడు నిమిషాల పాటు మర్దన చేయాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఇట్లా చేద్దాం

పచ్చి బఠానీలు ఉడికించినప్పుడు వెంటనే రంగు మారిపోతాయి. అలా రంగు మారకుండా ఉండాలంటే అందులో కొంచెం చక్కెరవేయాలి.

అనేక ప్రయోజనాలు...



తక్కువ విసీర్ణం కల్గిన నివాసాల్లో పడకగది విశాలంగా ఉండదు. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని మంచమే ఆక్రమిస్తుంది కాబట్టి దీని కిందనే క్యాబినెట్‌లు, ప్రత్యేక అరలు ఏర్పాటుచేసుకుంటే పుస్తకాలు, ఆల్బమ్‌లు, టాయ్స్ వంటివాటిని దాచుకోవచ్చు. బెడ్‌ను చేయించేటప్పుడే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో వస్తువులు ఎక్కడా బయటికి కన్పించకుండా గది విశాలంగా కన్పిస్తుంది.



డైనింగ్ టేబుల్ అనగానే ఎక్కువ స్థలం ఆక్రమిస్తుంది.. అందరి ఇళ్లలో మాదిరి భోజనబల్ల కాకుండా ఇంట్లో అందుబాటులో స్థలానికి తగ్గట్టుగా కూడా దీనిని చేయించుకోవచ్చు. రెస్టారెంట్లలో మాదిరి భోజనబల్లలు తక్కువ స్థలాన్ని ఆక్రమిస్తాయి. మడత పెట్టడానికి వీలుండే బల్లను గోడకు తగిలించే మాదిరి చేయించుకోవచ్చు. దీని వల్ల స్థలం కలిసి వస్తుంది.

ప్రధాన ద్వారం వెనకాల పుస్తకాల అల్మారాను ఏర్పాటు చేసుకోవచ్చు. కింద, పైన రెండు భాగాలుగా విడదీయొచ్చు. పైన పుస్తకాలు కన్పించేలా, కింద ఆల్బమ్స్, దినపత్రికలు, పాదరక్షలు దాచుకునేలా ఏర్పాటు చేసుకోవచ్చు. లివింగ్ రూమ్‌లో గోడకు వేలాడదీసిన టీవీ సెట్ కేంద్రంగా క్యాబినెట్ చేయిస్తే అలంకరణ వస్తువులు ఇక్కడ సర్దుబాటు చేసుకోవచ్చు. ఇంట్లో మెట్ల కింద స్థలాన్ని ఖాళీగా వదిలేయకుండా.. పుస్తకాల అల్మారాను ఏర్పాటు చేసుకోవచ్చు.

గంజితో కండరాలకు మేలు

గంజి వార్చిన అన్నం తింటే అసిడిటీ సమస్యలు రావని నిపుణులు అంటున్నారు. అన్నాన్ని కుక్కర్లో ఉడికించడం కంటే.. అన్నం వార్చి ఆ గంజిని తాగడం ద్వారా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి.

- గంజినీటిలో శరీరానికి కావాల్సిన ఎమినో యాసిడ్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి గ్లూకోజ్ కంటే ఎక్కువగా తక్షణ శక్తిని అందిస్తాయి.
- గంజి తాగడం వలన కండరాలకు మేలు జరుగుతుంది. ఆస్టియోపొరోసిస్ సమస్య నుంచి రక్షణ పొందవచ్చు.



- ఒక గ్లాస్ గంజిలో కొద్దిగా ఉప్పువేసి కలిపి తాగితే డయేరియా సమస్య నుండి బయట పడవచ్చు.
- ఎముకల గట్టితనానికి గంజి ఎంతో ఉపయోపడుతుంది. గ్లాస్ గంజిలో అరస్పూన్ అల్లం రసం, కొద్దిగా కొత్తిమీర వేసుకుని తాగితే ఎంతో మంచిది.
- గంజిలో కాస్త జీలకర్ర, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసుకుని తాగితే ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది. ఎసిడిటీ సమస్య రాదు.

ఇంగ్లీష్ ఛానల్ ఈదిన ఆసియా మహిళ





ఆర్తి గుప్తా
(24 సెప్టెంబరు 1940 - 23 ఆగస్టు 1994)

560కిలోమీటర్ల పొడవైన ఇంగ్లీష్ ఛానల్‌ను ఈదిన మొదటి ఆసియా మహిళగా ఆర్తి గుప్తా తన పేరు సువర్ణాక్షరాలతో లిఖించారు. అంతేకాదు జిబ్రాల్టర్ జలసంధిని ఈదిన తొలి భారతీయ మహిళ. క్రీడారంగంలో పద్మశ్రీ అవార్డు అందుకున్న మహిళగా మరో రికార్డు ఆమె సొంతం చేసుకున్నారు. సంకల్పం ఉంటే సాగరాన్నైనా దాటవచ్చని నిరూపించారు.

పశ్చిమ బెంగాల్లోని కలకత్తాలో జన్మించిన ఆర్తి రెండు సంవత్సరాల వయసులోనే తన తల్లిని కోల్పోయారు. ఆమె తండ్రి సాధారణ సైనిక ఉద్యోగి. ఆర్తి నాలుగేండ్ల వయసులోనే స్విమ్మింగ్ ప్రారంభించింది. ఆమె ప్రతిభను గుర్తించిన కోచ్ సచిన్ నాగ్ మరింత తర్ఫీదు ఇచ్చారు. ఐదేండ్ల వయసులో 110గజాల దూరం స్విమ్ చేసి బంగారు పతకం గెలుచుకున్నారు. భారత స్విమ్మర్ మిహిర్ సేన్ ఇంగ్లీష్ ఛానల్‌ను ఈదడంతో స్ఫూర్తి పొందిన ఆర్తి... తాను కూడా ఇంగ్లీష్ ఛానల్‌ను దాటాలని సంకల్పించారు. అకుంఠిత దీక్షతో సాధన చేసిన ఆమె 1959లో తన లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇంగ్లీష్ ఛానల్ ఈదిన మొట్టమొదటి ఆసియా మహిళగా సరికొత్త రికార్డు సొంతం చేసుకున్నారు. 1946 –1956 మధ్యకాలంలో అనేక స్విమ్మింగ్ పోటీల్లో ఆర్తి పాల్గొన్నారు. ఈ సమయంలో ఆమె రెండు రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించారు.

WOMEN of the day

ఆ తర్వాత గంగానదిలో సుదూర ఈత పోటీలో పాల్గొన్నారు. అదే ఇంగ్లీష్ ఛానల్ని దాటడానికి మొదటి ప్రేరణ ఇచ్చింది.

1958 బట్లిన్ ఇంటర్నేషనల్ క్రాస్ ఛానల్ స్విమ్మింగ్ రేస్‌లో విజయం సాధించి... ఇంగ్లీష్ ఛానల్ని దాటడానికి భారత ఉపఖండంలోని మొదటి వ్యక్తిగా అర్హత సంపాదించారు. తొలి ప్రయత్నంలో ప్రతికూల పరిస్థితులు ఎదురుకావడంతో ఆమె విఫలమయ్యారు. 29 సెప్టెంబరు 1959న ఆమె రెండవ ప్రయత్నం చేశారు. ఫ్రాన్సులోని కేప్ గ్రిస్ నెజ్ నుంచి, 16 గంటలు, 20 నిముషాల పాటు ఈదుతూ ఇంగ్లాండ్లోని సాండ్గేట్ చేరుకున్నారు. ఇంగ్లాండ్ తీరానికి చేరినప్పుడు ఆమె భారత జెండాను ఎగురవేసారు. సెప్టెంబరు 30 న ఆల్ ఇండియా రేడియో ఆర్తీ సాహా సాధించిన విజయాన్ని ప్రకటించింది. సాహసంతో తన సంకల్పాన్ని పూర్తిచేసిన ఆర్తీ ఎంతో మంది మహిళా స్విమర్లకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమెను భారత ప్రభుత్వం 1960 లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. అంతేకాదు 1999 లో ఆమె ఫొటోతో పోస్టల్ స్టాంప్ విడుదల చేసారు.

సానుకూలతే మంత్రంగా...



పిల్లలు కోరినవన్నీ ఇవ్వడంతోనే తల్లిదండ్రులుగా మన బాధ్యత అయిపోదు. వారిని సరైన రీతిలో పెంచండి తల్లిదండ్రుల బాధ్యత. బాధ్యత అనగానే పిల్లల మీద ఒత్తిడి పెంచొద్దు... వారిలో ఆత్మవిశ్వాసాన్నీ పెంచగలగాలి. వారికి మంచి చెడులను వివరించాలి. వారిలో సానుకూల దృక్పథం పెంచాలి. అప్పుడే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పెరుగుతారు.

ఆత్మవిశ్వాసం పెంచండి...

ఎదిగే వయసులో నాదీ, నీదీ అనే భావనను పదే పదే గుర్తు చేసేది తల్లిదండ్రులే. అదే అలవాటయితే వారిలో స్వార్థం పెరుగుతుంది. దానితో పాటే సందర్భాన్ని బట్టి ఇచ్చిపుచ్చుకోవడమూ అలవాటు చేయాలి. మంచి, చెడుల మధ్య తేడానూ చెప్పాలి. అప్పుడే సానుకూలత వారి సొంతమవుతుంది. తాను అనుకున్నది దక్కనప్పుడు...అసూయా, ద్వేషాలకూ తావుండదు. చిన్నారుల్లో కొన్ని భయాలు, అపోహలు గూడుకట్టుకుపోతుంటాయి. అన్నం తినకపోయినా, హోం వర్క్ చేయకపోయినా కూడా బూచాడు వస్తాడనో, డాక్టర్ వచ్చి ఇంజక్షన్ ఇస్తారనో భయపెడుతుంటారు కొందరు తల్లిదండ్రులు. ఇలా పదే పదే చెప్పడం వల్ల వారిలో దానిపై వ్యతిరేకతతోపాటు, అభద్రతా ప్రారంభమవుతుంది. దీర్ఘకాలంలో ఆత్మవిశ్వాసం లోపించేలా చేస్తుంది. వీలైనంతవరకూ వారితో ఏ పనిచేయించాలన్నా సానుకూలంగానే చెప్పే ప్రయత్నం చేయాలి.

ప్రోత్సహించండి...

చిన్నపిల్లలు చెప్పే విషయాల్ని కొట్టిపారేయకండి. వాళ్ల మనసుల్లో ఉన్న ఆలోచనల్ని, సందేహాలను తెలుసుకోండి. వారి ఉత్సాహానికి వెన్నుతట్టండి. వారి ఆందోళనల్ని తీసి పారేయండి. నీకెందుకు, నీకేం తెలుసని తేలిగ్గా తీసి పారేయకండి. మీరలా ప్రతిసారీ చేస్తుంటే నిజం చెప్పకూడదనో, లేదా తాము ఎందుకు పనికిరామనో భావన వారిని కుంగదీస్తుంది. అలాకాకుండా ఉండాలంటే వారి ఆలోచనల్ని ప్రోత్సహించండి. ఏదైనా సమస్యకు సరైన పరిష్కారం సూచిస్తే శెభాష్ అని వెన్నుతట్టండి. పిల్లలు ఏదైనా కొత్త విషయం/అంశం నేర్చుకునే క్రమంలో పొరపాట్లు చేయడం సహజం. నీకు ఏదీ రాదు అని తిట్టకూడదు. ఎక్కడ పొరపాటు చేశారో చెప్పి.. ఎలా సరిదిద్దుకోవాలో వివరించండి. అది వారిలో కచ్చితంగా మార్పు తెస్తుంది.

పొరపాట్లు చేసినప్పుడు...

ఎంత పొరపాటు చేసినా సరే.. తోబుట్టువులతో పోల్చే ప్రయత్నం వద్దు. అక్క/తమ్ముడిలా ఉండొచ్చు కదా అని వారికి చెప్పకండి. ఇది తోబుట్టువుల పట్ల శత్రుత్వాన్ని కలిగిస్తుంది. చిన్నప్పటి నుంచే వారి మనసులో తారతమ్యాల బీజాన్ని నాటినవారవుతారు. అది పెరిగి పెద్దదై వారి మధ్య అనుబంధాలకు అడ్డుకట్టలా మారుతుంది. పిల్లల ఏదయినా తప్పు చేయడం ఆలస్యం.. దానికే ఏదో చేయరాని నేరం చేసినట్టు వారిపై అరవడమో, కొట్టడమో చేయకండి. 'నిన్ను చూసి నువ్వు సిగ్గుపడాలి.. నీ వయసులో మేం అలా లేం..' అంటూ వారు అవమానపడే తరహాలో తిడితే ఇంకా కుంగిపోతారని గుర్తుంచుకోండి.

గాయపరచొద్దు...

మీకు నచ్చని పని మీ పిల్లలు చేసినప్పుడు మీకు బాధ కలగడం సహజమే. అలాంటప్పుడు 'నన్నెలా బాధపెట్టాలా అని ప్రతినిమిషం ఆలోచిస్తావ్ నువ్వు.. తల్లిదండ్రులు అంటే లెక్కలేదు నీకు. మా మాటలకు విలువ లేదు" అని అదేపనిగా తిట్టకండి. ఆ మాటలు వారి చిన్ని హృదయాన్ని గాయపరుస్తాయని మరచిపోవద్దు. మీరు బాధపడిన సందర్భాన్ని, అంశాన్ని వారికి విడమరిచి చెప్పే ప్రయత్నం చేయండి. తప్పకుండా తమ తప్పు తెలుసుకుంటారు.



రెబల్స్‌కు జై

కాకినాడ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో రెబల్స్‌గా నిలిచిన తెలుగు తమ్ముళ్లకే టీడీపీ, బీజేపీలు మద్దతు తెలిపే విచిత్ర పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్‌లోని 48 డివిజన్లకు ఈ నెల 29న ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి ఎన్నికలోనూ బీజేపీకి ఒకటో రెండో డివిజన్లు కేటాయించేవారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటంతో కనీసం 15 సీట్లు ఇవ్వాలంటూ ఆ పార్టీ నేతలు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. చివరికి తొమ్మిది సీట్లు కేటాయించేలా ఒప్పించుకోగలిగారు. బీజేపీకి 4, 5, 9, 29, 35, 36, 39, 41, 47 డివిజన్లను కేటాయించాలని పట్టుబట్టి మరీ తీసుకున్నారు. 5, 9, 47 డివిజన్లలో ఆ పార్టీకి కొంత పట్టుంది. మిగిలిన డివిజన్లలో జనంతో సంబంధం లేని వారిని ఎన్నికల్లో నిలబెట్టారు. దీంతో టీడీపీలో ఉండి సీట్లు ఆశించిన నాయకులు ఆయా డివిజన్లలో రెబల్స్‌గా పోటీ చేస్తున్నారు. కొన్ని డివిజన్లలో బీజేపీ అభ్యర్థులు ప్రచారమే ప్రారంభించలేదు. మరికొన్ని డివిజన్లలో నామమాత్రంగా ప్రచారం సాగుతోంది. బీజేపీ పోటీ చేస్తున్న డివిజన్లలో టీడీపీ రెబల్స్ గట్టి పోటీ ఇవ్వడం, బీజేపీకి కొన్ని ఓట్లు చీలిపోయి ప్రత్యర్థి సునాయాసంగా గెలుపొందే అవకాశాలుండటంతో టీడీపీ, బీజేపీ నాయకులు సమాలోచనలు చేసుకున్నారు. దీంతో గట్టి పోటీ ఇచ్చే టీడీపీ రెబల్స్‌కు మద్దతు ఇచ్చి గెలిపించుకోవాలని నిర్ణయించారు. 35వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి కొండాబత్తుల ప్రసాదరావు ఎన్నికలకు ఇష్టపడని కారణంతోపాటు బలహీనంగా ఉన్నందున టీడీపీ రెబల్‌గా పోటీ చేసిన బలుసూరి రామకృష్ణకు మద్దతు ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య కలిసి ఆ డివిజన్‌లో రామకృష్ణ తరపున ప్రచారం చేశారు. స్వతంత్రంగా బరిలో దిగిన రామకృష్ణ టీడీపీ, బీజేపీ కండువాలను వేసుకుని మరీ ప్రచారం చేస్తున్నారు. 39వ డివిజన్‌లో తోర కృష్ణప్రియకు బీజేపీ సీటు ఇచ్చారు.

జీవో 279 రద్దు చేయకపోతే సమ్మె తప్పదు

- మున్సిపల్ కార్మికుల జేఏసీ హెచ్చరిక
- చలో విజయవాడ మహా ప్రదర్శన, బహిరంగ సభ

అమరావతి: మున్సిపల్ కార్మికుల ఉపాధిని దెబ్బతీసే 279 జీవోను రద్దు చేయాలని, సెప్టెంబరు 15లోగా సమ స్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. లేకుంటే నిరవధిక సమ్మె చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. జేఏసీ మంగళవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ నుంచి అలంకార్ సెంటర్ వరకు మహాప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన మున్సిపల్ కార్మికుల గర్జన సభలో కార్మికులనుద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ మాట్లాడారు. ఏడాది నుంచి మున్సిపల్ కార్మికులు డిమాండ్లను పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారని గఫూర్ గుర్తు చేశారు. జీవో 279తో కార్మికులు ఆందోళనలో ఉన్నారని, అయితే ప్రభుత్వం ఈ అంశంపై చర్చించి, భరోసా ఇచ్చేందుకు సిద్ధంగా లేదని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం, ఆశా, అంగన్‌వాడీలు.. ఇలా కార్మికులందరినీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరం చేసుకుంటున్నారని, ఈ నేపథ్యంలో వచ్చే 2019 ఎన్నికల్లో టీడీపీని ఎవరూ కాపాడలేరని హెచ్చరించారు. సెప్టెంబర్ 15 నాటికి మున్సిపల్ కార్మికులంతా సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ ఎర్రజెండాను చూస్తే చంద్రబాబు సహించలేకపోతున్నారన్నారు. 279 జీవో అమలుకు అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.



ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మిక వర్గాన్నీ కదిలిస్తామని తెలిపారు.

ఐక్య పోరాటాలకు పిలుపు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల ఐక్య పోరాటాల వల్లే ప్రభుత్వం ఒక అడుగు వెనక్కు వేసిందని, అయితే మున్సిపల్ కార్మికుల మెడపై కత్తిలా 279 జీవో వేలాడుతూనే ఉందని తెలిపారు. ఈ జీవో రద్దు కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులు రెండు రోజులు పనులు ఆపేస్తే నగరాలు చెత్తమయం అవుతాయని, ప్రజా జీవనం స్తంభించిపోగలదని హెచ్చరించారు. కార్మికులు చేసే ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు.

నంద్యాలలో నేడే పోలింగ్

నంద్యాల: రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠతతో ఎదురు చూస్తున్న నంద్యాల ఉప ఎన్నికకు జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు పూర్తి చేసింది. నేటి ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం అరు గంటల లోపు ఓటర్లు పోలింగ్ కేంద్రం అవరణలోకి వస్తే వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. మంగళవారమే అన్ని కేంద్రాలకు పోలింగ్ సామాగ్రిని చేరవేశారు. ఇప్పటిదాకా ఈవీయం యంత్రాలతో ఎన్నికలు జరిగితే కేవలం బ్యాలెట్ యూనిట్ కంట్రోల్ యూనిట్లుండేవి. దేశ వ్యాప్తంగా ఈవీయంలు ట్యాంపరింగ్‌కు గురవుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఈసారి ఓటర్లు తాము వేసిన ఓటును సరిచూసుకునేందుకు 'ఓటర్ వెరిఫైడ్ పేపర్ ట్రయిల్' (వీవీపీఏటీ) యంత్రాన్ని కూడా పెట్టారు. రాష్ట్రంలో మొదటిసారిగా వీవీపీఏటీ యంత్రాన్ని అందుబాటులోకి తేవడంతో ఓటర్లలో కూడా పోలింగ్ జరిగే తీరు పట్ల అతృత వ్యక్తమవుతోంది. ఇలా ఉండగా ప్రధాన పార్టీలు రెండూ ప్రలోభాలకు తెరలేపాయి. విచ్చలవిడిగా డబ్బు కుమ్మరించాయి. మహిళలకు ముక్కుపుడకలు, చీరలు కూడా పంపిణీ చేశారు. నంద్యాల ఉప ఎన్నికల పరిధిలో 2,18,855 మంది ఓటర్లుకుగాను 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు దాదాపుగా 15 వేల సిబ్బందిని నియమించారు. 141 అతి సమస్యాత్మక, 74 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా భద్రతా చర్యలు చేపట్టారు. అరు కంపెనీల కేంద్ర పోలీసు బలగాలు నంద్యాలకు చేరుకొన్నాయి. పోలింగ్ కేంద్రాలన్నింటినీ తమ అధీనంలోకి తీసుకున్నాయి. నంద్యాల పట్టణంతోపాటు నంద్యాల రూరల్, గోస్పాడు మండలాల్లో పోలింగ్ జరగనుంది. ఈ పోలింగ్ కేంద్రాలన్నింటిలోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. నెట్‌వర్కు లేని ప్రాంతాల్లోనూ నిరంతరం వీడియోలు తీసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

25న బహుజన పుస్తకావిష్కరణ : భూపతి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రిజర్వేషన్ల చరిత్రలో సంచలనం సృష్టించిన బిపి మండల్ 99వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 25న డాక్టర్ కదిరె కృష్ణ రచించిన 'బహుజన' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథిగా కాక మాధవరావు, అతిథులుగా ప్రొఫెసర్ సింహాద్రి, సామాజికవేత్త గోగు శ్యామల, డాక్టర్ నాగార్జున, డాక్టర్ బాలబోయిన సుదర్శన్, పుస్తక రచయిత కదిరే కృష్ణ, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ బహదూర్, భూమి బుక్ ట్రస్ట్ చైర్మెన్ శ్రీనివాస్, తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకులు రాంపల్లి రమేష్ పాల్గొననున్నారు. పుస్తకావిష్కరణకు సంబంధించి మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వివిధ తెలుగు దిన పత్రికల్లో అచ్చయిన వ్యాసాల సంకలనంగా దీన్ని అభివర్ణించారు. ఈ వ్యాసాలు చాలకాలంగా తెలుగు రాష్ట్రాల్లో పలు చర్చలకు దారి తీశాయన్నారు.

'సమాజాన్ని ప్రభావితం చేయగలిగే శక్తి టీచర్‌కే'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమాజాన్ని ప్రభావితం చేయగలిగే శక్తి టీచర్‌కు మాత్రమే ఉందని గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎలాంటి ఒత్తిడినైన నివారించడానికి రక రకాల పద్ధతులను నేర్పించే పరిజ్ఞానం ఉపాధ్యాయుడికి మాత్రమే ఉంటుందన్నారు. డాక్టర్ సి విరేందర్ రచించిన టీచింగ్ – సైకాలజీ అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

సీడీపీపై పూర్తి వివరాలివ్వండి.. : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నియోజక అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ)పై పూర్తి వివరాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలంటూ తెలంగాణ సర్కారును రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. సీడీపీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా ఇచ్చే నిధులపై ఆడిట్ జరుగుతున్నదని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. గత రెండేండ్లు ఆడిట్‌ను నిర్వహించామని.. ప్రస్తుత యేడాది కూడా నిర్వహిస్తామని వివరించింది. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.700 కోట్లకు పైగా వెచ్చించిందని పేర్కొంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని మంగళవారం బెంచ్ విచారణకు స్వీకరించింది. అయితే చేసిన పనులపై తనిఖీలుగాని, వ్యయంపై ఆడిట్‌గానీ నిర్వహించలేదని పద్మనాభరెడ్డి తన పిటీషన్‌లో పేర్కొన్నారు. దీనిపై అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి పలు వివరాలను కోర్టుకు సమర్పించారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ పిటీషన్ దాఖలు చేయాలన్న న్యాయస్థానం.. తదుపరి విచారణకు మూడు వారాలకు వాయిదా వేసింది.

కాంట్రాక్టు లెక్చరర్ల జీతాల బడ్జెట్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల జీతాల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఓ ప్రకటన విడుదల చేశారు.

26 లేదా 28న ఉద్యోగాల భర్తీపై సమావేశం

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై హైదరాబాద్‌లో ఈనెల 26 లేదా 28న సమావేశం నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీలకు అధికారాలు బదలాయించాలి'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం గ్రామ పంచాయతీలకు 29 అధికారాలను బదలాయించాలని కోరుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ టి.మనోజ్ కుమార్‌కు రాష్ట్ర సర్పంచుల ఐక్యవేదిక వినతిపత్రం అందజేసింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆందోల్ కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం న్యూఢిల్లీలో కలవడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని, అధికారాల బదలాయింపు నకు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 13, 14వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా మళ్లీస్తున్నదని విమ ర్శించారు. కరెంట్, నీటి బకాయిలు, వేతనాల పేరుతో తీసుకుంటు న్నద న్నారు. జాతీయ ఉపాది హామీ నిధులను సైతం దారి మళ్లిస్తు న్నదని, గ్రామం యూనిట్ గా తీసుకుని నిధులు ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన సీనరేజీ, స్టాంప్ డ్యూటీ బకాయిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈమేరకు గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ టి.మనోజ్‌కుమార్ సానుకూలంగా స్పందించినట్టు తెలియజేశారు.

24న భగీరథపై సీఎం పూర్తిస్థాయి సమీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథపై ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు గురువారం పూర్తిస్థాయి సమీక్ష చేయనున్నారు. ఈమేరకు భగీరథ కార్పొరేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికార యంత్రాంగం హడావిడి చేస్తున్నది. సమగ్ర నివేదికను తయారుచేసే పనిలో పడింది. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో పూర్తిస్థాయి సమీక్షకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో వైస్ చైర్మెన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. సురేందర్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. మండల స్థాయి ఏఈ నుంచి రాష్ట్ర స్థాయిలోని సీఈ అధికారి దాకా ఈ సమీక్షల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి గ్రామాలకు భగీరథ తాగునీటిని అందిస్తామని ముఖ్యమంత్రి పదే పదే ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వాటర్ ట్రీట్‌మెంట్లు ప్లాంట్లు, మెయిన్ పైపు లైన్, ఇంటెక్ వెల్ పనులు వేగంగా నడుస్తున్నాయి. గత నెల రోజులుగా ఇంట్రా విలేజ్ నెట్‌వర్క్ పనులు చేపట్టారు. వీటిని వేగంగా చేయడానికి స్థానిక కాంట్రాక్టర్లకు అప్పగించారు. అక్కడక్కడ ముందుకురాని నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి కాంట్రాక్టర్లను పిలిపించారు. డిసెంబరు నాటికి ఎలాంటి పరిస్థితుల్లోనూ నీళ్లు ఇవ్వాలనే తలంపుతో సర్కారు ఉన్న విషయం విదితమే. ఈ తరుణంలో ఈనెల 24న సీఎం నిర్వహించే సమీక్షకు ప్రాధాన్యత ఏర్పడింది.

329 ప్రయివేటు జూనియర్ కాలేజీలు డొల్ల!

- 72 కార్పొరేట్ కళాశాలలదీ అదే దుస్థితి
- వసతుల్లేకున్నా గుర్తింపునకు దరఖాస్తు
- ఇప్పటి వరకు 1,249 కాలేజీలకే గుర్తింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు వసతులు లేకున్నా యధేచ్ఛగా నడుస్తున్నాయి. నిబంధనలు పాటించకపోయినా ఆ కాలేజీలపై చర్యలు తీసుకోకుండా తెలంగాణ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో 329 ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో ప్రమాణాలు డొల్ల అని తేటతెల్లమైంది. ఇంజినీరింగ్ సహా వృత్తి విద్యాకాలేజీల్లో ప్రమాణాలు లేకపోతే గుర్తింపు ఇవ్వడానికి జేఎన్టీయూ ఇతర విశ్వవిద్యాలయాలు నిరాకరించాయి. ప్రమాణాలు పెంచుకోవడం లేదంటే ఆ కాలేజీలు మూసివేతకే ప్రాధాన్యతనిచ్చాయి. వర్సిటీ అధికారుల తనిఖీలతోపాటు విజిలెన్స్ తనిఖీల ద్వారా ఇంజినీరింగ్ వృత్తివిద్యా కాలేజీల్లో ప్రమాణాలు పాటిస్తున్నాయా?లేదా పర్యవేక్షించాయి. అలాంటిది ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ పట్ల ఇంతవరకూ విజిలెన్స్ తనిఖీలు చేపట్టలేదన్న ఆరోపణ బలంగా వినిపిస్తున్నది. ప్రమాణాల్లేకపోయినా ఆ కాలేజీల్లో తరగతులు జరుగుతూనే ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో 329 ప్రయివేటు కాలేజీల్లో లోపాలున్నట్టు ఇంటర్ బోర్డు గుర్తించడమే ఇందుకు నిదర్శనం. ఇందులో 72కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లోనూ అదే దుస్థితి ఉంది. నిబంధనలు పాటించకపోయినా, వసతుల్లేకపోయినా 2017–18 విద్యాసం వత్సరంలో అనుబంధ గుర్తింపు కోసం ఇంటర్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నాయి. రాష్ట్రంలో 1,578 ప్రయివేటు జూనియర్ కాలేజీలు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇప్పటి వరకు 1,249 కాలేజీలకు ఇంటర్ బోర్డు గుర్తింపు ఇచ్చింది. లోపాల కారణంగా 329 కాలేజీలకు గుర్తింపు ఇవ్వలేదని ప్రకటించింది. 106 జూనియర్ కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపింది.

లీజు డీడ్ లేనివి 51, ఎఫ్‌డీఆర్ లేనివి 34

రాష్ట్రంలో దరఖాస్తు చేసుకున్న వాటిలో 51 కాలేజీలకు రిజిస్టర్డ్ లీజు డీడ్ (ఆర్ఎల్‌డీ) ఇంటర్ బోర్డుకు సమర్పించలేదు. కానీ అనుబంధ గుర్తింపు పొందాలంటే ఆర్ఎల్‌డీ తప్పనిసరి కావాల్సి ఉంటుంది. ఆర్ఎల్‌డీ లేకుండా గుర్తింపు ఇస్తే భవన యజమానితో సమస్య ఉత్పన్నమవుతుంది. విద్యా సంవత్సరం మధ్యలో భవనం ఖాళీ చేయాలని యజమాని ఆదేశిస్తే విద్యార్థులకు ఇబ్బందులు వస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్ఎల్‌డీ ఉంటేనే గుర్తింపు ఇస్తామని ఆ కాలేజీలకు ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. జూనియర్ కాలేజీకి గుర్తింపు కావాలంటే యాజమాన్యం పేరుతో కార్పస్ ఫండ్ (ఎఫ్‌డీఆర్) రూ.4 లక్షలు ఉండాలి. ఎఫ్‌డీఆర్ లేకుండా 34 కాలేజీలు గుర్తింపు కోసం దరఖాస్తు చేశాయి. కాలేజీల ఒరిజినల్ ధ్రువపత్రాలు లేకుండా గుర్తింపు కోసం దరఖాస్తు చేసినవి 51 కాలేజీలున్నాయి. ఆర్ఎల్‌డీ, ఎఫ్‌డీఆర్‌లకు సంబంధించి జిరాక్సు ప్రతులను కొన్ని కాలేజీ యాజమాన్యాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాయి. విజిలెన్స్ కేసులున్న కాలేజీలు 26 ఉన్నాయి. ఆ కాలేజీల్లో అర్హతలకు అనుగుణంగా బోధన సిబ్బంది లేకపోవడం, ల్యాబ్‌లు, వసతులు లేవని విజిలెన్స్ తనిఖీల్లో బయటపడింది. పాత అఫిలియేషన్ ఫీజు బకాయి ఉన్న కాలేజీలు 27 ఉన్నాయి. అవకతవకలకు పాల్పడ్డ 12 కాలేజీలపై ఇంటర్ బోర్డు జరిమానా విధించింది. కార్పస్ ఫండ్ లేకపోవడం, అనధికారికంగా కాలేజీ మార్పు, అనుమతి లేకుండా అదనపు ప్రవేశాలుండడం వంటి కారణాలు ఆ కాలేజీల్లో ఉన్నాయి. ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ సమర్పించనందున అనుబంధ గుర్తింపు పొందని 21 కాలేజీలు నడుస్తున్నట్టు ఇంటర్ బోర్డు గుర్తించింది. సొసైటీ పేరు మార్చిన కాలేజీలు 34 ఉన్నాయి. అవి కొత్త సొసైటీ పేరుతో ఆర్ఎల్‌డీ, ఎఫ్‌డీఆర్ సమర్పించాల్సి ఉంటుంది. కాలేజీలను ఒక ప్రదేశం నుంచి ఇంకో ప్రదేశానికి మార్పు కోసం దరఖాస్తు చేసినవి 53 కాలేజీలున్నాయి. మార్చే ప్రదేశంలో ఉన్న కాలేజీ భవనానికి మున్సిపాల్టీ/గ్రామపంచాయితీ/జీహెచ్ఎంసీ అనుమతి తప్పనిసరి ఉండాలి. గతేడాది రెండు కాలేజీలకు అనుమతి లేకుండా నిర్మించిన ఆ భవనాన్ని కూల్చివేయాలిన విద్యాసంవత్సరం మధ్యలో హైకోర్టు ఆదేశించింది. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. అందుకే ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించిన కాలేజీలకే గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించింది.

గుర్తింపు గడువు 21 వరకు పెంపు : ఇంటర్ బోర్డు

ప్రయివేటు జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు పొందేందుకు గడువును రాష్ట్ర ప్రభుత్వం వచ్చేనెల 21వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆదేశాల మేరకు గుర్తింపు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును వచ్చేనెల 21వ తేదీ వరకు పెంచామని తెలిపారు. తగిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలని కాలేజీలను కోరారు. తగిన ధ్రువపత్రాలు సమర్పించలేక అనుబంధ గుర్తింపు పొందలేని కాలేజీల్లో చేరిన విద్యార్థులను సమీప ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు బదిలీ చేస్తామని తెలిపారు. ఆ కాలేజీలో చదివేందుకు, పరీక్షలు రాసేందుకు అనుమతిస్తామని పేర్కొన్నారు.

సిరియాలో ఐఎస్ భారత్ చీఫ్ షఫీఆర్మర్ హతం

- గోకుల్,లుంబినీ, దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల బాధ్యుడు రియాజ్ భత్కల్‌కు కుడిభుజం
- షఫీ మృతిపై సమాచారం ఉందన్న ఎన్ఐఏ వర్గాలు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

దేశంలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, ఇస్లామిక్ స్టేట్ అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ చీఫ్ అయిన అబుల్‌అల్ హిందీ ఎలియాస్ షఫీఆర్మర్ సిరియాలో అమెరికా భద్రతా దళాలు జరిపిన దాడిలో మరణించాడు. సిరియాలోని రక్కా సిటీలో షఫీఆర్మర్‌తోపాటు ఆస్ట్రేలియాకు చెందిన బాహద్ అనే ఉగ్రవాది కూడా హతమైనట్టు నిఘా వర్గాలు తెలిపాయి. కర్నాటక రాష్ట్రానికి చెందిన షఫీఆర్మర్ మొదట తన సోదరుడు సుల్తాన్‌ఆర్మర్‌తో కలిసి ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాద కార్యకలాపాల పట్ల ఆకర్షితుడయ్యాడు. ఐఎం చీఫ్ రియాజ్ భత్కల్‌కు కుడిభుజంలా మసలిన సుల్తాన్‌ఆర్మర్, ఆ తర్వాత ఇస్లామిక్ స్టేట్ అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలో చేరి భారత్ ఇన్‌ఛార్జిగా మారాడు. రెండేళ్ల క్రితం సుల్తాన్ సిరియాలో హతమయ్యాక అతని స్థానంలో షఫీఆర్మర్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ముఖ్యంగా రియాజ్ భత్కల్‌తో సరిపడక ఐఎస్‌లోకి మారిన షఫీఆర్మర్ ఇండియన్ ముజాహిదీన్ కంటే శక్తివంతమైన ఉగ్రవాద సంస్థగా దేశంలో ఐఎస్‌ను మారుస్తానని శపథం చేశాడు. ఆ దిశగానే ఫేస్‌బుక్‌లో ఆరువందలకు పైగా అకౌంట్లు తెరిచి దాని ద్వారా దేశంలో ముఖ్యంగా దక్షిణాదిలోని హైదరాబాద్, బెంగళూరు, త్రివేంద్రం, చెన్నై ప్రాంతాల నుంచి యువతను రిక్రూట్ చేసుకున్నాడు. ఈ దశలోనే గతేడాది 24 మంది యువకులు ఐఎస్‌లో చేరడానికి సిరియాకు వెళ్తుండగా దేశంలోని వివిధ ప్రాంతాలలో ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. అయితే డజన్లకొద్దీ యువత మదిలో ఐఎస్ భావాలను నాటడంలో షఫీ ఆర్మర్‌సక్సెస్ అయినట్టు నిఘా వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌లో లుంబినీ, గోకుల్‌చాట్, దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లకు భత్కల్ సోదరులు పాల్పడగా, ఆ సమయంలో వారికి సాంకేతికంగా షఫీఆర్మర్ సహకరించినట్టు నిఘా వర్గాలకు సమాచారం ఉన్నది.

డిగ్రీ సీటు రాని విద్యార్థులకు మరో అవకాశం

- 24న షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియలో భాగంగా పేరు నమోదు చేసుకొని సీటు పొందని విద్యార్థులకు మరోసారి వెబ్‌ఆప్షన్లు ఇచ్చే అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 24న అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తామని డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) కన్వీనర్ ఆర్ లింబాద్రి చెప్పారు. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో భాగంగా మూడోవిడత సీట్ల కేటాయింపులో జరిగిన సమస్యలపై మంగళవారం ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ముగిసిన హజ్‌యాత్ర

ఈనెల 18న హైదరాబాద్‌లోని హజ్‌హౌస్ నుంచి ప్రారంభమైన మక్కా యాత్ర మంగళవారంతో ముగిసింది. మంగళవారం చివరి రోజు 449 మంది హాజీలు మక్కాలోని జెద్దాకు బయలుదేరి వెళ్లారు.

గంటలో పొరుగు రాష్ట్రం నుంచి విద్యుత్

దక్షిణాదిరాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పవర్ ఎక్స్ఛేంజ్‌లపై ఆధారపడకుండా దక్షిణాది రాష్ట్రాలే పరస్పర అవగాహనతో విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకొనే విధానానికి శ్రీకారం జరిగింది. కేరళలోని తిరువనంతపురంలో దక్షిణాదిరాష్ట్రాల విద్యుత్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) సమావేశం దీనికి వేదికైంది. కమిటీ చైర్మెన్ దేవులపల్లి ప్రభాకరరరావు అధ్యక్షతన ఈనెల 21, 22 తేదీల్లో ఈ సమావేశాలు జరిగాయి. ఎస్ఆర్‌పీసీ సభ్య కార్యదర్శి ఎస్ఆర్ భట్, కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ సీఎమ్‌డీ డాక్టర్ కె ఎలంగోవన్, కర్నాటక ట్రాన్స్‌కో ఎమ్‌డీ జావేద్ అక్తర్, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో సీఎమ్‌డీ కె విజయానంద్, తమిళనాడు ట్రాన్స్‌కో ఎమ్‌డీ ఎస్ షణ్ముగం, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ గోపాల్‌రావు, తెలంగాణ ట్రాన్స్‌కో డైరెక్టర్లు నర్సింగరావు, జగత్‌రెడ్డి, సచ్చిదానందం తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గతనెలలో హైదరాబాద్‌లో జరిగిన ఎస్ఆర్‌పీసీ సమావేశంలో దేవులపల్లి ప్రభాకరరావు ఈ ప్రతిపాదన పెట్టారు. దీన్ని సమన్వయం చేసేందుకు ఎస్ఆర్ భట్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని నియమించారు. తిరువనంతపురంలో జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనకు దక్షిణాదిరాష్ట్రాల విద్యుత్ సంస్థలన్నీ అంగీకారం తెలిపాయి.

స్థిరాస్థి కొనుగోలుకు ఎలాంటి భయాలు అక్కర్లేదు

అన్ని అంశాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచాం

- ట్రేడ్ లైసెన్స్ పొందడం ఇక సులభం : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ టీకే శ్రీదేవి వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



స్థిరాస్థి కొనుగోలు చేయాలంటే అనేక భయాలు ఉన్నాయని, తాము చేపట్టిన సంస్కరణల వల్ల ఇప్పుడు ఎలాంటి భయం అక్కర్లేదని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ టికె శ్రీదేవి చెప్పారు. రాష్ట్రంలో ఆస్తుల వివరాలను ఆన్‌లైన్లో పొందుపరిచామన్నారు. నిషేధ, వివాదస్పద, కోర్టులలో పెండింగ్‌లో ఉన్న స్థలాలను కూడా కొనుగోలుదారులు, లీజుదారులు ఆన్‌లైన్లో పరిశీలించి కొనుగోలు చేయవచ్చునన్నారు. మంగళవారం కార్యాలయంలో మున్సిపాలిటీల కమిషనర్లతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే కార్యక్రమంపై ఆమె సమీక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో డోర్ నెంబర్‌పై క్లిక్ చేస్తే ఆ ప్రాపర్టీకి సంబంధించిన అన్ని వివరాలు వస్తాయన్నారు. ఆస్థిపన్ను, వాటర్ కనెక్షన్, బిల్డింగ్ అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునన్నారు. ప్రాపర్టీకి జియోట్యాగ్ ఏర్పాటు చేశామని, దీంతో సదరు ప్రాపర్టీకి సంబంధించిన మ్యాపులు, ఫోటోలు కూడా పొందుపరిచినట్టు తెలిపారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్ కోసం ఎక్కువ సమయం పడుతుందని, ఆ ల్యాండ్‌కు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్లో పరిశీలించి వెంటనే ప్రాపర్టీ అసెస్ నెంబర్ వస్తుందని, దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే మ్యూటేషన్ పూర్తి అవుతుందన్నారు. ట్రేడ్ లైసెన్స్ కావాలంటే 14 అనవసర డాక్యుమెంట్లు ఇవ్వాల్సి అవసరం ఉండేదని, ఇక నుంచి ఏదైనా గుర్తింపు కార్డు, దరఖాస్తు ఫామ్ నింపి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే ట్రేడ్ లైసెన్స్ వస్తుందని వివరించారు. సిటిజన్‌చాట్, మీసేవ, స్మార్టు ఫోన్లో కూడా ట్రేడ్‌లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. బిల్డింగ్ అనుమతి కోసం కామన్ ఫామ్ ఏర్పాటు చేశామని, దీంతో బిల్డింగ్‌కు కావాల్సిన అనుమతులన్నీ ఆన్‌లైన్లో పొందవచ్చునని ఆమె వివరించారు.

ఎంబీసీ కులాల హాస్టల్స్‌కు 50 ఎకరాల స్థలం..

- రూ.100 కోట్లు కేటాయించాలి : ఎంబీసీ సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమాజంలో అత్యంత వెనుకబడ్డ కులాల పిల్లల కోసం హైదరాబాద్‌లో 50 ఎకరాల స్థలం, రూ.100 కోట్లను ప్రభుత్వం కేటాయించాలని ఎంబీసీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, పైళ్ల ఆశయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో అన్ని రంగాల్లో ముందున్న రెడ్డి సామాజిక కులస్తుల హాస్టల్ కోసం 10 ఎకరాల స్థలం, రూ.10 కోట్లు కేటాయించినట్టే అత్యంత వెనుకబడ్డ కులాల వారి పిల్లల విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం స్థలం, నిధులను కేటాయించాలన్నారు. కుల వృత్తులో మగ్గుతూ సంచార జీవితం అనుభవస్తిన్నటువంటి వెనుకబడ్డ కులాల్లో నేటికి 50 కులా లు వారు బీసీ హాస్టల్స్‌లో కాని, గురుకుల పాఠశాలల్లో కాని చేరికలు లేవని తెలిపారు. సంచార జీవితం గడుపుతున్న కులాల వారు స్థిర నివా సాలు లేక గ్రామాలు తిరుగుతూ జీవిస్తున్నవారి పిల్లలు చదువులకు దూరం అవుతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంబీసీల అభివృద్ధి కోసం వెయ్యి కోట్లు కేటాయించామని ప్రభుత్వం గొప్పగా ప్రకటిస్తున్నా ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎంబీసీల జాబితాను రూపొందించకపోవడం శోచనీయమన్నారు.

డీఎంఈని సన్మానించిన ప్రభుత్వ డాక్టర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ డాక్టర్ల సంఘం మంగళవారం రాష్ట్ర వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డిని ఘనంగా సత్కరించింది. కోఠిలోని వైద్యభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పల్లం ప్రవీణ్, సెక్రెటరీ జనరల్ డాక్టర్ బొంగు రమేష్, ట్రెజరర్ లాలూ ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ నరహరి, గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జూపల్లి రాజేందర్, జూనియర్ డాక్టర్ అసోసియేషన్ సలహాదారు డాక్టర్ శ్రీనివాస్, కాంట్రాక్టు డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జనార్దన్, నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకురాలు జ్యోతి సత్కరించిన వారిలో ఉన్నారు.

మద్యాన్ని నియంత్రించాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసే మద్యాన్ని నియంత్రించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎన్ ఆశాలత, బీ.హైమావతి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్యానికి బానిసై యువత అర్థాంతరంగా తనువు చాలిస్తున్నదని ఆందోళనవ్యక్తం చేశారు. ప్రజలను తాగుబోతులు చేసి ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని విమర్శించారు. జాతీయ రహదారులపై ఉన్న దుకాణాలను వెంటనే డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను అమలు చేసి, డీ నోటిఫికేషన్ ఆఫ్ స్టేట్ హైవేస్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్యాన్ని నియంత్రించాలని లేకపోతే మహిళలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

సంస్కారహీనులతో చర్చలా : కసిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిజాలను కప్పిపుచ్చుతూ అమర్యాదగా వ్యవహరించే కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి వంటి సంస్కారహీనులతో ప్రాజెక్టులపై చర్చించడానికి తాము సిద్ధంగా లేమని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కే.నారాయణరెడ్డి విమర్శించారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు రావడం ఖాయమని, దీంతో కాంగ్రెస్ కనుమరు గవుతుందనే భయంతోనే ప్రాజెక్టులను అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని మండి పడ్డారు. కల్వకుర్తికి సాగునీరు వస్తుందని తెలిసీ వంశీచంద్‌రెడ్డి కళ్లలో నీళ్లు వస్తున్నాయని ఎద్దేవచేశారు. ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు రావాలంటూ సవాళ్లు విసురుతున్న ఎమ్మెల్యే భాష మార్చుకోవాలని సూచించారు.

ఆర్టీసీలో పే రివిజన్ సంప్రదింపుల కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీలో కార్మికుల వేతన సవరణ ఒప్పందం కోసం ఉద్దేశించిన సంప్రదింపుల కమిటీని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జివి రమణారావు నియమించారు. ఏడుగురు అధికారులతో కూడిన ఈ కమిటీ గుర్తింపు కార్మిక సం ఘం తో 2017 వేతన సవరణ ఒప్పందంపై చర్చలు జరిపి యాజమాన్యానికి నివేదిస్తుంది. టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ఈ కమిటీకి చైర్మెన్ గా వ్యవహరిస్తారు. చీఫ్ పర్సనల్ మేనేజర్ కన్వీనర్‌గా ఈ కమిటీలో ఉంటారు.

భట్టి యాత్రకు సన్నాహాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పాదయాత్ర పేరుతో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సిద్ధమవుతున్నారు. అందుకు ఆయన చురుకుగా సన్నాహాలు చేసుకుంటున్నారు. పాదయాత్ర రూట్‌మ్యాపు, ఎక్కడి నుంచి ప్రారంభించాలి. ఎన్ని రోజులు పాదయాత్ర కొనసాగించాలి. ఎవరెవరికీ బాధ్యతలు అప్పగించాలి అందుకు కావాల్సిన కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీనేతలు, ఆత్మీయులు, కుల, ప్రజాసంఘాలతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా...సరే యాత్రను మాత్రం కొనసాగించాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. నేరెళ్ల ఘటన, టీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు బేడీలు, నకిలీ విత్తనాలు, రైతులకు మద్దతు ధర, పోలీసుల నిర్బంధం, ధర్నా చౌక్ నిషేధం వంటి సమస్యలతోనే ఈ పాదయాత్ర కొనసాగుతుందని ఆయన చెబుతున్నారు. ఇది పార్టీ అభివృద్ధి కోసమే చేస్తున్నట్టుగా సీనియర్ నేతలకు వివరిస్తున్నారు. అధిష్టానం కనుసన్నల్లోనే ఈ పాదయాత్ర చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముందుగా ఆయన ఖమ్మం పట్టణం నుంచి హైదరాబాద్ పాదయాత్ర చేయాలని భావించినా..119 నియోజకవర్గాలు కవరయ్యేలా ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. దీనికి కొంత మంది సీనియర్ నేతలతోపాటు యువ నాయకులు ఆయనకు బాసటగా ఉంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

అఫ్ఘాన్‌కు మరిన్ని సైనిక బలగాలు

'అదంతా వృధా ఖర్చు' అన్న ట్రంప్..'యు-టర్న్' తీసుకున్నారు

- అక్కడ అమెరికా బలగాలు కొనసాగుతాయని వెల్లడి
- ఆసియాలో భారత్‌తో బలమైన మైత్రిని కోరుకుంటున్న ట్రంప్



వాషింగ్టన్ : అఫ్ఘాన్‌లో అమెరికా సైనిక జోక్యం, బలగాల్ని కొనసాగించటం అంతా 'వృధా' అని గత అధ్యక్షుడు బరాక్ ఒబామాపై పెద్ద ఎత్తున విమర్శలు చేసిన డొనాల్డ్ ట్రంప్, తీరా తనదాకా వచ్చేసరికి ఒబామా విధానాన్నే తిరిగి అమలుజేస్తున్నానని ప్రకటించాడు. 16 ఏండ్లుగా నడుస్తున్న ఆఫ్ఘన్ యుద్ధంలో అమెరికా సైనిక బలగాలు ఇంకా అక్కడ ఉండి ఏం సాధిస్తాయి ? సైనిక బలగాల్ని అమెరికాకు క్రమక్రమంగా తరలించండి...అని కొన్నాళ్ల క్రితం అన్న ట్రంప్, అసలు సమయానికి వచ్చేసరికి యు-టర్న్ తీసుకున్నారు. ఆఫ్ఘాన్‌కు మరిన్ని సైనిక బలగాలు పంపడానికి పచ్చజెండా ఊపాడు. అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ప్రజలకు చేసిన వాగ్ధానాన్ని సైతం ట్రంప్ పక్కనపెట్టారు.

సోమవారం వర్జీనియాలోని ఫోర్ట్ మేర్ నుంచి ట్రంప్ జాతినుద్దేశించి మాట్లాడారు. ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాసియాల కోసం తాను కొత్త విధానాన్ని అమలుజేయబోతున్నట్టు ప్రకటించాడు. ఒబామా పాలనాయంత్రాంగం దక్షిణాసియాపై దృష్టిపెట్టకపోవటాన్ని తప్పుబట్టారు. అమెరికా శత్రువుల విషయంలో కీలక నిర్ణయాలు మిలటరీ కమాండర్లు, ఇతర ఉన్నతాధికారులు తీసుకుంటారని, కాలానుగుణంగా ఆ నిర్ణయాలు ఉంటాయని ట్రంప్ చెప్పారు. ఆఫ్ఘన్‌కు అదనంగా పంపుతున్న బలగాల సంఖ్యను ట్రంప్ తెలియజేయలేదు. అలాగే ఆఫ్ఘన్‌లో అమెరికా సైనిక జోక్యం ఇంకెన్నాళ్లు కొనసాగుతుందన్న విషయంపై స్పష్టత ఇవ్వలేదు. సైనిక బలగాల్ని కొనసాగించటంపై అమెరికా లక్ష్యాల్ని కూడా ఆయన ప్రజలకు తెలియపర్చలేదు.

> దక్షిణాసియా సంబంధాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలియజేశాడు. భారత్‌తో కలిసి అడుగు లేయడానికి ఆయన చాలా ఆసక్తి చూపారు. ఒక వ్యూహం ప్రకారమే దక్షిణా సియాలో భారత్‌ను మచ్చిక చేసుకోవాలన్న పంథాను ట్రంప్ ఎంచు కున్నారని రక్షణ, సైబర్ రంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

- ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ విలేకర్లకు తెలియజేసిన విషయాలను బట్టి చూస్తే, ఆఫ్ఘన్‌కు అమెరికా నుంచి మరిన్ని సైనిక బలగాల్ని పంపనున్నారు. ఆఫ్ఘన్ ఆపరేషన్‌లో నాటో సభ్య దేశాలు కూడా తమ తమ సైనిక బలగాల్ని పెంచాల్సిందిగా మైక్‌పెన్స్ కోరుతున్నారు. దీనిపై ఆయా దేశాలతో చర్చలు జరపనున్నట్టు తెలిపారు.
- ఆఫ్ఘన్‌లో ప్రస్తుతం 8,400 అమెరికా సైనిక బలగాలున్నాయి. దీనికి అదనంగా మరో 4 వేల ట్రూప్స్ పంపాలని 'పెంటగాన్' నిర్ణయించింది. ఆఫ్ఘన్ ఆపరేషన్‌లో బ్రిటీష్ సైన్యం 2001 నుంచి పనిచేస్తున్నది. బ్రిటన్ నుంచి 500 సైనిక బలగాలు ఉన్నాయి. నాటో సభ్య దేశాల నుంచి మొత్తం 13 వేల సైనిక బలగాల్ని ఆఫ్ఘన్‌లో మోహరించారు.
- అమెరికా దళాలను ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఉపసంహరిస్తే, అక్కడ మళ్లీ ఉగ్రవాదం పేరుకుపోయే అవకాశం ఉందని ట్రంప్ అన్నారు. ఇరాక్‌లో చేసిన తప్పును ఇక్కడ చేయలేమన్నారు. అభివృద్ధి సాధిస్తున్నంత వరకు ఆఫ్ఘనిస్తాన్‌కు సహకరిస్తూనే ఉంటామన్నారు.

మనసు మారింది..

ఆఫ్ఘన్‌లో అమెరికా సైనిక ఆపరేషన్ అంతా వేస్ట్. ఆఫ్ఘాన్ సైనికులకు మనమెందుకు శిక్షణ ఇవ్వాలి ? మనవాళ్లు చనిపోతున్నారు. వారిని వెనక్కి రప్పించాల్సిన సమయం వచ్చింది. విలువైన సైనికుల ప్రాణాల్ని, ధనాన్ని కోల్పోతున్నాం.

- 2012లో ట్రంప్ పంపిన ట్విట్టర్ సందేశాలు

పాకిస్థాన్‌కు హెచ్చరికలు

వాషింగ్టన్ : ఉగ్రవాదులకు నీడనిస్తున్న పాకిస్తాన్‌ను ఇక ఏమాత్రం సహించబోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. దక్షిణాసియాపై అనుసరించాల్సిన రక్షణ వ్యూహాన్ని తాజాగా ప్రకటించిన ట్రంప్ ఈ సందర్భంగా పై వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ఆవాసంగా మారిందని, దీని పట్ల తాము మౌనంగా ఉండబోమన్నారు. ఆఫ్ఘనిస్తాన్ శాంతి కోసం తాము చేస్తున్న ప్రయత్నాలకు పాకిస్తాన్ అండగా నిలివాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నేరగాళ్లు, ఉగ్రవాదులకు ఊతం ఇవ్వడం వల్ల పాకిస్తాన్ నష్టపోతుందన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయని పక్షంలో అణ్వాయుధ దేశమైన పాకిస్తాన్‌కు రక్షణ సహాయం నిలిపేస్తామని ట్రంప్ హెచ్చరించారు.

ఉగ్రవాదంపై పోరాటం కోసం పాకిస్తాన్‌కు బిలియన్ల డాలర్లను ఇస్తున్నామని, కానీ ఆ దేశం మాత్రం ఉగ్రవాదులకు నీడనిస్తున్నదని అన్నారు. ఇలాంటి ధోరణి మారాలని, అది తప్పకుండా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్‌కు సరైన నాగరికతను అలవాటు చేసుకునే సందర్భం వచ్చిందని, శాంతి స్థాపనకు ఆ దేశం సహకరించాలన్నారు. పాకిస్థాన్‌పై ట్రంప్ చేసిన ఆరోపణలను ఆ దేశ ఆర్మీ ప్రతినిధి మేజర్ జనరల్ అసిఫ్ గఫూర్ కొట్టిపారేశారు. పాకిస్థాన్‌లో ఎటువంటి ఉగ్రసంస్థ క్షేత్రాలు లేవన్నారు. హక్కానీ గ్రూపుతో సహా అన్ని ఉగ్ర సంస్థలను తరిమేశారన్నారు.

అమెరికా బలగాలకు శ్మశానమవుతుంది..

- డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి తాలిబన్ హెచ్చరిక

కాబూల్: అఫ్ఘనిస్తాన్‌కు మరిన్ని దళాలను పంపిస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో తాలిబన్ హెచ్చరికలు చేసింది. "అఫ్ఘనిస్థాన్ నుంచి అమెరికా తన దళాలను వెనక్కి తీసుకోకపోతే...అమెరికాకు ఈ భూభాగం శ్మశానంలా మారుతుంది" అని అఫ్ఘాన్ తాలిబన్ ప్రతినిధి జబియుల్లా ముజాహిద్ ఓ ప్రకటనలో హెచ్చరించాడు. అఫ్ఘాన్‌లో యుద్ధాన్ని కొనసాగించాలనే నిర్ణయాన్ని వదులుకుని, బయటికి పోయే దారిని వెతుక్కోవాలని సలహా ఇచ్చాడు. "మా గడ్డ మీద కనీసం ఒక అమెరికా సైనికుడు ఉన్నంత కాలం, మా మీద యుద్ధాన్ని రుద్దడం కొనసాగించినంత కాలం, మేం సమున్నత మానసిక బలంతో జిహాద్‌ను కొనసాగిస్తాం" అని పేర్కొన్నాడు.

సంవత్సరీకం సమీపిస్తోన్నా..

సమాచారం సున్నా..!

ఏడాదవుతోంది.. ఎక్కడాగింది..?

- కెరమెరి ఎస్సై అనుమానాస్పద మృతి కేసు
- డీఐజీ రవివర్మకు మొరపెట్టుకున్న కుటుంబీకులు
- సహచరులు సహకరించారు..మరి సర్కారు..?
- మనసున్న మారాజులు ఆ ఎస్సైలు..
- శ్రీధర్ అమ్మానాన్నకు 2014 బ్యాచ్‌మేట్ల అండ
- తలా కొంత కూడబెట్టి 7 లక్షలు అప్పగింత



న్యాయం చేయాలని డీఐజీకి కుటుంబీకుల వినతి

డిపార్టుమెంటులో అంతర్గత రుగ్మతలు ఫీల్డు స్థాయి పోలీసు అధికారులకు శాపమవుతున్నాయి. మెరికల్లాంటి కొందరు ఎస్సైలను పోలీస్ శాఖ వరుసగా కోల్పోయింది. కెరమెరి సబ్ ఇన్‌స్పెక్టర్ కాశమేని శ్రీధర్ ఆ జాబితాలో ఒకరు. ఎస్సైగా డ్యూటీ స్వీకరించిన మూడ్రోజులకే సర్వీసు పిస్తోలు బుల్లెట్‌కు ప్రాణార్పణ చేశారు. 27 ఏండ్ల చిరు ప్రాయంలోనే అర్థంతరంగా లోకం వీడారు. ఇటు సమాజానికి అటు కన్నవారికి అండగా ఉండాల్సిన శ్రీధర్ అకాల మరణం సంభవించి ఈ నెల30నాటికి ఏడాది అవుతుంది. ఇప్పటికీ ఆయన అనూహ్య మరణం కేసులోని పురోగతిపై బాధిత కుటుంబానికి ఇసుమంతైనా సమాచారం లేకపోవడం ఉదాశీనతకు నిదర్శనం.

ఇల్లెందుల దుర్గాప్రసాద్

పూర్వ ఆదిలాబాద్ జిల్లా కెరమెరి ఎస్సై కాశమేని శ్రీధర్ ఆకస్మిక మృతి కేసులో మిస్టరీ వీడడంలేదు. శ్రీధర్ తొలి సంవత్సరీకం సమీపిస్తోంది. ఇంత కాలం గడిచినా దర్యాప్తులో ప్రగతి, చర్యల సమాచారం బాధితులకు రవ్వంతైనా చేరడంలేదు. ఆయన వినియోగించినట్టుగా భావిస్తోన్న 3 మూడు సెల్‌ఫోన్ నెంబర్ల కాల్‌డేటా విశ్లేషిస్తున్నట్టు అధికారులు అప్పట్లో తెలిపారు. ల్యాప్‌టాప్, చేతి రాతలను పరీక్షించేందుకు ఆయా వస్తు సామగ్రిని హైదరాబాద్, కరీంనగర్‌లకు పంపించామన్నారు. నెలలో నివేదికలు వస్తాయని చెప్పారు. కానీ, ఈ ఆగస్టు 30తో ఏడాది కావస్తున్నది. మరి..ఆ రిపోర్టుల పురోగతి ఎక్కడాగిందో ఏమో! శ్రీధర్‌ది హత్యా, ఆత్మహత్యా..? మూలాలు, కారణాలు, కారకులు ఎవరూ ఏమిటి..? వంటి అధికారిక జవాబుల కోసం ఆ కుటుంబం సంవత్సర కాలంగా వేచి చూస్తూనే ఉన్నది. ప్రభుత్వ నిరాదరణ పట్ల ఎంతో బాధ పడుతోంది. తన తమ్ముడి మృతికి గల కారణాల వివరాలు, తమ ఫిర్యాదుపై చర్యలేమిటో ఇంత వరకూ తెలుపలేదని 'నవతెలంగాణ' ప్రత్యేక ప్రతినిధికి శ్రీకాంత్ ఫోన్‌లో చెప్పారు. సర్వీసు బెనిఫిట్స్‌సహా ఇతరత్రా ఎట్లాంటి సహాయం అందించలేదన్నారు. తమకు న్యాయం చేయాలనీ, నాటి హామీ ప్రకారం తనకు ఉద్యోగం ఇప్పించాలని అతడు విన్నవిస్తున్నాడు. ఇదే విషయమై డీఐజీ రవివర్మకు కుటుంబ సభ్యులు ఇటీవల మొరపెట్టుకున్నారు.

అనుమానాలపై ఆనాడే ఫిర్యాదు

శ్రీధర్‌కు కానిస్టేబుల్‌గా డిపార్టుమెంటుతో అనుబంధం మొదలైంది. స్వీయ ప్రతిభతో ఎస్సై అయ్యారు. ఎస్‌హెచ్‌వో(స్టేషన్ హౌస్ ఆఫీసరు)గా కెరమెరి పీఎస్‌లో నిరుడు ఆగస్టు 27న డ్యూటీలో చేరారు. సర్వీసు రివాల్వర్ తూటాకు అక్కడే 30వ తేదీన బలయ్యారు. అనూహ్య మరణంపై రక్త సంబంధీకులకు అనుమానాలున్నాయి. ఆఫీసర్లకు ఫిర్యాదిచ్చారు. మృతికి కారకులైన వారిని శిక్షించాలని వేడుకున్నారు.

అభిమానమున్నా..అగుపించని ఆదరణ

బీసీ(ఏ)లైన ధర్మయ్య, స్వతంత్ర దంపతుల సంతానం శ్రీకాంత్, శ్రీధర్, ప్రవీణ్. వీరిది రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామం. కొంచెం సేద్యంతోపాటు రెక్కల కష్టమే జీవనాధారం. ఆ ముగ్గురు అన్నదమ్ముల్లోనూ సామాజిక స్పృహ పుష్కలం. అందుకే బ్యాంక్ క్లర్క్ వంటి జాబును కాదని శ్రీధర్ పోలీసు శాఖలో చేరారు. తమ్ముడు ప్రవీణ్ ప్రస్తుతం కానిస్టేబుల్‌గా శిక్షణలో ఉన్నాడు. దీన్నిబట్టి ఆ కుటుంబానికి డిపార్టుమెంటు అంటే ఎంతటి గౌరవమో ఊహించొచ్చు. పేదరికంతో అనునిత్యం పోరాడి గెలిచిన అనుభూతిని ఆస్వాదిస్తున్న తరుణంలోనే శ్రీధర్ మరణం తీరని లోటైంది. ఆ బీద కుటుంబానికి డిపార్టుమెంటు పట్ల అభిమానమున్నా..ఆ స్థాయిలో మాత్రం ఆదరణ సర్కారు నుంచి అగుపించకపోవడం శోచనీయం.

అండగా నిలిచిన ఉమ్మడి రాష్ట్రంలోని ఆఖరు బ్యాచ్

అది ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సైల ఆఖరు బ్యాచ్. సుమారు 700 మంది నాటి అప్పాలో శిక్షణ పొందారు. ఆ టైమ్‌లో పరస్పరం స్నేహితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన 3 దినాలకే తమ సహచరుడు శాశ్వతంగా దూరమవడం వారిని కలిచివేసింది. 2014 బ్యాచ్ సివిల్ ఎస్సైలు తలా కొంత సొమ్ము సొంతంగా కూడబెట్టారు. తెలంగాణ, ఏపీలోని ఆ మనసున్న మారాజులు రూ.7 లక్షలు పోగు చేశారు. ఆ డబ్బును మృతుడి అమ్మానాన్నకు సమకూర్చారు. కానీ, ఏడాదవుతోన్నా..ప్రభుత్వం మాత్రం కరుణించడంలేదు. ఇదీ విషాదం!

ఫలించిన ప్రవీణ్ ప్రయత్నం

ముస్తాబాద్ ప్రస్తుత ఎస్సై ఎల్.ప్రవీణ్ కూడా 2014 బ్యాచే. శ్రీధర్ ఆకస్మికంగా చనిపోవడం బాధించింది. అతడి తల్లిదండ్రులను తమ వంతుగా ఆదుకోవాలని తలిచారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల్లో పని చేస్తోన్న బ్యాచ్‌మేట్లతో తన సంకల్పాన్ని పంచుకున్నారు. ప్రవీణ్ ప్రయత్నం ఫలించింది. దాదాపుగా వాళ్లందరూ సానుకూలంగా స్పందించారు. అట్లా..తలా కొంత పంపిం చిన సొమ్మును బ్యాంకులో భద్రంగా జమ చేశారు. మొత్తం గా రూ. 7 లక్షలు సమకూరాయి. డీఐజీ రవివర్మ, ఎస్పీ విశ్వజిత్ కంపాటి ద్వారా శ్రీధర్ అమ్మానాన్నకు ప్రవీణ్ ఆ విరాళాల్ని ఆగస్టు 11న అప్పగించారు. ఇక చేయూత, న్యాయం, వేధింపుల అధికారులపై చర్యల పరంగా ప్రభుత్వమే శ్రీధర్ కుటుంబానికి బకాయి పడి ఉన్నది!

నవచిత్రం

హార్ట్ హిట్టింగ్ లవ్ స్టోరీ అర్జున్‌రెడ్డి


- ప్రీ రిలీజ్ వేడుకలో శర్వానంద్



శర్వానంద్, ప్రణయ్‌రెడ్డి వంగా, సందీప్‌రెడ్డి వంగా, విజయ్ దేవర కొండ, షాలిని

విజయ్ దేవరకొండ, షాలిని హీరోహీరోయిన్లుగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన చిత్రం 'అర్జున్‌రెడ్డి'. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నందిని రెడ్డి మాట్లాడుతూ, 'సినిమా రిలీజ్‌కు ముందే కల్ట్ చిత్రమయ్యింది. సినిమా తప్పకుండా పెద్ద హిట్ అవుతుందని భావిస్తున్నా' అని అన్నారు. 'ఈ టీమ్‌ని చూస్తుంటే సినిమా కోసం రక్తం పెట్టి పనిచేసినట్టుంది. విజయ్ దేవరకొండను చూస్తుంటే ఈర్ష్యగా ఉంది. నేను ఈ మధ్య కాలంలో విన్న హార్ట్ హిట్టింగ్ లవ్‌స్టోరీ ఇది. నిజమైన ప్రేమేంటో అర్జున్‌రెడ్డి చెబుతుంది. నాతో సందీప్ వంగా నెక్ట్స్ సినిమా చేయాలని కోరుకుంటున్నా. 25న విడుదలయ్యే ఈ చిత్రం క్రేజీగా ఉంటుంది' అని హీరో శర్వానంద్ తెలిపారు.

సినిమా వాళ్ళని పిచ్చోళ్లుగా చూస్తున్నారు..




తమ్మారెడ్డి భరదాజ్వ

'అర్జున్ రెడ్డి' చిత్రం తీసేందుకు దర్శకుడు, నిర్మాత, హీరో చాలా కష్టపడ్డారు. తెలుగు చిత్ర పరిశ్రమలో మంచి సినిమాలు రూపొందుతున్నాయి. కానీ అన్ని సినిమాలు 'అర్జున్‌రెడ్డి' కావు. వాటిలో కొన్ని మరుగున పడిపోతున్నాయి. అందుకు కారణం థియేటర్ల కొరత. నిజానికి థియేటర్ల కొరతేమీ లేదు. కబ్జాలో ఉన్నాయంతే. వస్తు సేవల పన్ను వచ్చాక 20శాతం అదనపు పన్ను సినిమాపై పడుతుంది. రూ.20 టికెట్టుపై రూ.3 లేదంటే రూ.4 మాత్రమే నిర్మాతకి వస్తాయి. ఈ మధ్య నాయకులు, సోషల్ మీడియా సినిమా వాళ్ళని పిచ్చోళ్లలాగా చూస్తున్నారు. ఈ సినిమా మూడు గంటలు తీయడాన్ని కొందరు విమర్శిస్తున్నారు. మూడు గంటల సినిమా తీస్తాడు, లేదంటే 30 గంటల సినిమా తీస్తాడు. వాడికెందుకు?. వాడయ్య జాగీరా?. వాడి పైసలా..? ఇంకొక డొస్తాడు.. ముద్దు పెట్టడు.. 3గంటల సినిమా తీయడు. నువ్వు రిలీజ్ చేస్తావా?. నీ ఇష్టం వచ్చింది నువ్వు చేస్తావా? నువ్వు నాకు హెల్ప్ చేస్తావా? ఎవడేం చేయడు.. మాటలు మాత్రం మాట్లాడతారు. ఊరికే దొరికారు కదా అని ఎవరు పడితే వాళ్ళు రాళ్ళు విసురుతున్నారు. ఒక నాయకుడు విమర్శిస్తున్నట్టు అందులో ముద్దులుంటే ఏంటి? ఇష్టం లేకపోతే చూడ్డం మానేయాలంతే. ఇలాంటి సమస్యల్ని ఎదుర్కోవడానికి సినిమా వాళ్లంతా ఏకం కావాల్సిన అవసరం ఉంది' అని అతిథిగా పాల్గొన్న తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు.

హీరో విజయ్ దేవరకొండ చెబుతూ, 'థియేట్రికల్ ట్రైలర్ విడుదల రోజు సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని, అందుకు నేను బెట్ కట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పాను. ఆ వ్యాఖ్యలు కొంతమందిని బాధించాయి. అయితే నేను చెప్పేదొకటే.. ఒక యాక్టర్‌కి సినిమాపై నమ్మకం లేకుంటే అది వేస్ట్. నాకే నమ్మకం లేనప్పుడు ఇంకెవరికి ఉంటుంది. నా సినిమాపై నమ్మకం లేని రోజు కూడా తప్పకుండా వస్తుంది. అయితే అది ఈ రోజు కాదని నేను నమ్మకంగా చెప్పగలను. చాలా మంది జాగ్రత్తగా ఉండమని అంటున్నారు. తల దించుకుని ఉండాల్సిన అవసరం లేదు. మీరెంతో సాధిస్తున్నారు. మేం సాధిస్తున్నామని గర్వంగా చెప్పండి. సెన్సార్ వాళ్ళు మా సినిమాకు 'ఏ' సర్టిఫికేట్ ఇచ్చారు. కథ వినగానే ఇది చిన్న పిల్లల సినిమా కాదని అనుకున్నాను. ఓ సీన్‌లో ఓ పదం వాడాల్సి వస్తుంది. 'ఏం మాట్లాడుతున్నావ్ రా..' అనే పదాన్ని కూడా మ్యూట్ చేశారు. నన్ను మ్యూట్ చేశారు కానీ, ప్రేక్షకులను మ్యూట్ చేయలేరు. కాబట్టి ప్రేక్షకులే థియేటర్‌లో నాకు డబ్బింగ్ చెప్పాలి' అని అన్నారు. 'ఇది హెవీ ఎమోషనల్ కల్ట్ రొమాంటిక్ చిత్రం. మార్కెట్‌లో కొన్ని డ్రగ్స్ దొరుకుతాయి. వాటిని వాడితే రేడియో న్యూస్‌లాగా విషయాలు మన బ్రెయిన్‌లో గుర్తుండిపోతాయి. అలాంటి సినిమాయే 'అర్జున్‌రెడ్డి'. నేను ఏదైనా డిటెయిల్డ్‌గా చెబుతాను. అలాంటి నా పిచ్చిని తట్టుకుని సపోర్ట్ చేసిన తోటా రాజు, కలరిస్ట్ విష్ణు సహా అందరికీ థ్యాంక్స్. ప్రేక్షకులు సినిమాను ఎలాగైతే ఊహించుకున్నారో దాన్ని ఈ సినిమాతో రీచ్ అవుతాం. కచ్చితంగా సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఫ్యామిలీతో కలిసి చూసే సినిమా ఇది' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెలిపారు. నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా చెబుతూ, 'విజయ్, షాలిని అద్భుతంగా నటించారు. వీరిద్దరు లేకుండా సినిమా ఇంత బాగా వచ్చి ఉండేది కాదు. ఈ నెల 25న విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రాంతి మాధవ్, స్వప్నదత్, తరుణ్ భాస్కర్, శివ నిర్వాణ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

విక్రమ్ వేద రీమేక్‌లో!



నాగార్జున, మాధవన్

ఫ్రెంచ్ చిత్రం స్ఫూర్తితో రూపొందిన 'ఊపిరి' వంటి విభిన్న కథా చిత్రంలో నటించి మెప్పించిన నాగార్జున తాజాగా ఓ తమిళ రీమేక్‌లో నటించనున్నట్టు సమాచారం. విజయ్ సేతుపతి, మాధవన్ ప్రధాన పాత్రధారులుగా తమిళంలో వచ్చిన చిత్రం 'విక్రమ్ వేద'. పుష్కర్, గాయత్రి దర్శకద్వయం తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై భారీ విజయాన్ని సాధించడంతోపాటు రూ.10 కోట్లతో తెరకెక్కి 80కోట్లకుపైగా వసూలు చేసింది. యాక్షన్, క్రైమ్ మిస్టరీ, గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో పోలీస్ అధికారి పాత్రలో మాధవన్, గ్యాంగ్‌స్టర్‌గా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో విజయ్ సేతుపతి నటించి ఆకట్టుకున్నారు. ఈ చిత్ర నిర్మాత శశికాంత్ ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేయాలని భావించారు. మాధవన్ పాత్రలో వెంకటేష్‌ను, విజయ్ సేతుపతి పాత్రలో రానా కాంబినేషన్‌లో చేయాలనుకున్నారు. కానీ తాజాగా అది కాస్త మాధవన్, నాగార్జున కాంబినేషన్‌కి మారిందట. తమిళంలో నటించిన పోలీస్ పాత్రను మాధవన్‌తోనే చేయించి, గ్యాంగ్‌స్టర్ పాత్రకు నాగార్జునను తీసుకోవాలని ఆయన భావిస్తున్నారట. ఈ విషయమై ఆయన నాగార్జునతో చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది.

రజనీకాంత్ కోసం..



ఎ.ఆర్.మురుగదాస్

'రజనీకాంత్ కోసం ఓ కథ సిద్ధంగా ఉంది. ఆయనతో ఎప్పటికైనా ఓ సినిమా చేస్తాను' అని చెబుతున్నారు దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్. మహేష్‌బాబు, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా ఆయన 'స్పైడర్' చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం విదితమే. ఈ చిత్రం వచ్చే నెల 27న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మురుగదాస్ మీడియాతో మాట్లాడుతూ, 'నేను రజనీకాంత్‌కు హార్డ్ కోర్ ఫ్యాన్‌ని. చాలా రోజుల క్రితం ఆయనకు ఓ స్క్రిప్ట్ నెరేట్ చేశాను. అది ఆయనకు బాగా నచ్చింది. కానీ అది కుదరలేదు. రజనీకాంత్ కోసం స్క్రిప్ట్ తయారు చేయడం నాకు పెద్ద డిఫికల్ట్ కాదు. ఇప్పటికే ఓ కథ రెడీ చేశాను. ఎప్పటికైనా రజనీకాంత్‌తో సినిమా చేస్తాను. 'స్పైడర్'లో మహేష్‌బాబు చేసినట్టు ఇండియాలో మరే నటుడు చేయలేడు. ఈ చిత్రంతో తమిళంలో పెద్ద స్టార్ అవడం ఖాయం' అని చెప్పారు.

సై..సైరా నరసింహారెడ్డి

నా ఆశలకు, మీ ఆకాంక్షలకు ప్రతి రూపమైన పాత్ర దొరికింది : చిరంజీవి



వరుణ్ తేజ్, పరుచూరి బ్రదర్స్, సాయిధరమ్ తేజ్, అల్లు అరవింద్, సురేందర్‌రెడ్డి, రాజమౌళి, రామ్‌చరణ్

'ఖైదీ నంబర్ 150' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత చిరంజీవి నటిస్తున్న 151వ చిత్రం ఇటీవల ప్రారంభమైన విషయం విదితమే. ఈ చిత్రానికి తాజాగా 'సైరా నరసింహారెడ్డి' అనే టైటిల్ ఖరారు చేశారు. చిరంజీవి 62వ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఓ భారీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో చిత్ర మోషన్ పోస్టర్, టైటిల్ లోగోను ఆవిష్కరించారు. అతిథిగా విచ్చేసిన దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి మోషన్ పోస్టర్‌ను విడుదల చేయగా, అల్లు అరవింద్ టైటిల్ లోగోను రిలీజ్ చేశారు. ఇందులో చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, కీలక పాత్రల్లో అమితాబ్ బచ్చన్, జగపతిబాబు, సుదీప్, విజయ్ సేతుపతి నటిస్తున్నారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం సమకూరుస్తున్నారు. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రామ్ చరణ్ నిర్మిస్తున్నారు.

ఈ నేపథ్యంలో రాజమౌళి మాట్లాడుతూ, "సైరా నరసింహారెడ్డి' టైటిల్ అద్భుతంగా ఉంది. 'బాహుబలి' చిత్రం అంత పెద్ద విజయం సాధించిందంటే దానికి కారణం మంచి టెక్నీషియన్లు. ఈ చిత్రానికి కూడా అన్ని విభాగాల్లో పెద్ద టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. వారంతా దర్శకుడు సురేందర్‌రెడ్డికి వెన్నుదన్నుగా ఉంటారు. ఫెంటాస్టిక్ కాస్టింగ్ ఉంది. ఇది చిరంజీవి 151వ సినిమా కాదు, ఆయన ఒకటవ సినిమాలా అనిపిస్తుంది. గొప్ప చరిత్రకారుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రంలో చిరంజీవి నటించడం, ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను నేను లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. 'చిరంజీవితో 37ఏండ్లుగా అనుబంధం ఉంది. ఆయన ఎంతో కష్టపడి ఇండస్ట్రీలో ఓ తారు రోడ్డు వేశారు. దానిపై పవన్ కళ్యాణ్, రామ్‌చరణ్, బన్నీ ఇలా మెగా హీరోలందరూ నడుస్తూ ముందుకు సాగుతున్నారు. సురేందర్‌రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం కాదు, చరిత్రే ఆయన్ని దర్శకుడిగా ఎంపిక చేసుకుంది. చరిత్రలో నిలిచిపోయే సినిమాని ఆయన తీయబోతున్నాడు' అని అల్లు అరవింద్ తెలిపారు.

రామ్‌చరణ్ మాట్లాడుతూ, 'నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ సినిమా 'మగధీర'ను తీసిన రాజమౌళినే ఇండియాలోనే బిగ్గెస్ట్ చిత్రం 'బాహుబలి'నీ తీశారు. ఆయన చేతుల మీదుగా 'సైరా నరసింహారెడ్డి' మోషన్ పోస్టర్ లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. గత నెల రోజులుగా ఈ సినిమాను ఎలా తీయాలని చాలా మథన పడుతున్నాను. ఒకలాంటి టెన్షన్ ఫీలయ్యాను. ఇదొక ఇంపాజిబుల్ టాస్క్. అయినా పాజిబుల్ చేయడానికి రంగంలోకి దిగాం. అడగ్గానే అమితాబ్, రెహమాన్ వంటి తదితర మహామహులందరూ సినిమా చేయడానికి ఒప్పుకున్నారు. సినిమాకు అన్నీ కలిసొచ్చాయి. చిరంజీవిగారి పుట్టినరోజు సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా 42 వేల మంది రక్తదానం చేశారు. అభిమానులు చేసే సేవే నాన్నగారికిచ్చే గొప్ప బర్త్‌డే గిఫ్ట్‌గా భావిస్తున్నాను' అని చెప్పారు.

'కథ వినగానే నాకు జెలసీగా అనిపించింది. చరిత్రనే సురేందర్‌రెడ్డిని దర్శకుడిగా ఈ సినిమాకు ఎన్నుకుంది. కొందరు మరికొందరి జీవితాల్లో జీవించేస్తారు. అలా చిరంజీవి అభిమానులు చిరంజీవిలానే ఉంటారు, ఆయనలాగే ప్రవర్తిస్తారు. జీవిస్తారు' అని సుకుమార్ తెలిపారు.

చిత్ర దర్శకుడు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, "సైరా నరసింహారెడ్డి' అనే టైటిల్ వింటేనే నాలో వణుకు పుడుతుంది. చిరంజీవిగారు, అమితాబ్‌గారు సహా మంచి ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ టీం కుదిరింది. మెగాభిమానుల అండతో ముందుకెళ్తాను' అని అన్నారు.

పరుచూరి బ్రదర్స్ మాట్లాడుతూ, 'మన దేశంలో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం ఏది అంటే 1857 ఝాన్సీ తిరుగుబాటుగా చెబుతారు. కానీ ఈ చిత్రం చూశాక మొదటి స్వాతంత్ర్య సంగ్రామం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేశాడని తెలుస్తుంది. 200ఏండ్లుగా ఒక తెలుగు వీరుడి చరిత్రను మరుగున పడేశారు. ఆ సీమ స్వాతంత్ర్య సమరయోధుడి చరిత్రను ఈ చిత్రం ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ చిత్ర కథకు 13ఏండ్ల క్రితం నుంచి శ్రీకారం చుట్టాం. ఇప్పటికి కుదిరింది. ఇదొక ఎపిక్ అవుతుంది. ఈ చిత్రం ద్వారా దర్శకుడు సురేందర్‌రెడ్డి ఏంటో అందరికీ తెలుస్తుంది' అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సాయిధరమ్ తేజ్, వరుణ్ తేజ్, డా.వెంకటేశ్వరరావు, జెమిని కిరణ్ తదితరులు పాల్గొన్నారు. నాజర్, రవికిషన్, ముఖేష్ రుషి, రఘుబాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, వి.జయప్రకాష్, రఘు కారుమంచి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: ఎ.ఆర్.రెహమాన్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: రవివర్మన్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్.



సైరా నరసింహారెడ్డి ఫస్ట్‌లుక్

స్పెషల్ వీడియో ద్వారా చిరంజీవి మాట్లాడుతూ, 'మిగతా పుట్టిన రోజుల కంటే ఈ రోజు చాలా ప్రత్యేకం. దానికి కారణం నా వృత్తి సినిమా. నా ప్రవృత్తి సినిమా. నన్ను అభిమానించే వారి కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. అభిమానులు గర్వపడేలా సినిమాలు చేయగలను. అందుకే 151వ సినిమాగా స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కథను ఎంచుకున్నా. ఫ్రీడమ్ ఫైటర్ పాత్ర చేయాలని ఎప్పట్నుంచో ఉంది. అందులో భగత్ సింగ్ పాత్రలో నటించాలని చాలా సార్లు అనుకున్నా. ఇన్నాళ్లకు ఉయ్యాలవాడ రూపంలో నా ఆశలకు, మీ ఆకాంక్షలకు ప్రతి రూపంగా నిలిచే పాత్ర దొరికింది. మన స్వాతంత్ర్య పోరాటానికి ఆధ్యులు, పోరాడే యోధులందరికీ ఆరాధ్యులు, మన తెలుగు బిడ్డ అయిన ఉయ్యాలవాడ పాత్ర దొరకడం గొప్ప అవకాశంగా భావిస్తున్నా. అత్యాధునిక సాంకేతిక బృందంతో, విలువలతో సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ చిత్రం అద్భుతమైన దృశ్యకావ్యం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మెగా అభిమానులంతా గర్వపడేలా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువాళ్లు గర్వించేలా ఓ చరిత్ర సృష్టించిన దర్శకుడు రాజమౌళి ఆశీస్సులు అందుకోవడం నిర్మాత చరణ్‌కు, ఈ సినిమాకు మంచి శుభ సూచికం' అని చెప్పారు.

కరీష్మాలా మెప్పిస్తానో లేదో?

"జుడ్వా'లో కరిష్మా కపూర్ నటించిన పాత్రను 'జుడ్వా 2'లో పోషించడం చాలా ఒత్తిడిగా ఫీలవుతున్నాను' అని అంటోంది జాక్వెలిన్ ఫెర్నాండేజ్. 1997లో సల్మాన్ ఖాన్, కరీష్మా కపూర్, రంభ హీరో, హీరోయిన్లుగా రూపొందిన 'జుడ్వా' చిత్రానికి సీక్వెల్‌గా ప్రస్తుతం 'జుడ్వా 2' చిత్రాన్ని దర్శకులు రోహిత్ ధావన్, డేవిడ్ ధావన్ తెరకెక్కిస్తున్నారు. ఆ చిత్రంలో సల్మాన్ నటించిన పాత్రలో ఇప్పుడు వరుణ్ ధావన్ ద్విపాత్రాభినయం చేస్తుండగా, కరీష్మా పాత్రలో జాక్వెలిన్, రంభ పాత్రలో తాప్సీ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్ సోమవారం విడుదలై అందరి ప్రశంసలను సొంతం చేసుకుంటోంది. ఈ సందర్భంగా జాక్వెలిన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నేనూ భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ధావన్ ద్వయంతో పనిచేయడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. ఎందుకంటే వాళ్ళు వండర్‌ఫుల్ పీపుల్. 'జుడ్వా'లో కరీష్మా నటించిన పాత్రను నేనీ చిత్రంలో పోషిస్తున్నాను. ఆమె అద్భుతమైన నటి. ఆమెలా నేను చేస్తానా లేదా అనే ఒత్తిడిలో ఉన్నాను. అయినప్పటికీ బాగా చేసేందుకు ప్రయత్నిస్తున్నా. నా నటన అందరి అప్రిషియేషన్ అందుకుంటుందని ఆశిస్తున్నా' అని తెలిపింది. జాక్వెలిన్ దీంతోపాటు 'ఏ జెంటిల్‌మ్యాన్', 'డ్రైవ్', రెమో డి సౌజా చిత్రంలోనూ నటిస్తోంది.



జాక్వెలిన్ ఫెర్నాండేజ్

నరేష్ మార్క్ కామెడీతో..

'రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న 'మేడ మీద అబ్బాయి' చిత్రంలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకునే చిత్రమవుతుంది' అని అంటున్నారు నిర్మాత చంద్రశేఖర్. అల్లరి నరేష్, నిఖిల విమల్ జంటగా జి.ప్రజిత్ దర్శకత్వంలో జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్న చిత్రం 'మేడ మీద అబ్బాయి'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, 'కొత్తదనంతో కూడిన కథతో చేస్తున్న విభిన్న కథా చిత్రమిది. 'గమ్యం', 'శంభో శివ శంభో' తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో నరేష్ ఈ చిత్రం చేస్తున్నారు. ఈ చిత్రం నరేష్ కెరీర్‌లో మరో మైలురాయిలా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది. సహజమైన అంశాలతో థ్రిల్లింగ్‌గా ఉంటూనే అల్లరి నరేష్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ పుష్కలంగా ఉంటుంది. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెన్సార్ సభ్యుల అభినందనలను అందుకుంది. క్లీన్ యు సర్టిఫికెట్ పొందింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. కచ్చితంగా ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది' అని అన్నారు. అవసరాల శ్రీనివాస్, జయప్రకాష్, తులసి, సుధ, సత్యంరాజేష్, మధునందన్, జబర్దస్త్ ఆది, పద్మ జయంతి, రవిప్రకాష్, వెన్నెల రామారావు తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఉన్ని ఎస్.కుమార్, సంగీతం: షాన్ రెహమాన్, ఆర్ట్: రాజీవ్ నాయర్, ఎడిటర్: నందమూరి హరి.



'మేడ మీద అబ్బాయి'లో అల్లరి నరేష్, నిఖిల విమల్

అదృష్టంగా భావిస్తున్నా..



చంద్రకాంత్ దత్తా

చంద్రకాంత్ దత్తా, రాధికా మెహరోత్రా జంటగా థర్డ్ ఐ క్రియేషన్స్ పతాకంపై రఘురాం రొయ్యూరుతో కలిసి గోవర్ధన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి మంగళవారం హీరో చంద్రకాంత్ మాట్లాడుతూ, 'నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. ఇంజనీరింగ్ పూర్తి చేసి, కెరీర్‌గా యాక్టింగ్ ఎంచుకున్నాను. అమెరికాలో ట్రైనింగ్ తీసుకున్నా. థియేటర్ ఆర్ట్స్‌లో పనిచేశాను. ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇదొక బ్యూటిఫుల్ రొమాంటిక్ థ్రిల్లర్. ఒక మంచి టీమ్ ఎఫర్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. అధిక భాగం సినిమా షూటింగ్ అమెరికాలో జరిగింది. ఇటీవల విడుదలైన మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. దర్శకుడు గోవర్ధన్ సినిమాకు ప్రాణం పెట్టి జీవం పోశారు. ఈ చిత్రం నాకు మంచి బ్రేక్‌నిస్తుందని భావిస్తున్నాను. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రాధికా, పల్లవి చాలా బాగా నటించారు. వాళ్ళకి కూడా మంచి పేరు వస్తుంది. నా తొలి చిత్రంతోనే తనికెళ్ళ భరణి, తులసి, జెమినీ సురేష్ వంటి సీనియర్ ఆర్టిస్టులతో కలిసి నటించడం సంతోషంగా ఉంది' అని చెప్పారు.

సాయం చేయకపోగా..



నేహా ధూపియా

సెల్ఫీలు తీసుకోవడమనేది ప్రస్తుతం సర్వత్రా ఓ పిచ్చిగా తయారైపోయింది. ఓ పక్క ప్రాణాలు పోతున్నా సరే సెల్ఫీలపై మమకారం మాత్రం తగ్గడం లేదు. సోషల్ మీడియాలో లైకుల కోసం లైఫుల్నే పణంగా పెడుతున్నారు. ఫ్రెండ్స్‌తోనే సరిపెట్టుకోకుండా అపరిచితులు సైతం తమ ఫొటోలకు మంచి మంచి కామెంట్స్ పెట్టాలనే పిచ్చి కోరికతో మానవత్వానికి తిలోదకాలిచ్చి మరీ సెల్ఫీలు తీసుకుంటున్నారు.. దిగుతున్నారు. ఇలాంటి వైనాల్ని రోజూ మనం చూస్తూనే ఉన్నాం. సరిగ్గా ఈ తరహా సంఘటనతో బాలీవుడ్ నటి నేహా ధూపియా విస్తుపోయింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో నేహా స్వల్పంగా గాయపడ్డారు. చండీగడ్ నుంచి ముంబయి వస్తుండగా ఆమె ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవ్వడంతో ఆమె భుజానికి గాయమైంది. అలాగే కాళ్లపై, చేతులపై కూడా గాయాలయ్యి రక్తం కారుతోంది. ఈ ప్రమాదం కారణంగా కిలోమీటర్ మేర గంటపాటు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. గాయాల కారణంగా రోడ్‌కి ఓ వైపు కూర్చుని సహాయం కోసం నేహా ఎదురు చూస్తుంటే, అభిమానులు మాత్రం ఆమెతో సెల్ఫీలు దిగటం కోసం ఎగబడ్డారు. ఆమె అనుమతి లేకుండానే ఫొటోలు తీసుకున్నారు. సహాయం చేయకపోగా మరికొంత మందైతే ఏకంగా ఆటోగ్రాఫ్‌లు అడగటాన్ని చూసి నేహా నిర్ఘాంతపోయింది. బాధపడుతుంటే సాయం చేయాల్సిందిపోయి సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లు అడగడం పట్ల నేహా ఆవేదన వ్యక్తం చేసింది.


వృత్తివిద్యలో ఉపాధి చూపే కొత్త కోర్సులు

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మార్పులు

- నిపుణులతో కమిటీ ఏర్పాటు
- వచ్చే ఏడాదిలో మరిన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు
- ఇంటర్ బోర్డును దేశంలో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం : ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వృత్తివిద్యలో ఉపాధి చూపే కొత్త కోర్సులు ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో మార్పులు చేస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఇంటర్ బోర్డు 2వ సమావేశం జరిగింది. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల బోర్డు సమావేశం సక్రమంగా జరగడం లేదన్నారు. ఇకనుంచి ఆరు నెలలకోసారి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఇంటర్ బోర్డులో అన్ని వర్సిటీల వీసీలున్నారని అన్నారు. కానీ అందరు వీసీల అవసరం ఉన్నట్టు కనిపించడం లేదన్నారు. పరిశీలించి ఇంటర్ బోర్డును పునర్నియమిస్తామని చెప్పారు. జేఎన్టీయూ, మెడికల్ వర్సిటీల వీసీలుండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో వృత్తివిద్యను పటిష్టం చేస్తామని అన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రారంభించేందుకు జేఎన్టీయూ, వైద్యఆరోగ్య శాఖ, నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రెండు నెలల్లో నివేదిక ఇస్తుందని చెప్పారు. ఉపాధి చూపే కొత్త కోర్సులను 2018-19 నుంచి ప్రారంభిస్తామన్నారు. ఆదరణ లేని కోర్సులను రద్దు చేస్తామని వివరించారు. రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల సమగ్ర వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని అన్నారు. ఇంటర్ బోర్డులో 22 సేవలను ఆన్‌లైన్



చేశామని చెప్పారు. ఇటీవలే డిజిటల్ వినియోగంలో ఇంటర్ బోర్డుకు పురస్కారం లభించిందన్నారు. మరింత మెరుగ్గా సేవలందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. మూడేండ్ల నుంచి చేపట్టిన అనేక సంస్కరణల వల్ల ఇంటర్ విద్యను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. రూ.325 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వసతులు మెరుగుపరుస్తున్నామని వివరించారు. కొన్ని పనులు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో నడుస్తున్నాయని చెప్పారు. 59 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు 510 బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని అన్నారు. వాటిని నేరుగా భర్తీ చేసేందుకు అవకాశమొచ్చిందని చెప్పారు.

ప్రభుత్వ కాలేజీల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా సర్కారు జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోందని కడియం శ్రీహరి వివరించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 2014-15లో 1.23 లక్షల మంది, 2015-16లో 1.38 లక్షల మంది, 2016-17లో 1.50 లక్షల మంది, 2017-18లో 1.80 లక్షల మంది చదువుతున్నారని అన్నారు. 2014-15 కంటే ప్రస్తుతం 57 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల పట్ల నమ్మకం పెంచి ఎన్‌రోల్‌మెంట్ మరింత పెంచేందుకు కృషి చేస్తామన్నారు. దేశంలోనే ఇంటర్ బోర్డును నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కావాలని ప్రజాప్రతినిధుల నుంచి ప్రతిపాదనలొస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కాలేజీల మ్యాపింగ్ రూపొందించి ఎక్కడెక్కడ అవసరమో గుర్తిస్తామని అన్నారు. డిమాండ్ ఉన్నచోట వచ్చే విద్యాసంవత్సరంలో మరిన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ప్రారంభిస్తామన్నారు.

నిబంధనలు పాటిస్తేనే గుర్తింపు

నిబంధనలు సక్రమంగా పాటించిన కాలేజీలకే అనుబంధ గుర్తింపు వస్తుందని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. గతంలో ఇంటర్ బోర్డును శాసించిన కాలేజీలను నేడు ఆ కాలేజీలను శాసించే స్థాయికి ఇంటర్ బోర్డు వచ్చిందని గుర్తు చేశారు. బోర్డు చరిత్రలో కార్పొరేట్ కాలేజీలు జరిమానా చెల్లించిన దాఖలాలు లేవన్నారు. కానీ తెలంగాణ ఇంటర్ బోర్డు ఆ కాలేజీల నుంచి జరిమానా వసూలు చేసిందని చెప్పారు. ప్రయివేటు జూనియర్ కాలేజీల పట్ల బోర్డు కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అనుబంధ గుర్తింపు ఉన్నవి, లేనివి విభజించి జిల్లాల వారీగా కాలేజీల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని అన్నారు. గుర్తింపు లేని కాలేజీలకు చెక్ పెడతామని చెప్పారు. మధ్యాహ్న భోజనం ప్రారంభించే ఆలోచన ప్రస్తుతానికి లేదన్నారు. ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభించే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎ వాణీప్రసాద్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్, ఓయూ, జేఎన్టీయూ, టీయూ, పీయూ, ఎంజీయూ వీసీలు ఎస్ రామచంద్రం, ఎ వేణుగోపాల్‌రెడ్డి, సాంబయ్య, రాజారత్నం, అల్తాఫ్ హుస్సేన్‌తోపాటు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వేచ్ఛతోనే మహిళాభివృద్ధి

- త్రిపుల్ తలాఖ్‌పై సుప్రీం తీర్పు అభినందనీయం
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం
- చట్టసభల్లో మహిళలకు స్థానమేది ? : ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి

నవతెలంగాణ - బోడుప్పల్



త్రిపురాన వెంకటరత్నం

వంటింటి నుంచి ఆకాశం వైపు అడుగు లేస్తున్నా మహిళలు నేటికీ అణిచివేతలకు గురవుతున్నారనీ మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన తలాఖ్ చెల్లదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమన్నారు. మేడ్చల్ జిల్లా ఉప్పల్ డిపో పరిధిలోని బండి గార్డెన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో "మహిళలు-చట్టాలు-ప్రాధాన్యత" అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. మేడ్చల్ జిల్లా ఐద్వా అధ్యక్షురాలు ఎన్.సృజన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా త్రిపురాన వెంకటరత్నం మాట్లాడుతూ... దేశంలో మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని, వాటి అమలులోనే అనేక లోపాలున్నాయని వాపోయారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం వాటా కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని 20 ఏండ్లుగా పోరాటం చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని పాలకులను ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తున్నా అవి నామమాత్రమే అన్నారు. వారు ఇంకా భర్త చాటు భార్యలుగానే మిగులుతున్నారని ఆవేదన చెందారు. నేటికీ సమాజంలో మహిళలు స్వతంత్రంగా ఏ నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ లేదనీ, చివరకు పిల్లలను కనడంలో కూడా స్త్రీలకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. 1961లో వచ్చిన వరకట్న నిషేధ చట్టం ఇప్పటికీ సరిగా అమలు కావట్లేదన్నారు.

ఆస్తి హక్కులో స్త్రీకి అవకాశం కల్పించే చట్టం 1985 వచ్చిందని, దాని అమలు కూడా సరిగా లేదన్నారు. మహిళలు ఆత్మగౌరవంతో బతకడం నేర్చుకోవాలని సూచించారు. నేడు దేశంలో ఎక్కడచూసినా మహిళల స్థితిగతులు బాగా పెరిగాయని గొప్పలు చెప్పే పాలకులకు తెలంగాణలోని మంత్రి మండలిలో మహిళలకు చోటు ఇవ్వకపోవటం దారుణమని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి అన్నారు. మహిళలపై దాడులు జరిగినప్పుడు రక్షణ కల్పించాల్సిన అధికారులు, నాయకులు భిన్నంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. సెప్టెంబర్ నుంచి నూతన ఎక్సైజ్ పాలసీ అమలుచేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దాన్ని అమలుచేయని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెఎన్.ఆశాలత, బత్తుల హైమావతి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు చల్లా లీలావతి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి వినోద, కోశాధికారి విజయ, చైతన్య మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాల రాపోలు సువర్ణ, కొలిపాక విజయ, ఇందిరా, రాజమణి, చిల్లా అనురాధ పాల్గొన్నారు.

చారిత్రాత్మకం : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ:త్రిపుల్ తలాఖ్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని, మహిళల సమానత్వం, సాధికారతకు అది కారణమవుతుందని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. సుప్రీం తీర్పును కాంగ్రెస్ పార్టీ కూడా స్వాగతించింది. లింగ వివక్షను తొలగించి మహిళలకు సమానత్వం, న్యాయం జరిపేందుకు ఈ తీర్పు తోడ్పడుతుందని కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి రణదీప్‌సూర్జేవాలా ట్వీట్ చేశారు. న్యాయం కోసం పోరాడిన మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతున్నానని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. ఏదైతే జరుగుతుందని అనుకున్నామో అదే జరిగింది, ఇది ఓ మంచి నిర్ణయమని కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ ట్వీట్ చేశారు.

జిల్లాల కలెక్టర్లకు 23.25 కోట్లు విడుదల

హైదరాబాద్ : రాష్ట్రంలోని 31 జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అత్యవసరాల కోసం నిధులు విడుదల చేసినట్టు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. జిల్లాకు రూ. 75 లక్షల చొప్పున రూ. 23.25 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులను ఆయా జిల్లాల కలెక్టర్ల అత్యవసర పనుల కోసం ఉపయోగించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం జరిగింది. కెరమెరి సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. కుమురంభీం జిల్లా కెరిమెరి మండలం నింగూడ, ఆగరివాడకు చెందిన వారు మంగళ వారం ఉదయం వాంకిడి మండలంలో జరుగుతున్న సారండీ భవాని జాతరకు వెళ్లారు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. బీడారా గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న ఆటో బస్సును దాటే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రికి తరలించే క్రమంలో మరో ముగ్గురు చనిపోయారు. మృతుల్లో నింగూడకు చెందిన మోహర్ల సంతోష్(18), తిరుపతి (22), బడమా అంబారావ్(25), బెండారె రమేష్(14), అగర్‌వాడకు చెందిన జ్ఞానేశ్వర్ ఉన్నారు. గాయపడిన వారిలో మోహర్ల తిరుపతి, సంతోష్, రాందాస్, గణేష్, రవీందర్, డ్రైవర్ రాంచందర్ ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సచివాలయమా..ఎలుకల అడ్డానా

(మొదటిపేజీ తరువాయి)

ఎలుకలు నివాసమేర్పర చుకున్నాయి. ఎలుకలు చనిపోయి కంపు వాసన కొడుతున్నది. సీఎం పీఆర్ఓ చాంబర్‌లోనే మూడు చనిపోయిన ఎలుకలను గుర్తించి బయటపడేశారు. దీంతో సి బ్లాక్ ఎలుక చచ్చిన వాసనతో దుర్గంధం వెదజల్లుతున్నది. సచివాలయ భవనాలు ఎలుకల నివాస ప్రాంగణాలుగా మారిపోయాయని సిబ్బంది చర్చించుకోవడం గమనార్హం.

బిల్డింగ్‌కు రూ.10 కోట్లు.. ప్రచారానికీ రూ.10 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం చీఫ్ సెక్రటరీ బిపి ఆచార్య జీవో 603ను జారీ చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఫర్ వెల్ఫేర్ కింద ఈ నిధులు కేటాయించారు. భవన నిర్మాణానికి ఎన్ని నిధులు కేటాయించిందో, ప్రచార నిమిత్తం కూడా వివిధ పత్రికలకు, చానల్స్‌కు పదికోట్లు యాడ్స్ ఇచ్చినట్టు తెలిసింది. గతంలో ఎప్పుడూ ఈ రకంగా యాడ్స్ ఇచ్చిన దాఖలాలు లేవు. సొంతంగా ఏదైన సంస్థ ప్రచారం నిమిత్తం తమ కార్యక్రమం గురించి తెలియజేసేందుకు యాడ్స్ ఇచ్చుకోవడం సహజం. ప్రభుత్వమే అట్టహాసంగా ప్రకటనలు ఇవ్వడమేంటని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా భవన నిర్మాణానికి 10 కోట్లు విడుదల చేసి, అంతే మొత్తాన్ని యాడ్స్ రూపంలో ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందని విద్యావేత్తలు చెబుతున్నారు. ఇదిలావుండగా తెలుగువాడు ఉపరాష్ట్రపతి అయ్యారన్న పేరుతో వెంకయ్యానాయుడుకు పౌరసన్మానం చేస్తూ ప్రచార నిమిత్తం ప్రభుత్వం వివిధ పత్రికలకు, చానల్స్‌కు 15 కోట్ల రూపాయలు విడుదల చేసింది. రాజకీయపరంగా ఆ రెండు సామాజిక వర్గాల ఓటర్లను ఆకర్షించే నిమిత్తం ప్రభుత్వం ఈ ప్రకటనలు విడుదల చేసి ఉంటుందని ప్రచారం జరుగుతున్నది. యాడ్స్ ఇవ్వడంలోనూ మీడియాను విభజించడంపైనా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

తాను ఇచ్చింది చంద్రునికో నూలుపోగు

- భవన శంకుస్థాపనలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ- హైదరాబాద్ బ్యూరో/రాజేందర్‌నగర్

వెంకట్రామిరెడ్డి స్థాపించిన సంస్థకు తాను ఇచ్చింది చంద్రునికో నూలుపోగు వంటిందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇది తెలంగాణ చరిత్రను పునరుద్ధరించే అంశమని తెలిపారు. మంగళవారం బుద్వేల్‌లో రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఎడ్యుకేషనల్ క్యాంపస్ భవన నిర్మాణానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ బుద్వేల్ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్‌గా మారాలన్నారు. ఇప్పుడు కేటాయించిన 10 ఎకరాలకు తోడు మరో 5 ఎకరాలు కలిపి ఇవ్వాలని నిర్ణయించామన్నారు. నారాయణగూడలో ఉన్న బాలికల హాస్టల్ విస్తరణ కోసం.. దాని పక్కనే ఉన్న ఐపీఎం ఖాళీ స్థలాన్ని కేటాయిస్తున్నామని చెప్పారు. 'సమైక్య రాష్ట్రంలో మహనీయుల పేర్లు కనుమరుగైపోయాయి.. ప్రస్తావన లేకుండా పోయారు. రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ప్రస్తావన లేదు. సురవరం ప్రతాప్‌రెడ్డి వెంకట్రామిరెడ్డి చరిత్ర రాసి మనకు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలోనే అప్పాకు వెంకట్రామిరెడ్డి పేరు పెట్టుకున్నాం. ఆయన పోలీసు కొత్వాల్‌గా పని చేశారు' అని తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో జడ్జీలకు పచ్చజెండా

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలుగు రాష్ట్రాల్లోని న్యాయాధికారుల నియామకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించింది. సర్వోన్నత న్యాయస్థానం గత ఆదేశాలనుసారం కేంద్రం తరపు అదనపు సొలిసిటరీ జనరల్ మణీందర్‌సింగ్ ముసాయిదా మార్గదర్శకాలను సుప్రీంకోర్టుకు సమర్పించారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు అవసరమైన న్యాయమూర్తుల సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఖాళీలపై సర్వోన్నత న్యాయస్థానం ఆరా తీసింది. ఈ వివరాలను హైకోర్టు సమర్పించకపోవడంతో కేసు విచారణ వచ్చే నెల ఐదో తేదీకి వాయిదా పడింది. కాగా కేంద్ర మార్గదర్శకాల్లోని 'ఆప్షన్', 'సీనియారిటీ'పై తెలంగాణ న్యాయాధికారుల తరపు న్యాయవాది ఇందిరాజైసింగ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయాధికారుల నియామకాలకు సంబంధించిన కేసు మంగళవారం జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. మొదట కేసు విచారణకు రాగానే ముసాయిదా మార్గదర్శకాలను కేంద్రం తరపు న్యాయవాది ధర్మాసనానికి సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ముందు నుంచి జూనియర్ సివిల్ జడ్జీల పోస్టులను సీనియారిటీ ప్రకారం భర్తీ జరగాలని, న్యాయాధికారులు ఏ రాష్ట్రం కోరుకుంటారో 'ఆప్షన్' ఇవ్వాలని అందులో పొందుపరిచారు. మార్గదర్శకాల ప్రకారం నియామకాలు జరిగినప్పటికీ కొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నట్టయితే వాటిని సీనియారిటీ రివర్స్ క్రమంలో జరపాలని పేర్కొన్నారు. అయితే సీనియారిటీ, ఆప్షన్‌లో తొలి ప్రాధాన్యత దేనికి ఉంటుందని జస్టిస్ చలమేశ్వర్ సందేహం వెలిబుచ్చారు. అలాగే ఆప్షన్లు ఇవ్వనివారి కేటాయింపుల ప్రాతిపదిక ఏమిటని ప్రశ్నించారు. అలాగే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి ఉమ్మడి హైకోర్టు పరిధిలో ఉన్న న్యాయాధికారుల పోస్టులు ఎన్ని, అందులో ఖాళీలు ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. అయితే ఆ గణంకాలు తమ వద్ద లేవని, తదుపరి విచారణ సందర్భంగా అందజేస్తానని హైకోర్టు తరపు న్యాయవాది రమణీరావు తెలిపారు. కాగా రెండు రాష్ట్రాలు సైతం వాటి పరిధిలో ఉన్న కోర్టుల్లోని జడ్జీల పోస్టులు, తదితర వివరాలు సేకరించాలని ధర్మాసనం ఆదేశించింది. కాగా కేంద్ర మార్గదర్శకాల్లో సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకోవాలనడంపై తెలంగాణ న్యాయాధికారుల తరపు న్యాయవాది ఇందిరాజైసింగ్ అభ్యంతరం వ్యక్తపరిచారు. దీనివల్ల తెలంగాణ స్థానికత కలిగిన న్యాయమూర్తులకు నష్టమని తెలిపారు. ఆయా రాష్ట్రంలోని న్యాయాధికారుల పోస్టులను ఆ రాష్ట్రానికి చెందినవారితో భర్తీ చేయాలన్నారు. అలాగే మార్గదర్శకాలకనుగుణంగా భర్తీ అయ్యాక డిప్యూటేషన్ ప్రాతిపదికన నియామకం జరపాలన్నారు. దీంతో కేసు సెప్టెంబర్ ఐదో తేదీకి వాయిదా పడింది.

తీర్పు కాపీ చదివిన తర్వాత స్పందిస్తా : అసదుద్దీన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

త్రిపుల్ తలాఖ్ అంశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మజ్లిస్ పార్టీ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని చెప్పారు. అయితే ఇది ఏకపక్షంగా వచ్చిన తీర్పుకాదని గుర్తుంచుకోవాలన్నారు. సుప్రీం కోర్టు నాలుగు వందల పేజీల తీర్పుంది, దీన్ని పూర్తిగా చదివిన తర్వాత తిరిగి స్పందించనున్నట్టు ఆయన చెప్పారు. మంగళవారం ఆయన మజ్లిస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ త్రిపుల్ తలాఖ్ తీర్పు క్షేత్రస్థాయిలో అమలు అంత సులభంకాదన్నారు. క్షేత్రస్థాయిలో అమలు చేయాలంటే చాలా కఠినమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ అభిప్రాయం కేవలం తమ పార్టీదేనని, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డుది కాదన్నారు. చట్టాలు చేయడం, తీర్పులు వెలువరించడం వల్ల ప్రయోజనం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. త్రిపుల్ తలాఖ్ అనేది ఓ సామాజిక అంశమని, సంస్కరణల ద్వారానే మార్పురావాలని అన్నారు. సామాజిక సంస్కరణలు జరిగి సమాజంలో మార్పులు రావల్సి ఉందన్నారు.

ఈ తీర్పు వారికి ఊరట-బీజేపీ లక్ష్మణ్

త్రిపుల్ తలాఖ్‌ను ఆరునెలలపాటు నిషేధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందని, దాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ అన్నారు. మంగళవారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మహిళలు అనేకేండ్లుగా త్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరే కంగా పోరాడుతున్నారని, ఈ తీర్పు వారికి ఊరటనిస్తుందని చెప్పారు. మహిళలందరికీ సమాన హక్కులు, స్వావలంబనకు ఈ తీర్పు ఉపకరిస్తుందన్నారు.

రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై పార్లమెంట్ చట్టం చేయాలని ఆదేశించింది. అప్పటివరకూ తలాఖ్‌పై నిషేధం అమలులో ఉంటుందని,ఈలోగా చట్టం తేలేని పక్షంలో ఆ తర్వాత కూడా నిషేధం కొనసాగుతుందని సుప్రీంకోర్టు తెలిపింది. తలాఖ్‌పై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. ఈ ఏడాది మే 11 నుంచి ఆరు రోజులపాటు ఈ కేసులో ఇరుపక్షాల వాదనలు విన్న రాజ్యాంగ ధర్మాసనం ఆ సమయంలో తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం 3-2 మెజారిటీతో ధర్మాసనం తన తీర్పును వెల్లడించింది. ధర్మాసనంలోని జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ యుయు లలిత్ త్రిపుల్ తలాఖ్ పద్ధతిని వ్యతిరేకిస్తూ మెజారిటీ తీర్పు వెల్లడించారు. తలాఖ్ ఏకపక్షంగా ఉన్నదని రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న లింగ సమానత్వానికి అది విరుద్ధమని తమ తీర్పులో వారు పేర్కొన్నారు. త్రిపుల్ తలాఖ్ చెప్పడం ద్వారా విడాకులు పొందే హక్కు పురుషులకు మాత్రమే ఉండటం మహిళల ప్రాథమిక హక్కులకు భంగకరమని మెజారిటీ తీర్పు స్పష్టం చేసింది. పాకిస్తాన్,బంగ్లాదేశ్‌సహా మెజారిటీ ముస్లిం దేశాల్లో త్రిపుల్ తలాఖ్‌పై నిషేధం ఉన్నట్టు సుప్రీంకోర్టు గుర్తు చేసింది. అయితే, చీఫ్‌జస్టిస్ ఖేహర్, జస్టిస్ అబ్దుల్‌నజీర్ తలాఖ్‌ను సమర్థిస్తూ అది ముస్లింల ప్రాథమిక హక్కుగా పేర్కొన్నారు. మత స్వేచ్ఛకు హామీ ఇచ్చే ప్రాథమిక హక్కులను వీరు తమ తీర్పులో ఉటంకించారు. అయితే, మెజారిటీ తీర్పునే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, తమ తీర్పుకు అనుగుణంగా చట్టం చేసేముందు ముస్లిం సంఘాల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. అందుకు రాజకీయపక్షాలు సహకరించాలని కోరింది.

మెజారిటీ తీర్పులోని ముఖ్యాంశాలు: 1-త్రిపుల్ తలాఖ్‌కు చట్టబద్ధత లేదు, చట్టం లేకుండా అనుమతించలేం. 2-పవిత్ర ఖురాన్‌లో ముమ్మారు తలాక్‌ను అనుమతించే నిబంధన లేదు. 3-చట్టాలకు అనుగుణంగానే భిన్నమైన ఆచారాలను అనుమతించాలి. అయితే, చట్టాలు చేయడం కోర్టుల విధి కాదు. 4-వివాహబంధాన్ని పవిత్రఖురాన్ శాశ్వతమైనదిగా పేర్కొన్నది. అనివార్య కారణాలున్నపుడే విడాకులకు అనుమతిం చాలని చెబుతుంది. పునరాలోచనకు అవకాశం ఉండాలని చెబుతుంది. త్రిపుల్ తలాఖ్ పద్ధతిలో అందుకు అవకాశం లేనందున అది ఖురాన్‌కు విరుద్ధం. పవిత్ర ఖురాన్‌కు వ్యతిరేకమైనది షరియత్(చట్టం)ను ఉల్లంఘించడమే అవుతుంది. మైనారిటీ తీర్పులోని ముఖ్యాంశాలు:1- దాదాపు 1400 ఏండ్ల నుంచి త్రిపుల్ తలాఖ్‌ను ఆచరిస్తున్నారు 2-రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో ఒకటైన 25వ అధికరణం మత స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. అందువల్ల తలాఖ్‌ను అనుసరించడం ప్రాథమిక హక్కుగానే భావించాలి.3-భిన్నమైన మతాలు అనుసరించే ఆచారాలను సంస్కరించాలంటే శాసన వ్యవస్థలు జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. 4-మతం విశ్వాసానికి సంబంధించినది. తర్కానికి సంబంధించినది కాదు.

ఇది ఐదు మతాలకు చెందిన న్యాయమూర్తుల తీర్పు

తలాఖ్‌పై విచారణ చేపట్టిన ఐదుగురు న్యాయమూర్తులు ఐదు మతాలకు చెందినవారు. చీఫ్ జస్టిస్ జెఎస్ ఖేహర్ సిక్కు మతానికి, జస్టిస్ కురియన్ జోసెఫ్ క్రైస్తవ మతానికి, జస్టిస్ రోహింటన్ ఫాలీ నారిమన్ పార్శీ మతానికి, జస్టిస్ యుయు లలిత్ హిందూ మతానికి, జస్టిస్ అబ్దుల్‌నజీర్ ముస్లిం మతానికి చెందినవారు.ఈ తీర్పుపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరుతూ కేంద్రం రాష్ట్రాలకు లేఖ రాసింది.

స్వాగతిస్తున్నాం: సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో, ఐద్వా

షయారోబానో వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో త్రిపుల్ తలాఖ్ ఏకపక్షమని, రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో, అఖిలభారత ప్రజాస్వామ్య మహిళా సంఘం(ఐద్వా) స్వాగతించాయి. దీనికి సంబంధించి వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలోని మెజారిటీ, మైనారిటీ తీర్పుల పూర్తి పాఠాల్ని అధ్యయనం చేసిన అనంతరం సమగ్ర ప్రకటన విడుదల చేయనున్నట్టు పొలిట్‌బ్యూరో తెలిపింది. నిర్బంధంగా, తొందరపాటుతో జరిగే త్రిపుల్ తలాఖ్‌ను తాము మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నట్టు ఐద్వా తెలిపింది. లక్షలాదిమంది ముస్లిం మహిళలు త్రిపుల్ తలాఖ్‌తో కష్టాలు పడుతున్నారని ఐద్వా ఓ ప్రకటనలో తెలిపింది. ఆర్థికంగానూ, ఇతర సహాయాలేమీ లేకుండా త్రిపుల్ తలాఖ్ ద్వారా వదిలివేయడం వల్ల ముస్లిం మహిళలు ఇబ్బందులనెదుర్కోవాల్సి వస్తున్నదని ఐద్వా పేర్కొన్నది. అనేక త్రిపుల్ తలాఖ్ కేసులపై ఐద్వా లీగల్ సెల్ పోరాడిందని, బాధిత మహిళలకు అండగా నిలబడిందని ఐద్వా తెలిపింది. త్రిపుల్ తలాఖ్‌పై తీర్పును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత పూర్తిస్థాయిలో స్పందిస్తామని ఐద్వా తెలిపింది.

షయారా బానో సుదీర్ఘపోరాటం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడంపై పోరాడాలని నిర్ణయించింది. న్యాయస్థానంలో కేసు వేయాలని నిశ్చయించుకున్నది.ఈ జీవితపోరాటంలో.. ఆమెకు సోదరుడు అర్షద్ అలీ అండగా నిలిచారు.

అంతులేని హింస..వేధింపులే..

2002లో బానో వివాహం జరిగింది. పెండ్లయిన కొద్ది రోజులకే ఆమెకు అత్తవారింట్లో కష్టాలు మొదలయ్యాయి. మరింత కట్నం తెమ్మని వేధించేవారు. హింసించేవారని బానో తెలిపింది. అప్పటికే ఆమె ఇద్దరు మగసంతానం. ఆ తర్వాత ఏకంగా ఆరు గర్భస్రావాలు చేయించారు. ఇలా చేయిస్తే.. తనకు ఏదైనా జరిగితే ఆమెను అడ్డు తొలగించుకోవచ్చన్న కుట్రతో ఆడపడుచులు యత్నించినట్టు బానో ఆరోపించారు. పుట్టింట్లో ఉండగా స్పీడ్‌పోస్టులో విడాకులు పంపిన ఆమె భర్త ఇంటికి వచ్చి ఇద్దరు కుమారులను కూడా బలవంతంగా తీసుకువెళ్లాడు. అయితేఆమె తల్లిదండ్రులు, సోదరుడు ఇచ్చిన నైతిక మద్దతు ముందుకు నడిపించాయి. అనంతరం ఢిల్లీకి చేరుకున్న బానో సుప్రీంకోర్టు న్యాయవాదులతో సంప్రదించి కేసును దాఖలు చేసింది. కేసును విచారించిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. "ఓర్పుతో న్యాయం కోసం ఎదురుచూసిన నాకు న్యాయం లభించింది. కనీసం నా కన్నబిడ్డలను కూడా కలిసేందుకు అవకాశమిచ్చేవారు కాదు.. ఇన్నాండ్లకు నా కష్టాలు తీరాయి" అని బానో తీర్పుపై హర్షం వ్యక్తంచేశారు.

మూతపడ్డ బ్యాంకులు

(మొదటిపేజీ తరువాయి)

స్తంభించిపోయాయి. చిన్నా పెద్ద బ్రాంచీలనే తేడా లేకుండా సమిష్టిగా ఉద్యోగులంతా ఉద్యమించారు. మంగళవారం ఉదయం నుంచే ఉద్యోగులు తమ ఆందోళనలు కొనసాగించారు. భారీ సంఖ్యలో ఉద్యోగులు నిరసనల కార్యక్రమాన్ని చేపట్టారు. మోడీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ..దేశమంతా పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టి.. ఉద్యోగులంతా నినదించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన బ్యాంకుల ఏకీకరణ అంశంతో పాటు వినియోగదారులపై పడుతున్న అదనపు ఆర్థిక భారాల సమస్యలపై సమ్మె చేయాల్సి వచ్చిందని... సమ్మె పూర్తిగా విజయవంతమైనట్టు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సీహెచ్ వెంకటాచలం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్ల రుణాల వల్లే బ్యాంకింగ్ రంగం ఛిన్నాభిన్నమవుతున్నదని తెలిపారు. మోడీ సర్కారు తమ ధోరణిని మార్చుకోకపోతే.. ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వెంకటాచలం హెచ్చరించారు.

పలు బ్యాంకుల ఎదుట ధర్నాలు

బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలను వ్యతిరేకిస్తూ, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ల పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు మంగళవారం చేపట్టిన సమ్మె విజయవంతమైంది. హైదరాబాద్‌లోని కోఠిలోని ఎస్‌బీఐ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం ఎదుట బ్యాంకు అధికారు లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్స్ యూనియన్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ ఎన్‌వీఎస్ఆర్‌శర్మ మాట్లాడుతూ...ప్రభుత్వ రంగ బ్యాం కులను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. బ్యాంకుల ప్రయివేటీకరణ సరిగాదన్నారు. సూర్యాపేట, కోదాడ, నల్లగొండ, మిర్యాల గూడ, దేవరకొండల్లో బ్యాంకులన్నీ మూసేశారు. నల్లగొండ లో ఎస్‌బీఐ బ్రాంచి ఎదుట ధర్నా చేపట్టారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని సుమారు130 వివిధ బ్యాంకు శాఖల్లో పనిచేస్తున్న 600 మంది సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. వరంగల్ అర్బన్, రూరల్, జనగామ, జయశంకర్, మహబూబాబాద్ జిల్లాలో బ్యాంకులు మూతబడ్డాయి. వరంగల్‌లోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచి ఉద్యోగులు విధులు బహిష్కరించి బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆంధ్రా బ్యాంకు ఎదుట బ్యాంకు ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జహీరాబాద్, సదాశివపేట, జోగిపేట, నారాయణఖేడ్ పట్టణాలతో పాటు అన్ని గ్రామీణ బ్రాంచీల్లో ఒక రోజు బంద్ పాటించారు. ఆయా బ్రాంచీల ముందు ఉద్యోగులు టెంట్ వేసుకుని కూర్చుని నల్ల రంగ గుడ్డలతో నిరసన తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సమ్మె విజయవంతమైంది. ఆదిలాబాద్‌లోని శివాజీచౌక్ ఎస్‌బీఐ వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ, మానవపాడులో ఎస్‌బీఐ, గ్రామీణ వికాస్ బ్యాంకులను బంద్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని బ్యాంకులన్నీ మూతపడ్డాయి.

ఏకపక్షంగా కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడిన నిర్వాసితులను పోలీసులు అడ్డుకోబోయారు. 'మాకు న్యాయమైన పరిహారం దక్కాల్సిందే. భూమికి భూమి, ఊర్లకు ఊర్లు, ఇండ్లకు ఇండ్లు కట్టివ్వాల్సిందే' అంటూ నిర్వాసితులు గొంతెత్తి నినదించారు. 'మాకు న్యాయమైనా చేయండి. లేకుంటే మా శవాల మీద బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్లు కట్టండి' అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో నిర్వాసితులు ప్రజాభిప్రాయ సేకరణను రెండు గంటలపాటు అడ్డుకున్నారు. నిర్వాసితులను హాల్లోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డులు గుంజుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు వారిని లోనికి అనుమతించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్ల నిర్మాణం కోసం యాదాద్రి జిల్లా భువనగిరి మండలం రాయగిరిలోని సోమ రాధక్రిష్ణ ఫంక్షన్‌హాల్లో కలెక్టర్ అనితారామచంద్రన్ అధ్యక్షతన ప్రజాభిప్రాయసేకరణ జరి గింది. 'రీడిజైన్‌తో మా గ్రామాలను ముంచితే పురుగల మందు తాగి చస్తాం. మా శవాల మీద రిజర్వాయర్ నిర్మించండి', 'కేసీఆర్ డౌన్.. డౌన్.. పాత డిజైన్ ప్రకారమే రిజర్వాయర్లు కట్టాలి' అని ప్లకార్డులు చేతపట్టుకుని నిర్వాసితులు నినాదాలు చేశారు. బస్వాపురం, బీఎన్‌తిమ్మపురం, రాళ్లజనగాం, శోక్లా తండ, కోక్యాతండ, లప్పనాయక్‌తండ, తదితర ముంపు గ్రామాలకు చెందిన 400 మంది ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న హాల్లోకి వెళ్లేందుకు యత్నించారు. వారిని ప్రవేశ ద్వారం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తోసేశారు. ప్లకార్డులు గుంజుకున్నారు. పోలీసుల వైఖరికి నిరసనగా ముంపు గ్రామాల ప్రజలు హాల్ బయట బైటాయిం చారు. లోపల ఉన్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మంగా నర్సింహులు, బీసీ సంఘం నాయకులు రావుల రాజు మిగతా పార్టీల నాయకులు నిర్వాసితులకు బాసటగా నిలిచారు. ఆందోళన మరింత ఉద్రిక్తమయ్యే అవకాశం ఉందని గ్రహించిన ఏసీపీ స్నేహిత, సీఐలు ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న నాయకుడు తొడిమే రవీందర్‌రెడ్డి, భద్రు నాయక్, ఉడుత సత్యనారాయణలతో మాట్లాడి సమస్యను వేదిక వద్ద ప్రశాం తంగా చెప్పండి అంటూ నచ్చచెప్పి లోపలికి పంపించారు. కానీ, వేదిక వద్దకు నిర్వాసితులను పిలువకపోవడంతో తిరిగి హాల్లో నినాదాలు చేశారు. వారిని బలవంతంగా బయటకు పంపేందుకు పోలీసులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో కలెక్టర్ జోక్యం చేసుకుని... నిర్వాసితుల గ్రామాల్లోకి వచ్చి వాళ్ల గోడును విని ప్రజామోదం పొందిన తర్వాతే భూసేకరణ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

గులాబీ శ్రేణుల సమీకరణ

రెండు రోజుల ముందు నుంచే యాదాద్రి భువనగిరి జిల్లాలో టీఆర్ఎస్ శ్రేణుల సమీకరణపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించారు. రిజర్వాయర్‌లతో లబ్ది పొందే గ్రామాల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలను, నాయకులను సమీకరించారు. వీరితో రీడిజైన్ ప్రకారమే రిజర్వాయర్‌లను నిర్మించాలని చెప్పించారు. 'మా గోడును పట్టించుకోకుండా ప్రజాప్రతినిధులకు భజన చేయడానికేనా మీరు వచ్చింది' అంటూ గులాబీ శ్రేణులపై ముంపు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏకపక్షం...ఎమ్మెల్యేల అనుచరులే ఎక్కువ

కరీంనగర్ జిల్లాశివారులోని రేకూర్తి రాజశ్రీ గార్డెన్‌లో కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ఏకపక్షంగా జరిగింది. టీఆర్ఎస్ అనుయాయులే ఆ సభలో పాల్గొని ప్రాజెక్టు నిర్మాణానికి సుముఖత తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన అనుయాయులతో మద్దతుగా మాట్లాడే జనాన్ని ఫంక్షనహాల్‌కు తరలించినట్టు సమాచారం. ఎమ్మెల్యేకు చెందిన ఓ అనుయాయుడు ఆవేశపూరిత ప్రసంగం చేస్తూ 'ప్రాజెక్టులకు అడ్డుతగిలే వారిని అడ్డంగా నరుకుతాం' అని హెచ్చరించాడు. మొత్తంగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం టీఆర్ఎస్ సభలా సాగింది. అఖిలభారత రైతు సంఘం జిల్లా కన్వీనర్ వర్ణవెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నామమాత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం అర్థరహితమన్నారు. అనంతరం కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు వినతిపత్రం ఇచ్చారు.

నిజామాబాద్‌లోనూ అంతే...

కాళేశ్వరంలో ప్రాజెక్టులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ప్రతిపాదిత ప్యాకేజీ 20, 21 పనుల్లో భాగంగా ముంపు, పర్యావరణంపై స్థానిక రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఇన్‌చార్జి కలెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. భూమికి బదులు భూమి ఇచ్చేవరకూ కదలబోమని ముంపు బాధితులు స్పష్టంచేశారు. రెండు టీఎంసీల నీటి కోసం రెండు గ్రామాలను, ఏడు తండాలను ముంపునకు గురిచేయడం సరిగాదని ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో 350 వరకు బాధితులు వచ్చారు. అందులో 100 మంది వరకూ టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే ఉన్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడేవారినే ఎక్కువగా రప్పించుకున్నారు. ప్రాజెక్టులో తమ భూములు కోల్పోవడాన్ని అంగీకరించబోమని, ఏదైనా ఉంటే తమ గ్రామానికే వచ్చి మాట్లాడాలని, ప్రజాభిప్రాయ సేకరణకు తాము రాబోమని బైరాపూర్, మంచిప్ప, అమ్రాబాద్ గ్రామస్తులు అధికారులకు తేల్చిచెప్పారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం, తుర్కపల్లి గ్రామంలోని బాలా జీ ఫంక్షన్‌హాల్‌లో కలెక్టర్ ఎంవీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మార్కెట్ రేటు విలువ ప్రకారం భూమికి రేటు కట్టివ్వాలని కొందరు రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్ఈ వేణు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రమణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రతినిధి కవిత తదితరులు పాల్గొన్నారు.

జరదేఖో
నవతెలంగాణ





సరిహద్దుల్లో సంచారం

ఆద్యంతం ఉత్కంఠభరితం

అక్కడికి వెళితే చాలు ఆకు పచ్చని ప్రపంచంలోకి అడుగు పెట్టిన అనుభూతి కలుగుతుంది. సూర్యోదయ వేళ అడవి పంపించిన మౌన సంకేతాలు మనల్ని గాలి తెమ్మెరలై తాకి పోతుంటాయి. దశాబ్దాల నాటి అస్తిత్వ పోరాటాల గాథలు సవాళ్ళ స్వాగత గీతాలై వినిపిస్తుంటాయి. అడవిని శ్వాసించే జవాన్ల ధైర్య సాహసాలు కొమ్మల్లో, రెమ్మల్లో పూల గుబాళింపులవుతుంటాయి.



పశ్చిమాన భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లో నేను పర్యటిస్తున్నప్పుడే తూర్పు దిక్కు గురించిన చర్చ బీఎస్ఎఫ్ అధికారులతో జరిగింది. అక్కడ ఉండే విభిన్నమైన భౌగోళిక స్వరూపం, వాతావరణం, సరిహద్దు, ప్రజల జీవన విధానం గురించి ఆరా తీసేదాన్ని. చాలా సేపు మాట్లాడుకునే వాళ్లం. అవన్నీ చాలా ఆసక్తికరంగా అనిపించాయి. గుజరాత్‌లోని క్రీక్స్, రాజస్థాన్ థార్ ఎడారి, పంజాబ్ పచ్చటి పొలాలు ఇలా అంతర్జాతీయ సరిహద్దు రేఖ వెళ్తున్న భౌగోళిక స్వరూపాలు వేటికవి వేరు, వాటి సవాళ్ళు వేరు. పహారా కాయాల్సిన పద్ధతులు వేరు. ఇంకా పైకి వెళితే జమ్ము–కాశ్మీర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. అక్కడి సామాజిక పరిస్థితులు, ఉగ్రవాద ముప్పు, ప్రత్యేక దేశ డిమాండ్ పూర్తిగా భిన్నం. ఇటు ఈశాన్య రాష్ట్రాల్లో సరిహద్దు వీటన్నింటి కంటే వేరుగా ఉంటుంది. సిపాయిలకు బయటి ముప్పు కంటే ప్రకతే ప్రమాదకారిగా మారుతుంది. సిపాయి అడవిని ఎలా జయిస్తాడో చూడాలనుకున్నాను. జర్నలిస్ట్‌గా వాటిని నివేదించాలనుకున్నాను. అలా తూర్పు దిక్కున నా ప్రయాణం మొదలయింది.

ఈశాన్య రాష్ట్రాలు ఏడుగురు అక్కాచెల్లెళ్లల్లో చిట్టి చెల్లి త్రిపుర. దేశంలోని మూడవ అతి చిన్న రాష్ట్రం. మూడు వైపుల బంగ్లా సరిహద్దులు ఉంటే ఒక వైపు మాత్రమే భారత దేశంతో సరిహద్దులు పంచుకునే విచిత్ర భౌగోళిక స్వరూపం ఇక్కడ కనిపిస్తుంది. అందుకే మిగిలిన దేశానికి త్రిపురకు అనుసంధానం తక్కువ. ఎన్‌హెచ్–8 అనే ఒకే ఒక జాతీయ రహదారి త్రిపురను, మిగిలిన దేశాన్ని కలుపుతుంది. బంగ్లాదేశ్‌తో సరిహద్దు మన దేశానికి వ్యూహాత్మకంగా కీలకం. అసలు బంగ్లా ఆవిర్భావం కూడా మన సహకారంతో జరిగిందే కదా. అంతకు ముందు బంగ్లాదేశ్‌ను తూర్పు పాకిస్థాన్‌గా పిలిచే వారు. 1972లో భారత్–పాక్ యుద్ధం తర్వాత బంగ్లాదేశ్ ఒక దేశంగా పురుడు పోసుకుంది. అందుకే ఈ దేశంతో మన అనుబంధం బలీయమైంది. భారత్–బంగ్లా సరిహద్దు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద అంతర్జాతీయ సరిహద్దు రేఖ. దీని పొడవు నాలుగువేల 96 కిలోమీటర్లు. ఐదు రాష్ట్రాలు ఆ దేశంతో సరిహద్దు పంచుకుంటున్నాయి. వాటిలో త్రిపుర ఒకటి. ఈ రాష్ట్రం ప్రపంచంలోనే అత్యధిక మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఒకటి. పశ్చిమాన ఉగ్ర తూటాల ప్రమాదం ఉంటే త్రిపుర అడవుల్లో దోమ కాటు ప్రాణాలను తీస్తుంది.



హైదరాబాద్ నుంచి బెంగళూరు, అసోం మీదుగా త్రిపుర రాజధాని అగర్తలలో ల్యాండ్ అయ్యాం. ఇక్కడి బీఎస్ఎఫ్ అధికారులు చాలా స్నేహ భావంతో ఉన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దు పహారా బాధ్యతలు చూసేది బార్డర్ సెక్యూరిటీ ఫోర్సే. బీఎస్ఎఫ్ అధికారుల అనుమతి, సహకారం లేకుండా ఇక్కడి దట్టమైన అడవుల్లో అడుగు పెట్టడం కష్టం. ఆ రాత్రి అగర్తాలోనే రెస్ట్ తీసుకుని రెండో రోజు సరిగ్గా ఉదయం ఆరు గంటలకు ఉదయ్‌పూర్ సెక్టార్‌లోని మహారాణిచరా ప్రాంతం వైపు బయలు దేరాను. ఇది గోమతి జిల్లా కిందకు వస్తుంది. అగర్తలా నుంచి రెండు గంటల ప్రయాణం తర్వాత దట్టమైన అడవికి ముఖద్వారంగా ఉండే మహారాణిచర వచ్చింది. అక్కడ బీఎస్ఎఫ్ అధికారుల బ్రేక్‌ఫాస్ట్ ఆతిథ్యం తీసుకుని మరింత ముందుకు సాగాం. అంతటా పచ్చగా పరుచుకున్న ఆ ఆకుపచ్చని ప్రపంచంలో, అడవి చెప్పే ఊసులు వింటూ, అడవి చేసే అల్లరి చూస్తూ ఘాట్ రోడ్డు పై మూడు గంటల ప్రయాణం. అటవీ అందాలు, అద్భుతాలు చూస్తూ సాగిన ఆ ప్రయాణం ఎంత ఉత్కంఠ కలిగించిందో. అడవిని శ్వాసించిన ఆ జ్ఞాపకాలు నును లేత చిగురుటాకు మల్లే ఎప్పటికీ మనసులో తాజాగా ఉంటాయి.

మధ్యాహ్నం వేళ గండిచర అనే ప్రాంతానికి చేరాం. ఇక్కడ జవాన్లకు మలేరియా చికిత్స అందించటానికి చిన్నపాటి హాస్పటల్, అంబులెన్స్ ఉన్నాయి. త్రిపుర అడవుల్లో ప్రాణాంతక సెరిబ్రల్ మలేరియా దోమలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులు ఈ దోమల ఉత్పత్తికి అనుకూలంగా ఉండటమే ప్రధాన కారణం. నేను వెళ్లినప్పుడు ఒక జవాను మలేరియా పాజిటివ్ రిపోర్ట్‌తో అడ్మిట్ అయ్యి ఉన్నారు. ఈ మధ్య కాలంలో మలేరియా బారిన పడి ప్రాణాలు పోయిన ఘటనలు లేవు కాని రెండేళ్ళ క్రితం వరకు దోమకాటుకు గురై జవాన్లు చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు కూడా ఏటా పదుల సంఖ్యలో మలేరియా బారిన పడుతున్నారు త్రిపుర అడవి సరిహద్దుల్లో పహారా కాస్తున్న జవాన్లు. సాధారణ మలేరియా కంటే మెదడు మీద ప్రత్యక్షంగా ప్రభావం చూపే సెరిబ్రల్ మలేరియా మరింత ప్రమాదకరమైంది. సమయానికి వైద్యం అందకపోతే రోగి కోమాలోకి వెళ్లిపోతారు. ఆ తర్వాత ప్రాణాపాయం సంభవిస్తుంది. అగర్తలా నుంచి రావటానికి ఇన్ని గంటలు పట్టింది కదా ఏదైనా ఎమర్జెన్సీ అయితే ఎలా అని అడిగాను అక్కడి మెడికల్ ఆఫీసర్‌ను. పరిస్థితి సీరియస్ అయితే జవాన్లను హెలికాప్టర్‌లో అగర్తలాకు తరలించి వైద్యం అందిస్తామని చెప్పారు. ఆయన పేరు డాక్టర్ అమ్లాన్ దబర్మా. పేరులానే ఆయన నేపథ్యం కూడా నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. త్రిపురలోని స్థానిక గిరిజన తెగకు చెందిన వ్యక్తి. ఇక్కడి కొండల్లో త్రిపుర స్థానిక గిరిజన తెగలు ఉంటాయి. దాదాపు 19 రకాల తెగలున్నాయి. త్రిపుర, ఛక్మా, డెబర్మా, రియాంగ్, జమాతియా, మోగ్స్ వాటిలో కొన్ని. తెగలను బట్టి వారి మాత భాషలూ వేరుగానే ఉంటాయి. తుయిపురా అనే తెగ నుంచే రాజ్యం ఏర్పడటం వల్లనే త్రిపుర అనే పేరు వచ్చిందనే ఒక వాదన ఉంది. గోదక్ అంటే వెదురు చెట్టు. వెదురు మొక్కలతో చేసే కూరను స్థానిక గిరిజనులు చాలా ఇష్టంగా తింటారు అని అమ్లాన్ చెప్పారు. మన నల్లమల అడవుల్లోని గిరిజనులు కూడా వెదురు మొక్కల చిగురుతో వంటలు చేసుకోవటం నాకు తెలుసు. బహుశా ఏ ప్రాంతం అయినా అడవి బిడ్డల మౌలిక అలవాట్లు ఒకటే అయి ఉంటాయి అనిపించింది. ఫాబ్రా, రీసా అనే వస్త్రాలు ధరిస్తారు వీరు.

గండిచర దాటి అడవిలో ఇంకా ముందుకు వెళ్లాం. ఆవల బంగ్లాదేశ్ సరిహద్దు చిట్టగాంగ్ కిందకు వస్తుంది. అడవి దారి వెంబడి జవాన్లు పహారా కాస్తూ కనిపించారు. అందరూ ముఖం కూడా కనిపించకుండా టోపీతో కలిపి కుట్టేసి ఉన్న నెట్ (వల)తో ఉన్నారు. వారితో పాటు రక్షణ కోసం నేను కూడా అలాంటిదే ధరించాల్సి వచ్చింది. వళ్లంతా కప్పేసుకోగా అరచేతులు మాత్రం మిగిలాయి. అరచేతులకు కూడా దోమ కాటు నుంచి రక్షించే క్రీమ్ ఇచ్చారు రాసుకోమని. కాళ్ళకు లాంగ్ బూట్స్. వాటన్నింటితో కాసేపు అడవిలో నడిచే సరికి ఊపిరి ఆడనట్లు అనిపించింది నాకు. కొంత మంది జవాన్లు కాయిల్స్, బొగ్గులతో పొగ పెట్టిన చిన్న కుంపట్లు వంటివి పట్టుకున్నారు. ఆ పొగ వల్ల దోమలు దగ్గరకు రావన్నమాట. కొంత మంది దగ్గర ఆయుధంతో పాటు చేతి కర్రలున్నాయి. పాములో, పురుగో–పుట్రో తారసపడితే రక్షణగా లేదంటే అడ్డువచ్చిన పొదలు, మొక్కలు నెట్టుకుంటూ ముందుకు వెళ్ళటానికి ఈ ఏర్పాటు అని చెప్పారు జవాన్లు. కొంత మంది దగ్గర చిన్న పాకెట్లలో ఉప్పు కూడా ఉంది. జలగలు కూడా ఈ అడవుల్లో ఎక్కువే ఉంటాయి. అవి హఠాత్తుగా పట్టుకుంటే ఉప్పు రాయటం ద్వారా విష ప్రభావం పడకుండా అన్నమాట. ఎప్పుడు ఎటు నుంచి ఏ ప్రమాదం పొంచుకొస్తుందో ఊహించలేని పరిస్థితుల్లో విధి నిర్వహణ అనే మాట నాకు చాలా కష్టంగా అనిపించింది. మన దగ్గర ఉద్యోగాలు, మనం పడే ఆపసోపాలు గుర్తుకు వచ్చాయి. వర్షాకాలంలో ఈ అడవిలో పరిస్థితులు మరీ ఘోరంగా ఉంటాయి. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా సరిహద్దు పహారా మాత్రం కొనసాగుతూనే ఉంటుంది. సాయంత్రం నాలుగున్నర, ఐదు గంటలకే ఇక్కడ చీకట్లు ముసురుకున్నాయి. ఏడు గంటలకు చిమ్మచీకటే. రాత్రి వేళప్పుడు అడవిలో ఎలా ఉంటారో అనే ఆసక్తి కొద్దీ నేను కూడా అక్కడే ఉండిపోయాను. ఈ అడవి ప్రయాణంలో నన్ను బాగా ఆలోచనల్లో ముంచేసిన అంశం ...జవాన్ల ఒంటరితనం. చుట్టూ అడవి, చెట్టు–చేమ, రాళ్ళు–రప్పలు మినహా ఇంకేమి ఉండదు. ప్రమాదాల సంగతి పక్కన పెడితే అలా ఒక్కరే తుపాకి పట్టుకుని గంటల కొద్దీ ఆ అడవిని చూస్తూ నిలబడటం మానసికంగా ఎంత ఘర్షణకు లోనవుతారో కదా అనిపించింది. రాత్రుళ్ళు మాత్రం పహారాకు స్నేహితుల జంట పేరుతో బాధ్యతలు అప్పగిస్తారు. అంటే ఏ పని అయినా ఇద్దరు కలిసి చేస్తారన్నమాట. జవాన్ల దగ్గర టార్చ్ లైట్లు, చీకట్లో కూడా చూడగలిగే అధునాతన పరికరాలుంటాయి. ఎన్ని ఉన్నా కన్ను పొడిచినా కనిపించని ఆ చీకట్లో , మన గుండె కొట్టుకోవటం మనకే వినిపించే ఆ నిశ్శబ్ద అడవిలో విధి నిర్వహణకు గుండెల నిండా ధైర్యమే కాదు దేశం పట్ల వెలకట్టలేని ప్రేమ ఉండాల్సిందే.

వీటన్నింటి కంటే మరింత కఠిన పరిస్థితుల పహారా కూడా ఉంటుంది. ఎయిర్ డ్రాప్ బీఓపీలు అంటారు. అంటే కాలినడకన కూడా చేరుకోలేని సరిహద్దు ప్రాంతాల పహారా అన్నమాట. ఇలాంటి చోట్ల జవాన్లను సరిహద్దు పాయింట్ దగ్గర హెలికాప్టర్లలో తరలిస్తారు. వర్షాకాలంలో ఇటువంటి పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి. వారం, పది రోజులకు సరిపడా ఆహారం కూడా అందిస్తారు. నిర్దేశించిన రోజుల పాటు జవాన్ల బృందం అక్కడ విధి నిర్వహణ చేస్తుంది. తర్వాత ఈ టీమ్‌ను హెలికాప్టర్ ద్వారానే తీసుకువస్తారు. వారి స్థానంలో మరో బందం వెళ్తుంది. ప్రపంచంతో సంబంధాలు లేనట్లుండే ఆ వాతావరణంలో ఉండాలంటే శారీరకంగానే కాదు మానసికంగా కూడా దృఢంగా ఉండాలి. ఇండో–బంగ్లా సరిహద్దుల్లో తీవ్రవాదం, వేర్పాటు వాద శక్తుల ప్రభావం ఎక్కువ. సీమాంతర స్మగ్లింగ్ కూడా ఎక్కువగా జరుగుతుంది. అడవి చెప్పిన ఊసులు విని ఆ రాత్రి వేళ, కటిక చీకట్లో తిరుగు ప్రయాణం అయ్యాను.

- రెహనా, 9010234023



అంతరగంగ అందాలు

సాహస క్రీడాకారులకు అంతరగంగ ప్రదేశం బాగా నచ్చుతుంది. అంతరగంగ అంటే నిరంతరం ప్రవహించే నీరు. ఇది కర్నాటకలోని కోలార్ జిల్లాకు తూర్పు భాగంలో కొండలపై ఉంది. ఈ ప్రవాహం పెద్ద పెద్ద రాళ్ళ మధ్య నుండి ప్రవహిస్తూ కొండల మీద నుండి దుముకుతుంది. ఈ కొండ చరియల శ్రేణిపై దట్టమైన అడవి కూడా ఉంది. అంతరగంగ అందాలు దాని రాతి నిర్మాణాలలోను, గుహల లోను ఉన్నాయి. సాహస క్రీడలు ఇష్టపడేవారికి ఈ ప్రదేశం మరువలేని అనుభూతులను ఇస్తుంది. అలాగే ట్రెక్కింగ్ చేసే వారికి కొండ మీదకు ఎక్కాలన్నా... కింది భాగానికి చేరుకోవాలన్నా చాలా తక్కువ సమయం పడుతుంది. ఈ ప్రదేశంలో మతపరమైన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది. సెలవు రోజుల్లోనే కాదు నిరంతర ప్రవాహాన్ని, పురాతన దేవాలయాలను దర్శిస్తుంటారు పర్యాటకులు. వాస్తవానికి ఈ ప్రవాహం దేవాలయంలో ఒక భాగమైన ఒక రాతి ఎద్దు నోటికి వెళ్లి ఆగిపోతుంది.

ఈ కొండలలో అంతరగంగ గుహలు కూడా ఉన్నాయి. ఇవి అగ్ని పర్వతాల విస్ఫోటనం తర్వాత ఏర్పడ్డాయని చెబుతారు స్థానికులు. కాలక్రమంలో రాళ్ళు కరిగి గుహలుగా మారాయి. ఈ గుహలు పర్యాటకులకు ఆసక్తి కలిగిస్తాయి. కొన్ని గుహలలోకి సందర్శకులు పాక్కుంటూ వెళ్లవలసి వస్తుంది. ఈ ప్రాంతంలో గుహలే కాకుండా కొన్ని పురాతన దేవాలయాలు, మత కేంద్రాలను కూడా సందర్శించవచ్చు. బెంగుళూరుకు 70 కిలో మీటర్ల దూరంలో ఉంది. ట్రెక్కింగ్, రోపింగ్ వంటివి చేయవచ్చు. కొండల మధ్యలో నుంచి నీటి ప్రవాహాలు ఆనందాన్ని కలిగిస్తాయి. ఇక్కడి వాతావరణం నిరంతరం చల్లగా, ఆహ్లాదభరితంగా ఉంటుంది. ⌘



సిల్క్ సిటీ...



రామానగరాన్ని 'సిల్క్ సిటీ' అని అంటారు. ఇది బెంగుళూరుకు నైరుతి దిశగా 58 కిలో మీటర్ల దూరంలో ఉంది. రామానగరం జిల్లాకు ప్రధాన నగరం. కర్నాటక మాదిరిగానే... గంగాలు, చోళులు, హొయసలులు, మైసూరు పాలకులచే పాలించబడింది. 1970 లలో ఈ ప్రాంతంలో సినిమా షటింగ్‌లు బాగా జరగడం వల్ల రామానగరం బాగా పేరుగాంచింది. రామానగరం పెద్ద కొండ ప్రాంతం. ఏడు పెద్ద పెద్ద కొండలు ఉంటాయి. అవి శివరామగిరి, సోమగిరి, క్రిష్టగిరి, యతిరాజగిరి, రేవణ్ణ సిద్ధేవ్వర, సిడిలకల్లు, జల సిద్ధేశ్వర. ఈ నగరంలో పట్టు పరిశ్రమలు అధికంగా ఉండటంతో దీన్ని 'సిల్క్ సిటీ' అని అంటారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మైసూరు సిల్క్ చీరలు రామానగరం నుంచి తయారైన పట్టుతోనే తయారు చేయబడతాయి.

ఈ కొండ ప్రాంతాలు పక్షులకు నివాస స్థలాలు. పక్షుల నివాసం కావడం వలన ప్రకృతి ప్రియులు ఇక్కడకు వచ్చి పరవశించి పోతారు. ఈ ప్రదేశంలో కర్నాటకలోని జానపద కళలు, సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. చుట్టూ కొండలుండటం వలన, పర్వతారోహకులకు ఇది ఒక స్వర్గంగా ఉంటుంది. ఈ కారణంగా ఇక్కడ టూరిజం బాగా వ్యాప్తి చెందింది. బెంగుళూరు, మైసూరు జాతీయ రహదారి పై ఉంది. ఈ రెండు నగరాల నుండి పర్యాటకులు రామానగరాన్ని చెరుకోవచ్చు. ⌘

ఈ శీర్షిక మీదే..

మీరు ఎన్నో ప్రదేశాలు చూసి ఉంటారు. మీ అనుభూతులను, ప్రయాణంలో ఎదురైన అనుభవాలను జరదేఖో పాఠకులతో పంచుకోండి.. jaradekhont@gmail.com


మా చిరునామా..

నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020

అంద చందాల నృత్యగ్రామ్...

ప్రకృతి ఒడిలో దాగి ఉన్న అందమైన ప్రదేశం నృత్యగ్రామ్. ఇది బెంగుళూరు లోని హీసరఘట్ట గ్రామానికి సమీపంలో ఉన్న ప్రదేశం. దీని చుట్టూ పరిసరాలు ఎంతో అద్భుతంగా, కళాత్మకంగా ఉంటాయి. బెంగుళూరు కు సుమారు 35 కిలో మీటర్ల దూరంలో నృత్యగ్రామ్ ఉంటుంది. ఈ గ్రామాన్ని ప్రసిద్ధ ఒడిస్సి నృత్యకారిణి ప్రొతిమా బేడి స్థాపించింది. ప్రాచీన గురుకుల సంప్రదాయ రీతిలో నృత్యాన్ని బోధించాలనే మంచి ఆలోచనతో ఆమె ఈ గ్రామాన్ని స్థాపించారు. నృత్యగ్రామ్‌లో బోధించే నాట్యాలు ఎంతో ప్రసిద్ధి చెందినవి. ఈ గ్రామం సహజ అందాలను కలిగి ఉంటుంది. గ్రామ నిర్మాణానికి వాడిన వస్తువులను, తయారీ విధానాన్ని చూసి ఎంతటి వారైనా సరే మంత్ర ముగ్ధులు కావాల్సిందే !

నృత్యగ్రామ్‌ను ప్రఖ్యాత శిల్పి గెరార్డ్ డా కున్హా రూపొందించారు. బయటి ప్రదేశాలు ఆకు పచ్చగా, మట్టి నిర్మిత భవనాలు ఈ నృత్యగ్రామ్‌కు గ్రామీణ శోభను కల్పిస్తాయి. నృత్యగ్రామ్‌ను సందర్శించాలంటే ! వసంత హబ్బ పండుగ సమయంలో దర్శించాలి. ఈ పండుగ వసంతఋతువులో జరుపుతారు. ఈ సమయంలోనే ప్రపంచవ్యాప్త కళాకారులు ఇక్కడకు వచ్చి పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించుకుంటారు. నృత్యగ్రామ్ సందర్శించే వారికి హీసరఘట్ట రిజర్వాయర్ చూసే అవకాశం కూడా ఉంటుంది. ఈ రిజర్వాయర్ నృత్య గ్రామానికి సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. ఇది మానవ నిర్మిత సరస్సు. సుమారు 1124 ఎకరాల విస్తీర్ణంలో 1894 లో నిర్మించారు. ముఖ్యంగా ఆది, సోమ వారాలలో నృత్యగ్రామ్ మూసివేయబడుతుంది. పర్యాటక ప్రియులు వారాంతపు సెలవుల్లో తప్పక చూడవలసిన ప్రదేశం. ⌘





'ఉపఖండపు పిచ్‌లపై అశ్విన్ సామర్థ్యంపై ఎలాంటి అనుమానాల్లేవ్. జట్టులో జరిగే పరిణామాలు మాకు బాగా తెలుసు. టెస్టుల్లో అశ్విన్ స్థానానికి వచ్చిన ఢోకా లేదు. కానీ దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ పిచ్‌లు స్పిన్‌కు పెద్దగా సహకరించవు. ఇక్కడే అశ్విన్ గురించి ఆలోచన. ప్రపంచకప్ సైతం ఇంగ్లాండ్‌లో జరుగుతుండటంతో కుల్‌దీప్ యాదవ్ లేదా ఇతర యువ స్పిన్నర్లను సానపట్టే కార్యక్రమం జరుగుతోందని భావించవచ్చు'

- సౌరవ్ గంగూలీ, భారత మాజీ కెప్టెన్

విశ్రాంతి కాదు వేటు!

- ఆఫ్ స్పిన్నర్ అశ్విన్‌ను పక్కనపెట్టడంపై అనుమానాలు
- వన్డే జట్టు నుంచి తప్పించడానికి రంగం సిద్ధం?

శ్రీలంకతో వన్డే సిరీస్‌కు స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు విశ్రాంతి. స్వదేశీ టెస్టు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ట్రంప్‌కార్డ్ ఆటగాడికి విశ్రాంతి ఇచ్చినట్టు సెలక్షన్ కమిటీ వివరణ. ఇక్కడి వరకూ బాగానే ఉంది. కానీ.. సెలక్టర్లు విశ్రాంతి ఇచ్చిన ఆటగాడు నేరుగా కౌంటీ క్రికెట్‌లో ఆడేందుకు వెళ్లడం ఏంటీ? కౌంటీ క్రికెట్‌లో ఆడితే విశ్రాంతి లభించినట్టా? భారత జట్టు సెలక్షన్ ప్రక్రియలో జరుగుతున్న ఈ పరిణామం దేనికి సంకేతం? 2019 ప్రపంచకప్ ప్రణాళికలో భాగంగానే ప్రసాద్ బృందం ఇది చేస్తున్నట్లా?!.

శ్రీనివాస్ దాస్ మంతటి

మిషన్ 2019 ప్రపంచకప్. భారత క్రికెట్ జట్టులో ప్రస్తుతం వినిపిస్తోన్న ఏకైక మంత్రం. టెస్టుల్లో వరుస సిరీస్ విజయాలతో జోరుమీదున్న కోహ్లిసేన.. వన్డేల్లో ప్రపంచకప్ విజయం దిశగా రెండేండ్ల ముందు నుంచే వ్యూహం సిద్ధం చేసుకుంటోంది. ఈ దిశగా 15 మంది బృందంలోని ఆటగాళ్లందరూ ప్రమాణిక ఫిట్‌నెస్ కల్గిఉండటం, ఇంగ్లీష్ పిచ్‌లపై మ్యాచ్‌లను గెలిపించగల సత్తా కల్గి ఉండటం, ఫీల్డింగ్‌లో పాదరసంలా కదలగల నైపుణ్యం సహా పలు అంశాలను గీటురాయిగా పెట్టుకున్నది. ఈ క్రమంలో 2019 ప్రపంచకప్ లక్ష్యంగా జట్టును పునర్మించే యజ్ఞంలో చేస్తోంది. దిగ్గజ కెప్టెన్, అన్ని ఐసీసీ టోర్నీలను నెగ్గిన మహేంద్రసింగ్ ధోనిపైనా ఓ నిర్ణయం తీసుకునేలా కనిపిస్తోంది!. సీనియర్లు యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలకు ఫిట్‌నెస్ పేరుతో ఇప్పటికే చెక్ పెట్టేసింది!. భారత టెస్టు విజయాల్లో కీలక భాగస్వామి, టీమ్ ఇండియా ట్రంప్‌కార్డ్ రవిచంద్రన్ అశ్విన్‌కు శ్రీలంకతో వన్డే సిరీస్‌కు విశ్రాంతి ఇవ్వటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిషన్ 2019 ప్రపంచకప్‌లో భాగంగానే సీనియర్ స్పిన్నర్ అశ్విన్‌ను విశ్రాంతి పేరిట తప్పించి.. యువ స్పిన్నర్లకు అవకాశం కల్పిస్తున్నట్టు క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. శ్రీలంక సిరీస్‌లో విశ్రాంతి లభించిన రవిచంద్రన్ అశ్విన్ నేరుగా ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్‌లో ఆడేందుకు లండన్ పయనం కావటం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది.

విదేశీ పిచ్‌లపై పనికిరాడనే? : టెస్టుల్లో రవిచంద్రన్ అశ్విన్ వికెట్ల వేటపై ఎవరికీ ఎలాంటి అనుమానాల్లేవ్. అత్యంత వేగవంతంగా 250 వికెట్లు కూల్చిన ఘనత వహించిన అశ్విన్.. ఉపఖండపు పిచ్‌లపై తన ట్రేడ్‌మార్క్‌ను చాటుకున్నాడు. కానీ విదేశీ పిచ్‌ల విషయానికొచ్చే సరికి అశ్విన్ సామర్థ్యంపై వేలెత్తి చూపాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఇటీవల ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలోనూ అశ్విన్ విఫలమయ్యాడు. 2019 ప్రపంచకప్ సైతం ఇంగ్లాండ్‌లోనే జరుగనున్న నేపథ్యంలో స్పిన్‌కు అనుకూలించని పిచ్‌లపై వికెట్లు కూల్చగల స్పిన్నర్ల వేటలో సెలక్టర్లు పడ్డారు. ఈ క్రమంలోనే చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్, లెఫ్టార్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్, లెగ్ స్పిన్నర్ యుజ్వేందర్ చాహల్‌లకు వీలైనన్ని అవకాశాలు ఇచ్చేందుకు మొగ్గుచూపుతోంది. కొత్త కూర్పు ప్రయోగం కోసం వీలైతే కొన్ని మ్యాచులు ఓడేందుకు సైతం సిద్ధమని కెప్టెన్ కోహ్లి స్వయంగా ప్రకటించాడు. 2019 ప్రపంచకప్ సన్నాహకంలో సెలక్టర్ల ఉద్దేశానికి ఇది అద్దం పడుతోంది. ఇంగ్లీష్ పరిస్థితుల్లో రెచ్చిపోయే సీమర్లను జట్టుతో కొనసాగిస్తూనే... స్పిన్ విభాగంలో వికెట్ల వీరుడి కోసం అన్వేషణ సాగుతోంది. అశ్విన్ విదేశీ పిచ్‌లపై బంతితోనూ, బ్యాట్‌తోనూ నమ్మకముంచదగిన ఆటగాడు కాదు!. ఫీల్డింగ్‌లోనూ అతడి అవసరం అంతంతే. కానీ రవీంద్ర జడేజా బ్యాట్‌తో రాణించగలడు, జట్టులో అత్యుత్తమ ఫీల్డర్. దీంతో జడేజాపై ఇప్పటికిప్పుడే ఏమీ చెప్పలేకపోయినా.. అశ్విన్‌ను వన్డే జట్టు నుంచి సాగనంపేందుకు రంగం సిద్ధమైందని చెప్పవచ్చు. ఈ విషయాన్ని ముందుగానే గుర్తించినట్టు అశ్విన్.. ప్రపంచకప్ వేదిక ఇంగ్లాండ్‌లో జరిగే కౌంటీ క్రికెట్‌లో రాణిస్తే మళ్లీ సెలక్టర్ల విశ్వాసం పొందవచ్చని అక్కడికి వెళుతున్నాడు. ఆగస్టు 28న కౌంటీ క్రికెట్‌లో అరంగ్రేటం చేయనున్న అశ్విన్.. భారత వన్డే జట్టులో తన భవిష్యత్‌ను నిలుపుకుంటాడో లేదా ఆసక్తికరం.



రవిచంద్రన్ అశ్విన్



'అశ్విన్‌కు విశ్రాంతి ఇచ్చారా, జట్టు నుంచి తప్పించారా అనే విషయంపై స్పష్టంగా చెప్పలేను. అశ్విన్‌కు విశ్రాంతి ఇచ్చినట్టు వార్తలొచ్చాయి. కానీ ఇదే సమయంలో అతడు ఇంగ్లీష్ కౌంటీల్లో ఆడేందుకు వెళ్తున్నాడు. అతడికి ఏ విధమైన విశ్రాంతి ఇస్తున్నారనేది నాకు తెలియదు. ఇది విశ్రాంతి అనుకోవాలా వేటు అనుకోవాలో చెప్పలేను'

- హర్భజన్ సింగ్, భారత ఆటగాడు



పి.వి సింధు

2017 బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్

అగ్రశ్రేణి షట్లర్ సైనా నెహ్వాల్ తొలి పోరు నేడే

ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రెండో రోజూ భారత షట్లర్ల హవా కొనసాగుతోంది. తొలి రోజు శ్రీకాంత్ మెరువగా, రెండో రోజు స్టార్ షట్లర్ పి.వి సింధు జోరందుకున్నది. కొరియా అమ్మాయిపై ఏకపక్ష విజయంతో ప్రీ క్వార్టర్స్‌లో కాలుమోపింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి, ప్రణవ్‌లు సైతం ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు.

ప్రీ క్వార్టర్స్‌లో సింధు

కొరియా షట్లర్‌పై మెరుపు విజయం

- మిక్స్‌డ్‌లో సిక్కిరెడ్డి, ప్రణవ్ జోరు
- సాయిప్రణీత్, అజయ్ ముందంజ

నవతెలంగాణ-గ్లాస్గో

భారత అగ్రశ్రేణి షట్లర్, రియో ఒలింపిక్స్ స్టార్ పి.వి సింధు ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో బై లభించగా, రెండో రౌండ్లో ఏకపక్ష విజయంతో ప్రీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. వరల్డ్ నెం.42 కిమ్ హో మిన్‌పై నాల్గో సీడ్ సింధు వరుస గేముల్లో గెలుపొందింది. 21-16, 21-14తో 49 నిమిషాల్లోనే తొలి విజయం నమోదు చేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి, ప్రణవ్ జెర్రీ చోప్రా జంట సైతం ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నది. 15వ సీడ్ ప్రజక్త సావంత్ (భారత్), యోగేంద్రన్ క్రిష్టన్ (మలేషియా) జోడీపై 21-12, 21-19తో గెలుపొంది ప్రీ క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో బి. సాయిప్రణీత్, అజయ్ జయరాంలు తొలి రౌండ్లో సాధికారిక విజయాలు నమోదు చేసి టోర్నీలో ముందంజ వేశారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బి. సుమీత్ రెడ్డి, అశ్విని పొన్నప్ప జోడీ సహా సాత్విక్ సాయిరాజ్, మనీశ జంటలకు చుక్కెదురైంది. 17-21, 21-18, 5-21తో సుమీత్, అశ్విని జంట చైనా జోడీ చేతిలో ఓటమిపాలయ్యింది. 20-22, 18-21తో డెన్మార్క్ జోడీ చేతిలో మనీశ, సాత్విక్‌లు ఓడిపోయారు. మహిళల సింగిల్స్‌లో రితు పర్ణ దాస్ ముందంజ వేయగా, అగ్రశ్రేణి షట్లర్ సైనా నెహ్వాల్ నేడు తొలి పరీక్ష ఎదుర్కొనున్నది.



సాయిప్రణీత్

సింధుకు ఎదురేది : మహిళల సింగిల్స్‌లో నాల్గో సీడ్ పి.వి సింధు రెండో రౌండ్ పోరులో అలవోక విజయం సాధించింది. వరల్డ్ నెం.42ను ఉక్కిరిబిక్కిరి చేసిన సింధు.. తొలి గేమ్‌లో వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించింది. కిమ్ హో మిన్ ఈ దశలో రెండు పాయింట్లు సాధించి 2-8తో పాయింట్ల ఖాతా తెరిచింది. కానీ విరామ సమయానికి 11-5తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచిన సింధు జోరు తగ్గలేదు. కిమ్ పోరాడినా 21-16తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లో 7-3తో ముందంజలో నిలిచిన సింధు 11-8తో బ్రేక్ టైమ్‌కు ఆధిక్యం కొనసాగించింది. ద్వితియార్థంలో కీమ్‌కు అవకాశం ఇవ్వకుండా 17-11తో గెలుపు లాంఛనం చేసుకున్నది. 49 నిమిషాల్లోనే ప్రీ క్వార్టర్స్ బెర్త్ బుక్ చేసుకున్న సింధు స్మార్ట్ స్మాష్‌లతో ఆకట్టుకున్నది. ఫిన్‌లాండ్ అమ్మాయితో పోరులో తొలి గేమ్‌లో 2-0తో కొనసాగుతున్న వేళ ప్రత్యర్థి రిటైర్డ్ హర్ట్ కావటంతో రితు పర్ణ దాస్ నేరుగా రెండో రౌండ్లోకి అడుగుపెట్టింది. పురుషుల సింగిల్స్‌లో బి. సాయిప్రణీత్ వరుస గేముల్లో నెగ్గినా.. రెండు గేముల్లోనూ ఆరంభంలో తడబడ్డాడు. రెండు గేముల్లోనూ విరామ సమయానికి 9-11తో వెనుకంజలో నిలిచిన సాయిప్రణీత్ ద్వితియార్థంలో పుంజుకున్నాడు. హాంగ్‌కాంగ్ ఆటగాడు వీనన్‌ను వెనక్కి నెట్టి 21-18, 21-17తో మ్యాచ్‌ను ముగించాడు. అజయ్ జయరాం 21-14, 21-10తో ఆస్ట్రియా ఆటగాడుపై అలవోక విజయం సాధించాడు. నేడు రెండో రౌండ్ పోరులో ఇంగ్లాండ్ ఆటగాడు రాజీవ్ ఒసెఫ్‌తో సమీర్ వర్మ ఆడనుండగా, ఆంటోని సినిసుక గింటింగ్ (ఇండోనేషియా)తో బి.సాయిప్రణీత్ పోరాడనున్నాడు. ఫ్రాన్స్ షట్లర్ లుకాస్ కొర్వీతో కిదాంబి శ్రీకాంత్ తలపడనుండగా, అజయ్ జయరాంతో నెదర్లాండ్స్ షట్లర్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

- ఐపీఎల్ మీడియా హక్కుల వేలం

రేసులో 20 కంపెనీలు

ముంబయి : అత్యంత ప్రజాదరణ, పాపులర్ స్పోర్ట్స్ లీగ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మీడియా హక్కుల రేసులో సుమారు 20 దిగ్గజ కంపెనీలు పోటీపడుతున్నాయి. బిడ్ దాఖలు చేసేందుకు గడువు సెప్టెంబర్ 1 వరకూ ఉన్నప్పటికీ.. ఇప్పటికే ఇన్విటేషన్ టు టెండర్ (ఐటీటీ)ను 20 కంపెనీలు కొనుగోలు చేసినట్టు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఆగష్టు 28 తుది గడువే అయినా.. బ్యాంకులకు వరుస సెలవులతో డెడ్‌లైన్‌ను పొడగించారు. ఇక మీడియా హక్కుల వేలానికి ఈ వేలంలో బిడ్లు ఆహ్వానించాలని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి సుప్రీం కోర్టులో పిటిషను దాఖలు చేశారు. దీంతో తదుపరి విచారణ సందర్భంగా బిడ్లను సుప్రీంకోర్టు ముందుంచనున్నారు. ఈ వేలం నిర్వహించడానికి ' క్రికెట్, బొగ్గు ఒకటి కాదు' అని బీసీసీఐ దీటుగా బదులిచ్చినా.. దీనిపై తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలోని త్రి సభ్య ధర్మాసనం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. టెలివిజన్ మీడియా హక్కులకు తోడు డిజిటల్ మీడియా హక్కులు రానున్న కాలంలో ప్రధాన పాత్ర పోషించనున్నాయి. దీంతో డిజిటల్ మీడియా హక్కులు, టెలివిజన్ మీడియా హక్కుల కోసం బడా కంపెనీలు ఐపీఎల వేలంలో పోటీపడుతున్నాయి.

ఇన్విటేషన్ టు టెండర్ కొనుగోలు చేసిన కంపెనీలు :
స్టార్ ఇండియా ప్రై.లిమిటెడ్, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్, అమెజాన్ సెల్లర్ సర్వీసెస్, రిలయన్స్ జియో డిజిటల్, యాహూ, ఫాలోవోన్ ఇంటరాక్టివ్ మీడియా, టైమ్స్ ఇంటర్నెట్ లిమిటెడ్, గల్ఫ్ డిటిహెచ్, సూపర్‌స్పోర్ట్ ఇంటర్నేషనల్, గ్రూప్ ఎం మీడియా ఇండియా, ఎకోనెట్ మీడియా గ్రూప్, స్కై యూకే, ఈఎస్‌పీఎన్ డిజిటల్ మీడియా, బిటీజీ లీగల్ సర్వీసెస్, బిటీ స్పోర్ట్, ట్వీట్టర్, ఫేస్‌బుక్, డిస్కవరి, ఎయిర్‌టెల్, డీఏజెడ్ఎన్ పర్‌ఫామ్ గ్రూప్.



- వర్ణ వివక్ష వ్యాఖ్యలు

బాయ్‌కాట్ క్షమాపణలు

లండన్ : ఇంగ్లాండ్, వెస్టిండీస్ తొలి డే నైట్ టెస్టు సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇంగ్లీష్ క్రికెట్ దిగ్గజం జెఫ్రీ బాయ్‌కాట్ క్షమాపణలు తెలిపాడు. టెస్టు మ్యాచ్‌ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక లంచ్ భేటీలో బాయ్‌కాట్ ఈ వ్యాఖ్యలు చేశాడు. బ్రిటీష్ రాణి బహుకరించే నైట్‌హుడ్ పురస్కారం మీకెందుకు రాలేదని అడిగిన ఓ ప్రశ్నకు బదులుగా.. ' నా పేరు రెండుసార్లు తిరస్కరించారు. నైట్‌హుడ్ రావాలంటే నా మొహం నలుపుగా ఉండాల్సిందేమో' అని బాయ్‌కాట్ అన్నారు. లంచ్ విందుకు హాజరైన కరీబియన్లు బాయ్‌కాట్ సమాధానికి ఇబ్బందికి లోనయ్యారు. వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజాలు సర్ వివ్ రిచర్డ్స్, సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్, సర్ అంబ్రూస్ సహా 11 మంది కరీబియన్ క్రికెటర్లకు బ్రిటీష్ ప్రభుత్వం నైట్‌హుడ్ పురస్కారాలతో గౌరవించింది. ఇంగ్లాండ్ క్రికెటర్లలో 2007లో ఇయాన్ బోథమ్‌కు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. నైట్‌హుడ్ పురస్కారం పొందిన వారు తమ పేరు ముందు 'సర్' జోడించుకుంటారు. ఇంగ్లాండ్ తరఫున 108 టెస్టులాడిన బాయ్‌కాట్.. వెస్టిండీస్‌పైనే 29 టెస్టుల్లో పోటీపడ్డాడు. ' సరదాగా సమావేశమైన విందు భేటీలో అడిగిన ఓ ప్రశ్నకు ఏమాత్రం అంగీకారం కాని సమాధానం ఇచ్చాను. నేను నేరం చేశానని కాదు, కానీ నా వ్యాఖ్యలు పూర్తిగా తప్పు. బేషరతుగా క్షమాపణలు చెబుతున్నాను. నా కెరీర్ సాంతం విండీస్ క్రికెట్‌ను అభిమానించాను. కరీబియన్ క్రికెటర్లపై నాకెంతో గౌరవం ఉంది' అని బాయ్‌కాట్ నష్టనివారణ చర్యలకు దిగాడు. ఇక ఈ లంచ్ విందు భేటీకి హాజరైన వారు రూ. 25,000 ప్రవేశ రసుముగా చెల్లించారు.

- క్రీడా పురస్కారాలు

దేవేంద్ర, సర్దార్‌లు ఖేల్‌రత్నాలు

17 మందికి అర్జున అవార్డులు
ఖరారు చేసిన కేంద్ర క్రీడా శాఖ



దేవేంద్ర
సర్దార్ సింగ్
సురేఖ

న్యూఢిల్లీ : భారత ప్రభుత్వ అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్నకు ఈ ఏడాది ఇద్దరు ఎంపికయ్యారు. అవార్డుల కమిటీ సిఫారసు చేసిన ఇద్దరు క్రీడాకారులకూ కేంద్ర క్రీడా శాఖ ఆమోదం తెలిపింది. దీంతో ఖేల్‌రత్న పురస్కారం అందుకోనున్న తొలి పారా అథ్లెట్‌గా దేవేంద్ర జజారియా నిలువనున్నాడు. హాకీ ఇండియా మాజీ కెప్టెన్, స్టార్ మిడ్‌ఫీల్డర్ సర్దార్ సింగ్ సైతం ఖేల్‌రత్న అందుకోనున్నాడు. ఈ మేరకు కేంద్ర క్రీడాశాఖ మంగళవారం అవార్డు గ్రహీతల జాబితాను విడుదల చేసింది. జావెలెన్ త్రోయర్ దేవేంద్ర జజారియా పారాలింపిక్స్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు సాధించాడు. సర్దార్ సింగ్ సారథిగా ఆసియా గేమ్స్‌లో ఓ స్వర్ణం, కాంస్యం నెగ్గాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం తీసుకొచ్చాడు. 2010, 2011లలో అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్ ఆల్ స్టార్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. క్రికెటర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, చటేశ్వర్ పుజారాలు అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. పారా అథ్లెట్లు మారియప్పన్, వరుణ్ సింగ్ భాటీ సహా హాకీ ఆటగాడు ఎస్.వి సునీల్‌లు సైతం అర్జున అవార్డులు అందుకోనున్నారు. ఖేల్‌రత్న గ్రహీతలు రూ. 7.5 లక్షల నగదు ప్రోత్సాహం సహా ప్రశంసా పత్రం, మెమెంటో అందుకుంటారు. అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీతలకు మెమెంటో, ప్రశంసా పత్రం సహా రూ. 5 లక్షల నగదు ప్రోత్సాహం ఇస్తారు. ఆగస్టు 29న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

రాజీవ్ ఖేల్‌రత్న : దేవేంద్ర జజారియా (పారా అథ్లెట్), సర్దార్ సింగ్ (హాకీ)

అర్జున అవార్డులు : వి.జె సురేఖ (ఆర్చరీ), ఖుష్బీర్‌కౌర్ (అథ్లెటిక్స్), అరోకియ రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), లక్ష్మం దేబెంద్ర సింగ్ (బాక్సింగ్), చటేశ్వర్ పుజారా (క్రికెట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), వైనం బాంబెమ్ దేవి (ఫుట్‌బాల్), జస్వీర్ సింగ్ (కబడ్డీ), పి.ఎన్ ప్రకాశ్ (షూటింగ్), అమల్‌రాజ్ (టేబుల్ టెన్నిస్), సాకెత్ మైనేని (టెన్నిస్), సత్యవర్త్‌కడియన్ (రెజ్లింగ్), మారియప్పన్ (పారా అథ్లెట్), వరుణ్ సింగ్ భాటి (పారా అథ్లెట్)

ధ్యాన్‌చంద్ అవార్డులు (జీవనకాల సాఫల్యం) : భూపిందర్ సింగ్ (అథ్లెటిక్స్), సయ్యద్ షాహిద్ హకీం (ఫుట్‌బాల్), సుమరాయ్ టెటె (హాకీ)

ద్రోణాచార్య పురస్కారం : ఆర్. గాంధీ (అథ్లెటిక్స్), హీరా నంద్ కటారియా (కబడ్డీ), జి.ఎస్.ఎస్.వి ప్రసాద్ (కబడ్డీ, లైఫ్‌టైమ్), భూషణ్ మోహంతి (బాక్సింగ్, లైఫ్‌టైమ్), పి.ఎ రఫెల్ (హాకీ, లైఫ్‌టైమ్), సంజయ్ చక్రవర్తి (షూటింగ్, లైఫ్‌టైమ్), రోషన్ లాల్ (రెజ్లింగ్, లైఫ్‌టైమ్)

- ఖేల్ కబడ్డీ

గుజరాత్ జోరు

లక్నో : ప్రొ కబడ్డీలో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్ జోరు కొనసాగుతోంది. సీజన్‌లో ఏడో విజయం నమోదు చేసిన గుజరాత్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. లక్నోలో పుణెరి పల్టన్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 35-21తో 14 పాయింట్ల తేడాతో గెలుపొందింది. విదేశీ ఆటగాడు ఫజల్ అత్రచలి మెరుపులతో డిఫెన్స్‌లో దుమ్మురేపిన గుజరాత్ ఏకపక్ష విజయం సాధించింది. ఫజల్ తొమ్మిది టాకిల్స్‌తో అదరగొట్టాడు. సుఖేష్ హెగ్డే నాల్గు రైడ్ పాయింట్లతో ఆకట్టుకున్నాడు. పుణె తరఫున దీపక్ హుడా ఐదు రైడ్ పాయింట్లు, సందీప్ నర్వాల్ నాల్గు టాకిల్స్ చేసినా ప్రయోజనం లేకపోయింది. యూపీ యోధా, బెంగాల్ వారియర్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో వారియర్స్ విజయం సాధించింది. దీపక్ నర్వాల్ పది రైడ్ పాయింట్లు, సుర్జీత్ సింగ్ మూడు టాకిల్స్‌తో రాణించగా 32-31తో ఒక్క పాయింట్ తేడాతో బెంగాల్ గెలుపొందింది. యూపీ తరఫున నితిన్ తోమర్ 8 పాయింట్లు, సంతోష్ 3 టాకిల్స్ రాణించారు.



ప్రొ కబడ్డీలో నేడు

హర్యానా X ఢిల్లీ
రాత్రి 8 గంటలకు

యూపీ X తమిళనాడు
రాత్రి 9 గంటలకు

వేదిక : లక్నో

స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం

- ట్వీట్టర్ కామెంట్‌పై మిథాలీ ఫైర్

చెమటోడ్చాకే ఇక్కడికొచ్చా..

బెంగళూర్ : 2017 మహిళల ప్రపంచకప్ సందర్భంగా ఓ పాత్రికేయుడు అడిగిన ప్రశ్నకు దీటైన బదులిచ్చి క్రీడా ప్రపంచం ఆలోచించేలా చేసిన భారత జట్టు కెప్టెన్ మిథాలీరాజ్.. మరోమారు అలాంటి సమాధానమే ఇచ్చింది!. బెంగళూర్‌లో క్రికెట్ అకాడమీ ప్రారంభించేందుకు అక్కడికెళ్లిన మిథాలీరాజ్ ట్వీట్టర్‌లో ఓ ఫోటోను పంచుకున్నది. క్రికెటర్లు వేద కృష్ణమూర్తి, నూషిన్ అల్ ఖాదీర్, మమత మాబెన్‌లతో కూడిన ఫోటోను పోస్ట్ చేసింది. ఈ ఫోటోలో మిథాలీరాజ్ డ్రెస్ చెమటతో తడిసింది. దీన్ని గమనించిన ఓ నెటిజన్.. ఈ విషయాన్ని ఎత్తిచూపాడు. ' నేను ఇక్కడ ఉన్నానంటే అందుకు కారణం మైదానంలో చెమటోడ్చటమే. ఓ అకాడమీ ఆరంభించేందుకు మైదానంలో ఉన్నప్పుడు దీనికి ఫీల్ అవ్వాల్సిన అవసరం నాకు లేదు. నువ్వు ఎక్కడున్నావనేది కాదు, ఎక్కడి నుంచి వచ్చావ్ అనేది ముఖ్యం' అని మిథాలీరాజ్ దీటుగా బదులిచ్చింది. మిథాలీరాజ్ ట్వీట్టర్ పంచ్ సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

సెన్సెక్స్ ▲34	నిఫ్టీ ▲11	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు
31,291	9,765	64.10	రూ. 29,508	రూ. 42,600	హైదరాబాద్ 320, ఒక్కగుడ్డుకు 3.80, వరంగల్ 322, విజయవాడ 320, చెన్నై 355, ముంబయి 365






ఎయిర్‌టెల్ నుంచి 4జీ స్మార్ట్‌ఫోన్..!

జియోకి పోటీగా రూ.2500లకే..

న్యూఢిల్లీ: ప్రముఖ దేశీయ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ త్వరలో 4జీ స్మార్ట్ ఫోన్‌ను ఆవిష్కరించే యోచనలో ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్‌ను రూ.2,500లకే వినియోగదారులకు అందించనుందని తెలుస్తోంది. దీంతో ప్రత్యర్థి సంస్థ రిలయన్స్ జియోకి గట్టి పోటీ ఇవ్వనుందని సమాచారం. ఈ 4జీ స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు ఇప్పటికే లావా, కార్బన్ లాంటి స్మార్ట్‌ఫోన్ తయారీదారులతో ఎయిర్‌టెల్ జరిపిన చర్చలు తుది దశకు చేరుకున్నట్లు ప్రముఖ ఆంగ్ల పత్రిక ఒక కథనంలో తెలిపింది. కాగా పరిస్థితులు అనుకూలిస్తే ఈ దీపావళి నాటికి అందుబాటులోకి తేవాలని ఎయిర్‌టెల్ యోచిస్తుంది. ఈ కొత్త 4జీ ఫీచర్ ఫోన్‌ను పెద్ద స్క్రీన్‌తో పాటు మెరుగైన బ్యాటరీ, కెమెరాతో తీసుకురానుందని తెలిపింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై ఈ ఫోన్ పనిచేయడంతో పాటు వినియోగదారులకు యాప్స్ డౌన్‌లోడ్ చేసుకునే వీలు కల్పించనుంది. సబ్సిడీ లేకుండానే ఎయిర్‌టెల్ ఈ ఫోన్‌ను అందించనుంది. అయితే ఎక్కువ మొత్తంలో అపరిమిత డేటా, కాల్స్‌ను ఉచితంగా అందించి ఫోన్ ధర తక్కువయ్యే విధంగా చర్యలు తీసుకుంటుందని పేర్కొంది. మరోవైపు రిలయన్స్ జియో ఇటీవల ఆవిష్కరించిన 4జీ ఫీచర్ ఫోన్ విక్రయాలను సెప్టెంబర్‌లో ప్రారంభించనుంది.

జెబ్రోనిక్స్ నుంచి బ్లూటూత్ ఇయర్‌ఫోన్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ఐటీ, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ జెబ్రోనిక్స్ స్మార్ట్ పోర్టబుల్ బ్లూటూత్ మాడ్యూల్‌తో ఇయర్‌ఫోన్ (జెడ్ఈబీ-బీఈ380బీ)ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ బ్లూటూత్ మాడ్యూల్ జెడ్ఈబీ-బీఈ380బీతో ఎవైనా ఇయర్ ఫోన్ లేదా హెడ్‌ఫోన్‌ను వైర్‌లెస్‌గా ఉపయోగించవచ్చునని జెబ్రోనిక్స్ ఇండియా డైరెక్టర్ దిలీప్ దోషి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రొడక్టు తెలుపు, నలుపు రంగుల్లో లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సరికొత్త బ్లూటూత్ ఇయర్‌ఫోన్ ద్వారా తమ మార్కెట్ మరింత బలోపేతం కానుందని వివరించారు. ఈ ప్రొడక్టు సంగీత ప్రియులను ఆకట్టుకోవడంతో పాటు ముఖ్యంగా జాగింగ్ చేసేవారు, రన్నర్‌లు, ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ రిటైల్ స్టోర్లలో ఈ బ్లూటూత్ ఇయర్‌ఫోన్‌లు లభిస్తాయని కంపెనీ తెలిపింది.

వ్యాపారంలోకి మరో బాబా రవిశంకర్

ముంబయి: దేశంలో వరుసగా ఒక్కో బాబా వ్యాపారంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఇప్పటికే యోగా గురు రాందేవ్ బాబా పలు వ్యాపారాల్లో భారీగా సంపాదించడంతో పలువురు ఆయన బాటలో నడువాలని భావిస్తున్నారు. ఇదే క్రమంలో మరో ఆధ్యాత్మిక గురు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్, ఆయుర్వేదిక్ టూత్‌పేస్టులు, సబ్బులు విక్రయంలోకి వస్తున్నారు. ఇందుకోసం త్వరలోనే 1,000 రిటైల్ స్టోర్లను ఏర్పాటు చేయనున్నారని ఓ ఆంగ్ల పత్రిక ప్రత్యేక కథనం ప్రచురించింది. భారత్‌లో ఆయుర్వేదిక్ ఉత్పత్తులకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో రవిశంకర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అదే విధంగా క్లినిక్స్, ట్రీమెంట్‌మెంట్ కేంద్రాలను కూడా తెరువబోతున్నారట. ప్రస్తుత తయారీదార్లు అందిస్తున్న వాటికంటే భిన్నంగా తమ బ్రాండ్ ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నట్టు శ్రీశ్రీ ఆయుర్వేద ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ తేజ్ కట్పిటియా పేర్కొన్నారు. ఇందుకోసం "శ్రీశ్రీ తత్వ" బ్రాండెడ్ స్టోర్లను ప్రారంభించబోతున్నట్టు తెలిపారు.

జీఎస్టీతో 'వృద్ధి' మందగింపు..

జూన్ త్రైమాసికంలో 6.3 శాతమే

- పారిశ్రామికోత్పత్తి దిగాలు: రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనాలు



ముంబయి : మోడీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వల్ల వృద్ధి రేటు మందగించనుందనే అంచనాలు ఊపందుకున్నాయి. ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా ప్రకారం జీఎస్టీ వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికంలో వృద్ధి రేటు 6.3 శాతానికి మందగించనుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది. వ్యవసాయం, అడవులు, చేపల పెంపకం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ రంగ సేవల వృద్ధి రేటు 4.8 శాతానికి పరిమితం కావచ్చని ఇక్రా తన రిపోర్టులో పేర్కొంది. స్థూల కార్పొరేట్ పన్ను వసూళ్లు 4.8 శాతం పెరగొచ్చని పేర్కొంది. ఇక్రా రేటింగ్ అంచనాల ప్రకారం ఇప్పటికే వరుసగా పడిపోతున్న ఎగుమతులు, రూపాయి మారకం విలువ తరుగుదల తదితర పరిణామాలు వృద్ధిపై ప్రభావం చూపనున్నాయి. తొలి త్రైమాసికంలో ఒత్తిడిలో ఉన్న బ్యాంకింగ్, టెలికాం రంగాలు కూడా పెద్ద తోడ్పాటును ఇవ్వకపోవచ్చు.

కాగా ఇక్రా రిపోర్టు ప్రకారం క్రితం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో పారిశ్రామికోత్పత్తి ఏకంగా 3.9 శాతానికి పడిపోవచ్చు. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ రంగం 7.4 శాతం వృద్ధిని సాధించింది. ఆ సమయంలో తయారీ, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, నిర్మాణ రంగాలు మెరుగైన ప్రగతిని కనబర్చాయి. 2016-17 తొలి త్రైమాసికంలో 9 శాతం వృద్ధి సాధించిన సేవల రంగం క్రితం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధితో సరిపెట్టుకోనుందని ఇక్రా విశ్లేషించింది. ఆ కంపెనీల రాబడిలో బలహీన పరిణామాలే ఇందుకు కారణం. బ్యాంకులు, టెలికం రంగాలు ఒత్తిడిలో ఉన్నాయి. టోకు ద్రవ్యోల్బణం సూచీ గతేడాది జూన్ త్రైమాసికంలో -0.7 శాతంగా ఉండగా, గడిచిన త్రైమాసికంలో ఇది 2.3 శాతానికి ఎగిసింది. ఇది కూడా పలు రంగాలపై ప్రభావం చూపనుంది.

పన్ను సమస్యలు పరిష్కరించాలి : ఎంఎస్ఎంఈ వర్గాలు

ప్రభుత్వం అమలు చేస్తోన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లు జీఎస్టీ వల్ల ఇప్పటికీ పలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆల్ ఇండియా మాన్‌ఫాక్చరర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎంవో) ఆందోళన వ్యక్తం చేసింది. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది. జీఎస్టీఎన్ పోర్టల్‌తో అనుసంధానం క్లిష్టంగా మారిందని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి ఏఐఎంవో లేఖ రాసింది. ఆగస్టు 20 నుంచి 25వ తేదిల్లో జీఎస్టీ ఎన్ పోర్టల్ పన్ను చెల్లింపుదారుల ట్రాఫిక్ తాకిడితో సరిగా పనిచేయలేకపోయిందని ఇందులో తెలిపింది. ముఖ్యంగా జీఎస్‌టీఆర్-3బీ ఫారంలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని పేర్కొంది. పలువురి ఖాతాల నుంచి పన్ను చెల్లింపులు జరిపినప్పటికీ జీఎస్టీఎన్ పోర్టల్ పేజీలో తిరిగి చెల్లింపు సమాచారం లభించలేదని ఏఐఎంవో నేషనల్ ప్రెసిడెంట్ కెఈ రఘునాథన్ కేంద్రం దృష్టికి తెచ్చారు. కాగా ఇదే సమయంలో చెల్లింపులు జరగనట్టు చూపించిందన్నారు. పలు సమస్యలపై పలువురు వ్యాపారస్తులు హెల్ప్‌డెస్క్ ఫిర్యాదులు చేసినప్పటికీ దానికి సంబంధించిన రశీదు (ఎకనాలేడ్జ్‌మెంట్) ఇవ్వడం లేదన్నారు. ఇలాంటి పలు సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖను కోరుతున్నట్టు పేర్కొన్నారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించి, పరిశ్రమ కష్టాలను తగ్గించాలన్నారు.

మాక్స్ క్యూర్‌లో మెడికవర్‌కు 22% వాటా

- ఒప్పంద విలువ రూ.100 కోట్లు
- రెండేండ్లలో 51% వాటా స్వాధీనం
- 20 ఆసుపత్రులకు విస్తరణ లక్ష్యం
- వరంగల్‌లోనూ ఏర్పాటు..!



నవతెలంగాణ, వాణిజ్యవిభాగం: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తొమ్మిది ఆసుపత్రులు కలిగిన మాక్స్‌క్యూర్ గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్‌లో యూరప్‌కు చెందిన వైద్యసేవల సంస్థ మెడికవర్ 22 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టింది. కాగా వచ్చే రెండేండ్లలో ఈ వాటాను 51 శాతం పెంచుకోవడానికి మరో రూ.220 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం తొమ్మిది ఆస్పత్రులతో 1500 పడకల సామర్థ్యం కలిగి ఉన్న మాక్స్‌క్యూర్ వచ్చే రెండేండ్లలో 3000 పడకల సామర్థ్యానికి చేర్చాలని నిర్దేశించుకుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాక్స్‌క్యూర్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ అనీల్ క్రిష్ణ, మెడికవర్ చైర్మెన్ ఫ్రెడిక్ స్టెన్మో ఈ భాగస్వామ్య వివరాలను వెల్లడించారు. ఈ స్వాధీనం వల్ల భారత్‌లో మెడికవర్ బలోపేతానికి దోహదం చేయనుందని వారు అన్నారు. వచ్చే ఐదేండ్లలో దేశంలోనే టాప్-5 ఆసుపత్రుల్లో ఒక్కటిగా నిలుస్తామని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో ఆసుపత్రి పేరులోనూ మెడికవర్‌ను చేర్చనున్నామన్నారు. మాక్స్‌క్యూర్ సీఈవో హరిక్రిష్ణ మాట్లాడుతూ వచ్చే రెండేండ్లలో 20 ఆస్పత్రులకు విస్తరించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం రూ.500 కోట్ల పెట్టుబడులు అంచనా వేస్తున్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బెంగళూరు, చెన్నయ్, పూణెలో మూడు ఆస్పత్రులను తెరువనున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కాకినాడ, వరంగల్‌లో కూడా నూతన ఆసుపత్రులను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామన్నారు. కాగా ఢిల్లీ, గౌవతి లాంటి ఇతర నగరాలపై కూడా దృష్టి పెడుతున్నామని తెలిపారు. గతేడాది మ్యాక్స్ క్యూర్ గ్రూప్ టర్నోవర్ రూ.360 కోట్లు సాధించిదన్నారు. ఈ ఏడాది రూ.500 కోట్లు లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు.

జాన్సన్ అండ్ జాన్సన్‌కు భారీ జరిమానా!



లాస్‌ఏంజిల్స్: హెల్త్ కేర్ దిగ్గజం ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి భారీ జరిమానా పడింది. లాస్ ఏంజిల్స్ జ్యూరీ జాన్సన్ అండ్ జాన్సన్‌కు రికార్డు స్థాయిలో పెనాల్టీ విధించింది. కంపెనీకి చెందిన బేబీ టాల్కమ్ పౌడర్ వాడటంతో క్యాలిఫోర్నియాకు చెందిన ఈవా ఎచివెరియా అనే మహిళకు అండాశయ క్యాన్సర్ సోకిందని నమ్మిన కోర్టు ఆమెకు దాదాపు రూ.2700 కోట్లు (417 మిలియన్ల డాలర్లు) నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశాలను జారీ చేసింది. కాగా జాన్సన్‌కు చెందిన ఫేమస్ బేబీ టాల్కమ్ పౌడర్ అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతోందని చెబుతూ లాస్ ఏంజిల్స్ కోర్టు ఈ భారీ జరిమానా విధించినట్టుగా సమాచారం. టాల్కమ్ పౌడర్ వాడడం వల్ల వచ్చే క్యాన్సర్ ఇబ్బందుల గురించి జాన్సన్ కంపెనీ తమ ఉత్పత్తులపై హెచ్చరికలు చేయలేదని ఎచివెరియా ఆరోపించింది. 1950- 2016 వరకు ఆమె జాన్సన్ బేబీ టాల్కమ్‌ను వాడుతున్నట్టు తెలిపింది. తన లాంటి పరిస్థితులు మరోకరికి రాకుండా ఉండేందుకు ఆమె కోర్టును ఆశ్రయించినట్టు లాయర్ మార్క్ రాబిన్‌సన్ తెలిపారు. మరోవైపు ఈ తీర్పుపై జాన్సన్ అండ్ జాన్సన్ స్పందించింది. జ్యూరీ నిర్ణయంపై అప్పీల్ చేస్తామని కంపెనీ ప్రతినిధి కరోల్ గూడ్రిచ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గురుకుల పీడీ అభ్యర్థులకు షాక్

- మెయిన్స్ పరీక్ష రద్దు
- 7న తిరిగి నిర్వహణ : టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల పట్ల తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) డొల్లతనం మరోసారి బయటపడింది. గురుకుల ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ షాక్ ఇచ్చింది. వివిధ గురుకులాల్లో ప్రకటించిన పీడీ మెయిన్స్ రాతపరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించింది. లోపాన్ని ఆలస్యంగా గుర్తించిన టీఎస్‌పీఎస్సీ సరిదిద్దుకునేందుకు చర్యలు ప్రారంభించింది. గతనెల 18న జరిగిన గురుకుల పీడీ మెయిన్స్ రాతపరీక్షను రద్దు చేస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ పరీక్షను వచ్చేనెల 7న తిరిగి నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గతనెల 18న జరిగిన గురుకుల పీజీటీ, పీడీ రాతపరీక్షకు ఉదయం 1,912 మంది దరఖాస్తు చేయగా, 1,748 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 1,867 మందికిగాను 1,706 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఆ పరీక్షలో ఓ సిరీస్ ప్రశ్నాపత్రంలో ఒక పేజీ లేకుండానే అభ్యర్థులకు పరీక్ష నిర్వహించినట్టు టీఎస్‌పీఎస్సీ ఆలస్యంగా గుర్తించింది. అందుకే ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. పీడీ మెయిన్స్ రాసిన అభ్యర్థులు కీ కోసం ఎదురుచూస్తున్న వారికి టీఎస్‌పీఎస్సీ షాక్ ఇచ్చింది. ఫలితాలు వెలువడతాయని ఆశించిన వారికి పిడుగులాంటి నిర్ణయం వెలువడింది. ఇక పుస్తకాలకు స్వస్తి చెప్పి సంతోషంగా గడుపుతున్న పీడీ అభ్యర్థులు మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన పరిస్థితిని టీఎస్‌పీఎస్సీ కల్పించింది. గురుకులాల నోటిఫికేషన్ మొదలైనప్పటి నుంచి సమస్యలే ఉత్పన్నమవుతున్నాయి. అన్నీ అధిగమించి మెయిన్స్ రాసిన పీడీ అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ నిర్ణయం చుక్కలు చూపిస్తున్నది. ఈ వార్త తెలిసిన పీడీ అభ్యర్థులు లబోదిబోమంటున్నారు.

ఉపాధినివ్వని బతుకమ్మ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. అయితే ముందస్తు ప్రణాళిక లేకుండా హడావుడిగా గత మేలో ఆర్డర్లనిచ్చారు. రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డు కలిగున్న దాదాపు 90 లక్షల మంది యువతులు, మహిళలకు వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లతో కలిసి లెక్కలేశారు. ఇదే సమయంలో 18 సంవత్సరాలు నిండిన, ఆపై వయస్సున యువతులు, మహిళలకు ప్రింటెడ్ (రంగులద్దిన, అచ్చువేసిన) చీరెలను, పెద్దవారికి ప్లెయిన్ బోర్డర్ (అంచుతో కూడిన బూడిదరంగు) చీరెలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇంత భారీ సంఖ్యలో చీరెలను ఉత్పత్తి చేయాలనుకున్నప్పుడు జనవరిలోనే ఆర్డరివ్వాలని చేనేత, జౌళిశాఖకు చెందిన ఓ అధికారి చెప్పారు. అందుకు భిన్నంగా ప్రభుత్వం.. మేలో ఆర్డర్లనిచ్చిందని ఆయన వివరించారు. దీంతో కార్మికులు సకాలంలో కావాల్సినంత సంఖ్యలో ఉత్పత్తి చేయలేకపోయారని తెలిపారు.

ఆర్డర్లు తీసుకన్నది సగం మందే...

సిరిసిల్లతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు 24 వేల మరమగ్గాలున్నాయి. సుమారు 12 వేల మంది కార్మికులున్నారు. కానీ వీరిలో కేవలం సగం మందే బతుకమ్మ చీరెల ఆర్డర్లను తీసుకున్నారు. వీటికంటే మిగతా వస్త్రాల తయారీయే ఎక్కువగా గిట్టుబాటవుతుండటంతో వారు చీరెల ఆర్డర్లను తీసుకోవటానికి నిరాకరించినట్టు తెలిసింది. ఇదే సమయంలో గతంతో పోలిస్తే బతుకమ్మ చీరెల ఆర్డర్ల వల్ల తమకు కొంత కూలి పెరిగిన మాట వాస్తవమేనని సిరిసిల్లకు చెందిన అరికాల గణేశ్ అనే మరమగ్గం కార్మికుడు చెప్పాడు. గతంలో ఒక మీటర్ వస్త్రాన్ని తయారు



సిరిసిల్లలో తయారైన బతుకమ్మ ప్లెయిన్ చీరలను నిల్వచేసిన దృశ్యం

చేస్తే రూ.1.25 ఇచ్చేవారని వివరించారు. ఇప్పుడు ఈ కూలి రూ.2.25కు పెరిగిందని అన్నాడు. అయితే బతుకమ్మ చీరెల ఉత్పత్తి ఆగస్టుతో పూర్తవుతుండటంతో ఆ తర్వాత ఏం చేయాలో తెలియటం లేదని అంకారపు శ్రీను అనే మరో కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశారు.

సౌకర్యాల లేమి...

మరోవైపు ఆదరాబాదరాగా చీరెల ఆర్డర్లనిచ్చిన ప్రభుత్వం.. వాటికి అవసరమైన ప్రింటింగ్, ప్రాసెసింగ్, డైయింగ్ (రంగుల అద్దకం, ఆ తర్వాత చీరెలను చీరెలను ఆరబెట్టటం వగైరా..) గురించి పట్టించుకోలేదు. దీంతో రంగులు, అద్దకాల కోసం సిరిసిల్లలో తయారైన చీరెలను సూరత్, భీవండి, తమిళనాడుకు తరలించాల్సి వస్తున్నదని ఉమ్మడి కరీంనగర్ జిల్లా చేనేతశాఖకు చెందిన ఓ అధికారి వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియలకు సంబంధించిన యూనిట్లేవీ సిరిసిల్లలో లేవని ఆయన చెప్పారు. దీంతో ఇతర ప్రాంతాలకు చీరెలను పంపించి.. ప్రాసెసింగ్, ప్రింటింగ్, డైయింగ్ పూర్తి చేయటానికి చాలా సమయం తీసుకుంటున్నదని ఆయన వివరించారు.

గోడౌన్లలో ఏర్పాట్లు...

ఇప్పటి వరకూ తయారైన చీరెలను నిల్వ చేయటానికి వీలుగా చేనేత, జౌళిశాఖ.. వ్యవసాయశాఖను సంప్రదించింది. జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్ల గోదాముల్లో వీటిని బతుకమ్మ పండుగ వరకూ నిల్వ ఉంచుతారు. ఆ తర్వాత వీఆర్వో, గ్రామ మహిళా ప్రతినిధి, రేషన్ డీలర్‌తో కూడిన కమిటీ లబ్దిదారులను ఎంపిక చేసి బతుకమ్మ పండుగ సమయంలో పంపిణీ చేస్తారు. ఒక్కొక్కరికి ఒక్కో చీరె చొప్పున ఇంట్లో ఎంత మంది మహిళలుంటే అంత మందికి వీటిని పంపిణీ చేస్తారు. యువతులకు పంపిణీ చేసే ప్రింటెడ్ చీరె ఖరీదు రూ.220, పెద్దవారికి పంపిణీ చేసే చీరె ఖరీదు రూ.180 వరకూ ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి.

విభజన చట్టం మేరకే జలాల పంపకం

కృష్ణా నది యాజమాన్య బోర్డు

అమరావతి : విభజన చట్టంలో పేర్కొన్న వాటాల ఆధారంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కృష్ణా నది నీటిని పంచుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో మంగళవారం ఈ బోర్డు సమావేశమైంది. ఈ సందర్భంగా బోర్డు ఛైర్మన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాలతో పాటు నీటిని వినియోగించుకోవటంలో దిగువ రాష్ట్రాలనూ సమాన భాగస్వాములుగానే గుర్తించాలన్నారు. కర్ణాటకలోని ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉందని, దిగువ రాష్ట్రాలకు నీటిని విడుదల చేయాలని కేంద్రానికి బజాజ్ కమిటీ లేఖ రాయాల్సి ఉంటుందన్నారు. నీటి పంపకాలు, వివాదాలపై అపెక్స్ కమిటీని ఏర్పాటు చేయాలని రెండు తెలుగు రాష్ట్రాలూ ఇప్పటికే లేఖలు రాశాయన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. నీటి పంపకాలల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య స్వల్ప భేదాభిప్రాయాలున్నాయని తెలిపారు. రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల దిగువన తొలిదశలో 18 టెలిమెట్రీ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. రెండో దశలో మరో 29 ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి లభ్యత తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా ప్రోరేటా ఆధారంగానే ఇరు రాష్ట్రాలు పంచుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 400 క్యూసెక్కుల నీటిని తెలంగాణ తీసుకుంటోందని, సమాచార లోపం వల్ల కొన్నిసార్లు ఈ నీటి విడుదలలో ఏర్పడుతున్న ఆలస్యంతో వివాదాలు తలెత్తుతున్నాయని సభ్య కార్యదర్శి సమీర్ ఛటర్జీ తెలిపారు. సమావేశంలో ఏపీ, తెలంగాణకు చెందిన నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తేవాలి
అపెక్స్ కమిటీ సభ్యులు గోపాలకృష్ణ

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న జూరాల, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డు కిందకు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ అపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల గోపాలకృష్ణ, నాగార్జునసాగర్ కుడి, ఎడమ ప్రాజెక్టు కమిటీల చైర్మన్లు భుజంగరాయలు, వై పుల్లయ్య చౌదరిలు కోరారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశానికి విచ్చేసిన బోర్డు చైర్మన్ శ్రీవాస్తవను కలిసి ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రకారం ఎగువ రాష్ట్రాల నుంచి రావాల్సిన నీటిని సకాలంలో విడుదల చేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రధాన రెగ్యులేటర్ గుంటూరు జిల్లాలో ఉన్నందున దాని నిర్వహణ బాధ్యతను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించాలని కోరారు.

పంచాయతీ గోస

బి.బసవపున్నయ్య

'గ్రామ సీమలే దేశానికి పట్టుగొమ్మలు...' జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన ఈ మాటలను మన పాలకులు ఎప్పుడో గాలికొదిలేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే విషయాన్ని నొక్కిచెప్పారు. తాము అధికారంలోకొస్తే గ్రామాల రూపు రేఖల్ని మార్చేస్తామంటూ ఆయన వాగ్దానమిచ్చారు. అయితే సీఎం చెప్పిన మాటలు.. ఆచరణలో నీటి మూటలయ్యాయి. రాష్ట్రంలో గత మూడేండ్ల కాలంలో అత్యంత కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలు గాడి తప్పాయి. ఈ రెండు శాఖల్లో కలిపి దాదాపు మూడు వేల పోస్టులు ఖాళీగా ఉండటంతో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. పథకాల నిర్వహణ లోపభూయిష్టంగా తయారైంది. అనేకాంశాల్లో తెలంగాణ నెంబర్‌వన్ అంటూ ఊదరగొట్టే ప్రభుత్వ పెద్దలు ఖాళీ పోస్టుల భర్తీపై నోరు మెదపటం లేదు. దీంతో ప్రజలకు అత్యంత అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. పేదల పింఛన్ల దగ్గర నుంచి మొదలుపెడితే ఉపాధి హామీ పథకం, వాటర్‌షెడ్లు, సెర్ప్ కార్యకలాపాలు, ఇతర సంక్షేమ పథకాల పరిస్థితి అధ్వాన్నంగా మారింది.

ఏదైనీ ఒక శాఖ లేదా విభాగంలో అధికారులందరూ ఉన్నప్పటికీ పథకాల అమలుతీరు అంతంత మాత్రమే ఉంటుంది. అలాంటిది.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పంచాయతీరాజ్ శాఖలో దాదాపు మూడు వేల పోస్టులను ప్రభుత్వం భర్తీచేయలేదు. కీలకమైన పోస్టులు ఖాళీగా ఉంచడం, కొన్ని పోస్టుల్లో ఉన్నా ఇన్‌చార్జీల పాలనలో నిర్ణయాలు తీసుకోలేకపోవడం, ప్రతి విషయంపైనా ఉన్నతాధికారులకు ఫైళ్లు పంపాల్సి రావడం, నిర్ణయాలు ఆలస్యంగా వస్తుండటంతో పరిపాలన వ్యవహారాలు సాఫీగా సాగడం లేదు. ప్రతి పనిలోనూ తీవ్ర జాప్యం చోటుచేసుకుంటున్నది. మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, సెర్ప్‌లో పెద్ద సంఖ్యలో ఖాళీలు నమోదయ్యాయి. నేరుగా గ్రామీణ ప్రజలు తిరుగాడే ఆయా కార్యాలయాల్లోని సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బోసిబోతున్నాయి. పనులు జరగడం లేదు. మరోవైపు గ్రామ ప్రజలకు సంక్షేమ ఫలాలు సక్రమంగా అందడం లేదు. ఇంజనీరింగ్ విభాగం మినహా మిగతా అన్ని శాఖల్లోనూ ఇదే దుస్థితి. గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, మండలాల్లో ఎంపీడీవోలు, జిల్లా పరిషత్‌ల్లో సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, అక్కౌంటెంట్లు, సూపరింటెండెంట్లు, ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రెండేండ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. పలుమార్లు కిందినుంచి ప్రతిపాదనలు సర్కారుకు చేరాయి. అలాగే ప్రభుత్వం సైతం కొన్ని సందర్భాల్లో ప్రత్యేకంగా తెప్పించుకుంది. అయినా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అన్నట్టుగానే ఉంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా గత ఏడాది మే వరకు మంత్రి కె. తారకరామారావు ఉన్నారు. ఆనక జూపల్లి కృష్ణారావు బాధ్యతల్లోకి వచ్చారు.. ఉన్నతాధికారులు సైతం ఖాళీలకు సంబంధించి ప్రతిపాదనలు పంపినా, సర్కారు నుంచి ఉలుకూ పలుకు లేదని తెలిసింది. రకరకాల కారణాలచేత తొలగించబడ్డ ఉద్యోగుల స్థానాలు భర్తీకాకుండానే ఉండిపోతున్నాయి. అలాగే స్వయంగా ఉద్యోగులే రాజీనామా చేసి వెళ్లిపోయిన సందర్భంలో కూడా పోస్టులను భర్తీ చేయడం లేదు. దీంతో సంక్షేమ పథకాలు అత్తెసరు సిబ్బందితో అమలు చేయాల్సి వస్తున్నది. సరైన పర్యవేక్షణ లేక మార్గదర్శకాల ప్రకారం పనులు చేయలేకపోవడం, అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా పర్యవేక్షణా లోపం కనిపిస్తున్నది. జాతీయ ఉపాధి హామీ పథకంలోనూ పోస్టుల ఖాళీల మూలంగా కూలీలకు అందాల్సిన పనిదినాలు తగ్గిపోతున్నాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో అమల్లో కీలకమైన పేదరిక నిర్మూలనా పథకాలు కుంటుపడుతున్నాయి. పింఛన్లు, పల్లెప్రగతి, ఇతర జీవనోపాధుల పథకాలు క్షేత్రస్థాయిలో పక్కాగా, పారదర్శకంగా అమలుచేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అరకొర సిబ్బందితోనే జిల్లా, మండల, గ్రామపంచాయతీల యంత్రాంగం నెట్టుకొస్తున్నది. గత మూడేండ్లుగా మూడు జిల్లా పరిషత్‌లకు సీఈవోలు లేరు. ఇన్‌చార్జీలతో నడుస్తున్నాయి. ఆ తరువాత భర్తీ చేశారు. దాదాపు అందరూ ఇన్‌చార్జీలే కావడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు ఒకటిరెండు మినహా అన్ని జిల్లాల్లో డిప్యూటీ సీఈవో పోస్టులు ఖాళీనే. భర్తీకాకుండా ఉన్నాయి. అకౌంటెంట్ పోస్టులదీ అదే పరిస్థితి. రాష్ట్రంలోని 338 మండలాలకుగాను 328 మంది ఎంపీడీవోలు ఉండగా, 110 మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. గ్రామపంచాయతీల స్థాయిలోనూ ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు పోస్టులు, పంచాయతీ కార్యదర్శుల పోస్టులను నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఒక్కో పంచాయతీ కార్యదర్శి మూడు, నాలుగు గ్రామాలకు ఇన్‌చార్జీలుగా ఉంటూ స్థానికులకు సేవలు అందించడంలో సతమతమవుతున్నారు..విఫలమవుతున్నారు. సమస్యలు ఎక్కడికక్కడే పెండింగ్‌లో ఉంటున్నాయి. ఉపాధి హామీ చట్టంలో ఒక్కో జిల్లాలో 10 నుంచి 15 మంది అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్(ఏపీవో) పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అలాగే మండలస్థాయిలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులను నింపలేదు. దీంతో సంక్షేమ కార్యక్రమాల అమలు అంతంతమాత్రంగానే ఉంటున్నది. నిరుపేద లబ్ధిదారులకు సమయానుకూలంగా పరిపాలనా ఫలాలు అందడం లేదు. ఈ విషయమై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను సంప్రదించగా, తాము ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పేరు రాయడానికి ఇష్టపడని ఒ ఉన్నతాధికారి చెప్పారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి సమాచారం రాలేదని అంటున్నారు.

ఖాళీల వివరాలు

పోసు	మొత్తం	పనిచేస్తున్నవారు	ఖాళీలు
సీఈవో	09	08	01
డిప్యూటి సీఈవోలు	09	00	09
అకౌంట్ ఆఫీసర్లు	09	00	09
ఎంపీడీఓలు	438	328	110
డీపీవోలు	09	08	01
డివిజనల్ పంచాయతీ అధికారులు	28	27	01
ఎక్స్‌టెన్షన్ అధికారులు	438	308	130
పంచాయతీ కార్యదర్శులు	6353	4346	2917